: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

15-9-2025 సోమవారం సంపుటి: 31

సంచిక: 225 పేజీలు: 12 వెల: 6.50


శ్రీకాకుళం

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

# పాక్‌కు మరో చావుదెబ్బ



సూర్యకుమార్ యాదవ్

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

**7 వికెట్ల తేడాతో ఘన విజయం**

**127 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్**

**భారత్ బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు చిత్తు**

**కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్**

**ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్**

**దుబాయి, సెప్టెంబరు 14:** యావత్‌క్రికెట్‌ప్రపంచం మొత్తం ఉత్కంఠభరితంగా ఎదురుచూసిన మ్యాచ్‌లో అందరూఊహించినట్లుగానే భారత్ ఘనవిజయం సాధించింది. ఆదివారం దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్తాన్‌తో తలపడిన భారత్‌జట్టు అత్యంత సులువుగా గెలుపు సాధించింది. ఏడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ జట్టుపై ఘనవిజయం నమోదుచేసింది. ప్రపంచకప్‌లోనే కాదు ఆసియాకప్‌లో కూడా మాకు తిరుగులేదని భారత్‌జట్టు రుజువుచేసింది. చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించింది. మెగాటోర్నీలో రెండో విజయం సాధించింది. కుల్దీప్‌యాదవ్ విజృంభణతో 127 పరుగులకే ముందు పాకిస్తాన్ పరిమితం అయింది. ఛేదనలో అభిషేక్‌శర్మ 31పరుగులుచేసి మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆతర్వాత సూర్యకుమార్ యాదవ్ 47 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్‌వర్మ 31 పరుగులుచేయగా ఆతడికి జోడీగా 56 పరుగులు జోడించిన సూర్యజట్టు విజయానికి బాటలువేసాడు. చివరిలో

## స్కోర్లు పాక్: 127/9, భారత్-131/3

శివందూబై తనదైన స్టైల్‌లో ఆడగా సిక్సర్‌తో భారత్‌కు ఏడు వికెట్ల విజయం వరించింది. అభిషేక్‌శర్మ కేవలం 13 బంతుల్లో నాలుగు ఫోర్లు రెండు సిక్స్‌లతో 31పరుగులుచేస్తే శుభ్‌మన్‌గిల్ తక్కువ పరుగులకే ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ తిలక్‌వర్మలే మ్యాచ్‌ను నిలబెట్టారు. తిలక్‌వర్మ 31 శివమ్‌దూబే 10తో కలిసి సూర్యకుమార్ 47 పరుగులుచేసి జట్టు విజయానికి బాటలువేసారు. పాకిస్తాన్ బౌలర్లలో స్పిన్నర్ సెయిమ్ ఆయూబ్ మూడు వికెట్లు తీసాడు. మ్యాచ్‌లో గిల్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఎస్కేవై రన్‌ఛేజ్‌కు తగ్గట్లుగా స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. గతంలో పాక్‌పై పెద్దగా రాణిం చలేక పోయిన ఈ ప్లేయర్ ఈసారి మాత్రం పట్టుదలతో ఆడాడు. చివరి వరకూ క్రీజులో ఉండి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను గెలి పించాడు. తిలక్‌వర్మ 31 బంతుల్లో 31 పరుగులుచేసే >>2




లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో అవార్డ్ అందుకుంటున్న దేవాన్ష్

## 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు 2లో

**'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన సిఎం చంద్రబాబు మనుమడు**

# వృద్ధిరేటు లక్ష్యం 15%

**పౌరసేవలు జవాబుదారీగా ఉండాలి**

**ఐదేళ్లలో 125 కేబినెట్ భేటీలు, 25 కలెక్టర్ కాన్ఫరెన్స్‌లు లక్ష్యం**

**నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు**

**మంత్రులు, కార్యదర్శులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం**



**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సుపై తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన గత రాత్రి పొద్దు పోయేంతవరకు సమావేశమయ్యారు. పౌరసేవలు, సంక్షేమ పథకాలపై పబ్లిక్ పర్సెప్షన్‌ను విశ్లేషిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటుకు చేరుకున్నామని అన్నారు. 2029 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లకు చేరే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 2034కు తలసరి ఆదాయం రూ.10.55 లక్షలకు చేరేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీలో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని అన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సి ఉందని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ 25 కేబినెట్ సమావేశాలు నిర్వహించామని.. ఐదేళ్లలో 125 కేబినెట్ సమావేశాలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అదే సంఖ్యలో రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే ఏడాదిలో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి చొప్పున ఐదేళ్లలో 25 జిల్లా కలెక్టర్ సమావేశాలూ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయిందని అన్నారు.

**కలెక్టర్ల కాన్ఫరెన్సులో 8 అంశాల వారీగా చర్చ:** ఈసారి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సును విభిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీగా జవాబు దారీతనం ఉండేలా ఈ కాన్ఫరెన్సు నిర్వహించ >>2



# గరళ కంఠునిలా విషమైనా మింగేస్తా

**ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానించడమా?**

**హజారికాపై కాంగ్రెస్ ఘోరతప్పిదం**

**అసోం బహిరంగసభలో ప్రధాని మోడీ**

**గువాహతి,సెప్టెంబరు 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రముఖ గాయకుడు, భారతరత్న భూపేన్ హజారికాను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు.మొత్తంగా రూ.18,500 కోట్ల విలువైనప్రాజెక్టులకు ఆయన భూమిపూజనిర్వహించారు. వీటిలో బయో ఇథనాల్; పోలిప్రొపైలెన్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. తర్వాతజరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, "భూపేన్ హజారికాకు భారతరత్న ప్రకటించిన రోజు, పాటలు పాడేవారికి, డ్యాన్సులు చేసేవారికా మోదీ భారతరత్న ఇచ్చేది అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి" అని తెలిపారు. తనను ఎవరైనా దూషించినా తాను శివుడిలా విషాన్నిదిగమింగుతానని, కానీ ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానిస్తే మాత్రం సహించలేనని ఆయన భావోద్వేగంగాఅన్నారు. అంతకుముందు, మంగళ్‌దోయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్త మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, జీఎన్ఎం స్కూల్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి



ఆదివారం తిరుపతిలో మహిళా సాధికారత సదస్సును ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. చిత్రంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణరాజు

**మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యంకాదు..**

**ఆధ్యాత్మిక, సామాజిక ఉద్యమాల్లోనూ మహిళ కీలకపాత్ర**

**తిరుపతి జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా**

**తిరుపతి,సెప్టెంబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా శక్తికారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్‌ముఖ్యదేశంగా అవతరించిందని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా అన్నారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆదివాసీ నేపథ్యం నుండి వచ్చిన మహిళ ప్రస్తుతం భారతరాష్ట్రపతిగా ఉన్నా రని ఆయన గుర్తుచేశారు. మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యం కాదని, అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక సామాజిక ఉద్యమాల్లోనూ స్త్రీలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. తిరుపతిలో ఆదివారం మొదలైన రెండురోజుల జాతీయ మహిళా సాధికారత సదస్సులో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పార్లమెంట్,శాసనసభ మహిళా ప్రజాప్రతినిధులతో కలసి తొలిరోజు జ్యోతివెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్‌సభస్పీకర్ బిర్లా మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అనాదికాలంనుండి వస్తున్న భారత సంప్రదాయమన్నారు. మహిళల భాగస్వామ్యంలేకుండా ఏ దేశం అభివృద్ధిచెందలేదని తెలిపారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించిందని, మహిళా శక్తితోనే భారత్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. భరతభూమిలో మహిళా నాయకత్వం శతాబ్దాలకు ముందే ప్రారంభమైందని ఆయన గుర్తుచేశారు. నేడు అనేక రంగాల్లో మహిళా నాయకత్వం బలోపేతమైందన్నారు. రాజకీయాలు, శాస్త్రసాంకేతిక రంగంతోబాటు చివరకు ఎంతో కీల కమైన సైన్యంలోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తుండటం చూస్తున్నామన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ >>2



# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

**జిఎస్టీ సంస్కరణలతో దేశం మరింతముందుకు: జెపినడ్డా**

**విశాఖపట్నం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అనేది దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు . ఆదివారం రైల్వే గ్రౌండ్స్ లో నిర్వహించిన సారథ్యం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తోపాటు మహావిష్ణువు సింహాచల కొండపై వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సారథ్యం సభలో విజయవంతంగా నిర్వహించారని 26వ జిల్లాగా విశాఖపట్నంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారని ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు తాను ఒకసారి తిరుపతి వెళ్లానని అక్కడ తాను వైసిపి పూర్తిగా అవినీతి లో ఊరికిపోయిందని వాటిని నిర్మూలించవలసిన అవసరం ఉందని ప్రజలకు చెప్పానని తెలిపారు. అయితే ఎన్నికలు జరిగింతర్వాత డబల్ ఇంజన్ సర్కార్కు ప్రజలు పట్టం కట్టారని ఆయన అన్నారు. 11 సంవత్సరాల తర్వాత వచ్చిన మార్పులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాకముందు ఏ విధంగా దేశం ముందుకు సాగిందో ఆలోచించేయాలని ప్రతి ఒక్కరిగా అయినా సూచించారు. నరేంద్ర మోడీ పేదవాడి అభివృద్ధి కోసం ఎటువంటి కార్యచరణ చేపడుతున్నారో >>2

# నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** అల్పపీడనం,ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు.. కురిసేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఇక సోమవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు >>2



ఆదివారం గంగమ్మకు జలహారతి ఇస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# పెన్నకు నీరు విడుదల

- సోమశిల జలాశయం నుంచి నదిలోకి నీటిని వదిలిన మంత్రి ఆనం
- 3 జిల్లాలకు నీరు అందించేలా ప్రణాళికలు
- నెల్లూరుకు 150 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యం
- టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు

**అనంతసాగరం (నెల్లూరు), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** చుట్టుప్రక్కల ఉన్న ఐదు జిల్లాల కంటే సోమశిల జలాశయానికి 150 టిఎంసిల నీటిని నిల్వ చేసుకున్న సామర్థ్యం నెల్లూరు జిల్లాకే ఉందని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సోమశిల జలాశయం నుండి 5,6గేట్ల ద్వారా పెన్నానదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జలహారతినిచ్చారు. అనంతరం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం సామర్థ్యాన్ని >>2

# తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

**రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా నిర్మాణం: సిఎం**

**విజయవాడ,సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షను ముఖ్యమంత్రి నిర్వహించారు. నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలన్నారు. హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్‌వే,కమర్షియల్ కాంప్లెక్స్‌లు, >>2

# వృద్ధిరేటు లక్ష్యం15%

>> నున్నట్టు తెలిపారు. సరైన వ్యక్తి, సరైనచోట ఉండాలన్న లక్ష్యంతోనే కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేశామని అన్నారు. తాను 4వ సారి ముఖ్యమంత్రి అయినా ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటూనే ఉంటానని సీఎం అన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా మెరుగైన పాలన అందించే అంశంపై అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సులో మొదటి రోజున జీఎస్డీపీ అంశంపై ప్రజెంటేషన్ లో భాగంగా సేవలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. జిల్లాలు ఈ రంగాల్లో ఎక్కడ ఉన్నాయన్న దానిపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకుంటామన్నారు. ఇక రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్, అన్నా క్యాంటీన్లు, పీ4 తదితర అంశా లను సమీక్షించనున్నట్టు తెలిపారు. మూడో అంశంగా లాజిస్టిక్స్, మోలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించిన ప్రజెంటేషన్ ఉంటుందని తెలిపారు. నాలుగో అంశంగా స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై జిల్లాల వారీగా పురోగతి తెలుసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక రెండో రోజున ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్, ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీజిహెచ్, వాట్సప్‌లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చిస్తామని వివరించారు. ఏడో కేటగిరీలో రెవెన్యూ విభాగంలో భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి అంశాలపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రెండో రోజు 8వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ విభాగాలు అందించే పౌరసేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపైనా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ విజన్ ను పటిష్టంగా అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.

**నెక్స్ జెన్ సంస్కరణలపై కమిటీ:** ఆర్టీజీఎస్ ద్వారా నేపాల్‌లో చిక్కుకు పోయిన తెలుగు వారిని వెనక్కు తీసుకువచ్చే ఆపరేషన్ విజయవంతమైందని సీఎం వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేష్ సహా అధికారులు కృషి చేశారని, దీనిపై ప్రజల్లో ప్రభుత్వం పట్ల మంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. వివిధ సంక్షోభ సమయాల్లో సరిగ్గా స్పందిస్తేనే ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతాయని సీఎం అన్నారు. అమరావతిలోని సీఆర్డీఏ భవనంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం ఇటీవల జీఎస్టీని రెండు స్లాబులకు కుదిస్తూ తెచ్చిన సంస్కరణ విజయవంతమైందని.. ఏపీలోనూ నాలా పన్ను రద్దు చేసి నెక్స్ జెన్ సంస్కరణను అమలు చేశామని సీఎం అన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీ వేయాలని సీఎం సూచించారు. మరోవైపు చిన్న చిన్న కోర్టు వివాదాల కారణంగా ప్రభుత్వ సమయంతో పాటు ధనమూ వృధా అవుతోందని, ఆర్బిట్రేషన్ ద్వారా కొన్ని అంశాలను పరిష్కరించుకునే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

**తెలుగు సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, కళలు ఉట్టిపడేలా ఎన్టీఆర్ స్మృతివనం:** తెలుగువారి ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం కలగలిపి తెలుగు వైభవంగా అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. అమరావతిలోని నీరుకొండ వద్ద చేపట్టనున్న ఈ ప్రాజెక్టులోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రాచీన తెలుగు చరిత్రతో పాటు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయిన అల్లూరి, పొట్టిశ్రీరాములు లాంటి విశిష్ట వ్యక్తుల విగ్రహాలు, సంస్కృతీ సంప్రదాయాలు, భాష, లిపికి చెందిన వివరాలను కూడా తెలియచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలుగు ప్రజల ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిని కూడా ప్రతిబింబించేలా ప్రాజెక్టు చేపట్టాలన్నారు. 182 మీటర్ల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహ స్మృతి వనం ప్రాజెక్టుకు అనుబంధంగా నీరుకొండ రిజర్వాయర్ ను తీర్చిదిద్దాలన్నారు. ప్రత్యేకించి పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించేందుకు అనువుగా ఆకర్షణల్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గుజరాత్ లో నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన డిజైన్లను కూడా సీఎం పరిశీలించారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకముందు ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను పరిశీలించారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి

>> కల్పించేందుకు చట్టం తీసుకువచ్చామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం భారతదేశంలో సంప్రదాయమని బిర్లా ఉద్ఘాటించారు.

**మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎంతో కృషి: :రాజ్యసభడిప్యూటీ చైర్మన్ హరివంశ్‌సింగ్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మాజీ సిఎం



మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

ఎన్టీరామారావు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్ తెలిపారు. తిరు పతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సుప్రారంభంలో ఆయన ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుని ప్రణామాలు తెలిపారు. మహిళల సాధి కారత కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. బీహార్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం మహి ళలకు రిజర్వేషన్లు, జన్‌ధన్ యోజనలో సగానికిపైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు. ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు చేపడుతున్న మహిళల అభివృద్ధి,సంక్షేమంకు ప్రశంసలు కురిపించారు. తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీసిటీలో చంద్రబాబు నాయుడు చొరవతోనే సగానికిపైగా మహిళలు ఉద్యోగాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్యగణనను ఏపిలో చేపట్టారని సింగ్ తెలిపారు.

**మహిళా భాగస్వామ్యంతోనే 'వికసిత్‌భారత్':ఎంపి పురందేశ్వరి**

మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాకారమవుతుందని బిజెపి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేంద్రం ఎన్నో పథకాలు అమలుచేస్తోందన్నారు. 'భేటీ బచావో బేటీ పడావో',మహిళా సమ్మాన్‌నిధి వంటి అనేక పథకాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థిక సమానత్వం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తు న్నారని ఆమెతెలిపారు. ఇంకా ఈ సదస్సులో ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు,డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు,ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్,దేశంలోని కేంద్రపాలి తప్రాంతాలు, వివిధ రాష్ట్రాలమహిళా మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ఏపి,తెలంగాణ మహిళా ప్రజాప్రతినిధులు

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

>> శివమ్ దూబే ఏడు బబంతుల్లో పది పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనితో 15.5 ఓవర్లలోనే భారత్‌మూడు వికెట్ల నష్టానికి 131 పరుగులుచేసి లక్ష్యాన్ని అధిగమించి విజయం సాధించింది. టాస్‌గెలిచి తొలుత బ్యాటింగ్‌చేసిన పాకిస్థాన్‌ను తొమ్మిది వికెట్ల నష్టానికి 127 పరుగులకే పరిమితంచేసారు. కుల్‌దీప్‌యాదవ్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్ 18 పరుగులిచ్చి రెండు వికెట్లుతీసాడు. అలాగే జస్‌ప్రీత్‌బుమ్రా 28 పరుగులకు రెండు వికెట్లు తీసి పాక్ బ్యాటర్లను ఆడుకున్నారు.భారత బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ బ్యాటర్లు వణికిపోయారు. తొలి ఓవర్ మొదటి బంతికే సైమ్ ఆయూబ్ వికెట్ ను హార్థిక్ పాండ్య పడేసాడు. తర్వాత ఓవర్‌లో బుమ్రా మహ్మద్ హ్యారిస్‌ను ఔట్‌చేసాడు. తర్వాత స్పిన్నర్లు కుల్దీప్‌యాదవ్ అక్షర్‌పటేల్‌లు కలిపి ఐదు వికెట్లు తీయడంతో పాక్ కోలుకోలేకపోయింది. ఒకదశలో 64 పరుగులకే ఆరువికెట్లు నష్టపోయిన పాక్ చివరిలో షాహీన్ అఫ్రిదీ 16 బంతుల్లో 33పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు.

వేగంగా ఆడటంతో దాయాది జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 127 పరుగులతోనే సరిపెట్టుకోవాల్సివచ్చింది. పాక్‌పై గెలిచిన భారత్ జట్టు ఆసియాకప్ సూపర్-4లోకి ప్రవేశించింది.కుల్దీప్‌యాదవ్ కేవలం 18 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.









# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

## లండన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనవడు నారా దేవాన్ష్ అందుకున్నారు. విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించారు. తద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని 'ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్175 పజిల్స్' అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం 5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్ పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్ ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు. ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం అని అన్నారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

**సంతోషంగా ఉంది : సిఎం చంద్రబాబు:** దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించడంపై సీఎం చంద్రబాబు సంతోషంగా ఉందన్నారు., "మా దేవాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు 2025 అందుకోవడం గర్వంగా ఉంది" అని తెలిపారు. నెలల తరబడి చూపిన పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయంసాధ్యమైందని చంద్రబాబు పేర్కొన్నారు. దేవాన్ష్ సాధించిన ఈ రికార్డు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన దేవాన్ష్‌ను శభాష్ ఛాంప్‌అంటూ ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేవాన్ష్ ప్రతిభకు గుర్తింపు లభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



5,6గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

# పెన్నకు నీరు విడుదల

>> తొలుత అనుకున్న దానికన్నా 77 టిఎంసిల సామర్థ్యం వరకు పెంచినప్పటికీ కొన్ని పరిస్థితుల దృష్ట్యా 74 టిఎంసిల వరకు నీటిని నిలువ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణానది నుండి శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమ, నెల్లూరుకి నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంధ్యాల జిల్లా లో పర్యటించినప్పుడు కుందునది ప్రవాహం అధికంగా ఉందని అక్కడి నుండి నీరు పెన్నా నదికి చేరుకోవడం జరుగుతుందని గమనించామన్నారు. సోమశిల జలాశయం శంఖుస్థాపన నుండి ఎన్నో సందర్భాల్లోచేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారన్నారు. ఆదివారం నుండి 20 టిఎంసిల నీటిని విడుదల చేశామని అందులో కండలేరు జలాశయానికి, తెలుగు గంగ, కనుపూరు, కలువాయి కాలువలకు నీటిని విడుదల చేయడానికి తీసుకోవడం జరిగిందన్నారు. కండలేరు సామర్థ్యంమేరకు నీరు చేరుతుందన్నారు. ఫ్లడ్‌ఫ్లో 24 వేల క్యూసెక్కులు పెంచడానికి టైం పడుతుందన్నారు. టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రక్షణచర్యలు తీసుకోవాలని సూచించారు.లక్ష క్యూసెక్కుల పైన నీరు దాని ప్రభావం ఉంటుందన్నారు. ఆనం సంజీవరెడ్డి తెనాలి ద్వారా కరువు పీడిత మండలాలైన మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరుకు నీటిని అందజేసి పనులు ప్రారంభించినట్లు మంత్రి ఆనం తెలిపారు. హైపవర్ కెనాల్ ద్వారా 60 నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా దీపం2కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం, స్త్రీశక్తి, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటివి ఉన్నాయన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**మంత్రి ఆనంకు స్వాగతం పలికిన కేశవచౌదరి :** రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిలలో పర్యటించారు. తొలుత సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేసే సందర్భంగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానించి బొకే అందజేశారు.

# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

>> సబ్కా సత్ సబ్కా వికాస్ సైతాంతిక సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు అన్నారు. కాశ్మీర్ రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పినట్లు చేశామని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేశామని చెప్పారు. రామజన్మభూమి లో రాముని ఆలయం నిర్మించామని ముస్లిం సమాజానికి ముస్లిం మహిళలకు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పార్లమెంట్లో సవరణ తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు. బిజెపి అనేది కార్యకర్తల పార్టీ అని ప్రపంచంలో అత్యధిక రాజకీయ పార్టీగా బిజెపి ఉందని ఆయన చెప్పారు. 2024లో నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన నాటికి ఆర్థిక పరిస్థితి నత్త నడక నడిచేదని ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ఇప్పుడు మొదటి స్థానంలో ఉందని ఇది గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రాబోయే తరానికి జీఎస్టీ 2.0 నీ తీసుకొని సంస్కరణలో తీసుకువచ్చామని దేశంలో సెప్టెంబర్‌లో దసరా దీపావళి ఒకే నెలలో వచ్చినట్లు ఉం టుందని అన్నారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ పూర్తిగా తీసివేస్తున్నామని దేశం ఆరోగ్య దేశంగా ఉండాలని మోడీ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. రక్షణ రంగంలో ఏడు రెట్లు ప్రగతి సాధించామని మందులు తయారీ అభివృద్ధిలో కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అమృత్ భారత్ గా వందే భారత్ పేరుతో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తున్నామని, భోగాపురం నిర్మాణం జరుగుతుందని ఆయన తెలి పారు. 17 మెడికల్ కళాశాలలు కట్టిస్తున్నామని అమరావతి రాజధాని కట్టేందుకు సహకరిస్తున్నామని అని చెప్పారు. ముఖ్యంగా దక్షి ణ కోస్తా ప్రాంతంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందన్నారు. పాలన ఏ విధంగా ఉందో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. 15 నెల ముందు ఆంధ్రప్రదేశ్ పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని ఇప్పుడు ఆంధ్రాని చంద్రబాబు నాయుడు వెలుగులోకి తీసుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, పరశురామరాజు, శివ ప్రకాష్ రెడ్డి, ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు కేంద్రం పెద్దపీట: మంత్రి అనిత

**తిరుపతిరూరల్,సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మహిళల భద్రత కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు విచ్చేసిన మంత్రి మీడియాతో మాట్లాడారు. తల్లిని చెల్లిని ఏవిధంగా గౌరవిస్తారో అలానే ఇతర మహిళలను కూడా గౌరవించాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుఅడుగు వేస్తే, అనుకున్న సాధించవచ్చునని తెలిపారు. వ్యక్తిత్వ హననం వల్ల మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. మహిళల శక్తిని దిగజార్చితే దేశమనుగడే ప్రశ్నార్థకంగామారుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల సంరక్షణకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళను మహిళాగానే చూడాలి తప్ప...ఆట వస్తువుగా చూడరాదన్నారు.మహిళలు భయం, ఆందోళనలు మన స్సులోంచి తీసివేయాలన్నారు.

## వారం - వర్జ్యం

15-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
నవమి రా.1.33
మృగశిర ఉ.7.32
వర్జ్యం : మ.3.40-5.13
దు.మ.12.29-1.18,
2) మ.2.55-3.44
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** అప్పులు ఇవ్వడం, అప్పులు తీసుకోవడం రెండు లాభించవు. ప్రయాణాలు.

**మిథునం:**పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడుతుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం:**ముఖ్యమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు బాగా పరిశీలించి సంతకాలు చేయటం మంచిది.

**సింహం:**మీ మౌనము మీ సహనము మీరు మేలు చేస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** శారీరకంగా, మానసికంగా అలసట, పని భారము అధికమవుతాయి. వస్త్ర లాభం.

**తుల :** స్థిరత్వము, ధైర్యము వలన చాలా ఫలితములు అనుకూల దిశలో పయనిస్తాయి.

**వృశ్చికం:**నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** విదేశీ పర్యటన అవకాశాలు ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**కుంభం:** గృహ సంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, అదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**మీనం :** కొద్దిపాటి స్పర్ధలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అత్యాధునిక బస్‌స్టేషన్

>> మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు. తిరుపతితో పాటు కీలక నగరాల్లో బస్ స్టేషన్లు అభివృద్ధి చేయాలన్నారు,ఆయా నగరాల్లో అవసరత బట్టి ప్రాంతీయంగాను బస్‌బేలు పెరగాలన్నారు.దీని వలన కీలక ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉండటమే కాకుండా, ప్రధాన స్టేషన్‌పై వత్తిడి తగ్గుతుందన్నారు.జాతీయరహదారులకు అందుబాటులో బస్‌స్టేషన్లు ఉండాలన్నారు.

# నాలుగు రోజులు వర్ష సూచన

>> కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరులో 81మిమీ,పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5మిమీ, పెద్దకూరపాడులో 40.2మిమీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5మిమీ, కోనసీమ జిల్లా ముక్కములలో 39మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.గుంటూరు కురిసిన భారీ వర్షం నగరాన్ని అతాకుతలం చేసింది.కీలక రహదారులన్ని కాల్వలుగా మారాయి. జాతీయరహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.

# ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్ధరించాలి

## ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్ధరించాలని ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. పలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజల అభివృద్ధికి, బలహీన వర్గాల సుస్థిర జీవితానికి ఆశాజ్యోతి వలే నిలిచిన ఆర్‌డిపై ఇటీవల కుట్రలు జరుగుతున్నాయన్నారు.

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD
OPERATION CIRCLE : ASR PADERU
E-TENDER NOTICE
T.No. 26 to 31/25-26/SE/O/ASR/EE/T&C/DEE/C&T/D.No.692/25, Dt:12.09.2025
Tenders are invited from the Registered Contractors for "Carrying out of monthly spot billing work on work contract basis in 06 No's Operation Sub-Divisions of Paderu and Rampachodavaram Operation Divisions in ASR circle for a period of 24 months from the date of awarding of work". For detailed tender notice explore website www.apeasternpower.com or www.tenders.apeprocurement.gov.in. Last date for receipt of tenders on line is Dt:29.09.2025 at 15:00 Hrs.
Ph : 9490610027 Advt-85 Sd/- Superintending Engineer

15-09Pg3exHMNWJQEV.qxd:15-09Pg3exHMNWJQEV.qxd 1/1/02 9:10 AM Page 1





విజయవాడ బస్‌స్టేషన్‌లో మంచినీటి పాయింటును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు ఆహర విక్రయ దుకాణాలు,హోటళ్ళు మంచినీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిస రాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవా లన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణి కులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలం దించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శిం చాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

## ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎండిగా పృథ్వీతేజ్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎమ్‌డిగా పృథ్వీతేజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 86ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం విడుదల చేశారు. ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా ఉన్న కీర్తిని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా నియ మించారు. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా ఉన్న పృథ్వీతేజ్‌కు ట్రాన్స్‌కో జెఎమ్‌డికి ఎపి పవర్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

# రాజంపేట టు పుంగనూరు ఎర్రచందనం స్మగ్లింగ్

## 20 దుంగలు స్వాధీనం: ఒకరి అరెస్టు



**ప్రభాతవార్త ప్రతినిధి, పుంగనూరు సెప్టెంబర్ 14** తమిళనాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి సెంట్రల్ జైలు లో కలిసిన నలుగురు నేరస్తులు ముఠాగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి చివరకు పుంగనూరులో పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రిష్ణగిరి చెందిన మణివన్, తిరువన్నామలై కి చెందిన రవి, కర్ణాటక హుస్కోట కు చెందిన సయ్యద్ ఆరిఫ్, తమిళనాడు హోసూరు కు చెందిన సర్దార్ అనే నిందితులు కృష్ణగిరి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. శిక్ష ముగిసిన తర్వాత విడుదలైన ఈ నలుగురు ఎర్రచందనం స్మగ్లింగ్ కు పథకం రచించారు. అనుకున్నది తడవుగా కడప జిల్లా రాజంపేట అడవుల నుంచి 20 ఎర్రచందనం దుంగలను సేకరించారు. శనివారం వీటిని రవాణా చేసేందుకు ఒక ఇన్నోవా వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, దుంగలను అందులో తరలించారు. అర్ధరాత్రి వేళ అక్రమ మార్గాల గుండా వాహనం ప్రయాణిస్తున్న తీరును పోలీసు నిఘా వర్గాలు గమనించాయి. పలమనేరు డి.ఎస్.పి ప్రభాకర్ ఆదేశాల మేరకు పుంగనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, ఎస్సై హరి ప్రసాద్ సిబ్బంది కలసి ఈ వాహనాన్ని పుంగనూరు సుగాలి మిట్ట మార్గంలోని నేతిగుట్లపల్లి వద్ద అడ్డగించారు. అప్పటికే వాహనం ముందర రెండు ద్విచక్ర వాహనాల్లో మార్గం చూపుతూ ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పరారయ్యారు. కారులో ప్రయాణిస్తున్న మరో నిందితుడు కూడా పరారు కాగా వాహనంతో పాటు సర్దార్ అనే నిందితులు పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనిని విచారించగా తక్కిన ముగ్గురు నిందితుల వివరాలు తెలిసాయి. మొత్తం 20 ఎర్రచందనం దుంగలను, మీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం విలువ 34 లక్షల రూపాయలుగా నిర్ధారించారు. తక్కిన ముగ్గురు నేరస్తులను కూడా అదుపులో తీసుకున్నందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. రాజంపేట అడవుల నుంచి పుంగనూరు అడవుల వరకు పల్లె దారులలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ గతంలో పలు వాహనాలు పట్టుబడ్డాయి. పుంగనూరు అడవులను అడ్డుగా పెట్టుకుని ఎర్రచందనం రాత్రికి రాత్రే చెన్నై హార్బర్ చేర్చేందుకు సినీ ఫక్కీలో నేరస్తులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేస్తున్నారు.

## నాలుగో ఆర్థిక సంఘం అమలు పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగవ ఆర్థిక సంఘం అమలు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కొద్ది రోజుల క్రితమే ఐదో ఆ ర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు, ఎప్పుడో కాలపరిమితి దాటిపోయిన నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాలుగో ఆర్థిక సంఘం కాలంలో చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడంతో దానిని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018 లోనే నాలుగ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికలను 2021 నుంచి 2024 మధ్య కాలంలో అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో నాలుగో ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిపోయిన రెండేళ్ల వరకు కొత్త ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడంతో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 2023 లో ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటికీ నాలుగో ఆర్థిక సంఘం నివేదిక మాత్రం పూర్తిగా అమలు కాకపోవడం గమనార్హం ప్రధానంగా స్థానిక సంస్థల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలు ఆగిపోయాయన్న విమర్శలు కూడా ఉన్నాయి. 2024లోనే ఈ నివేదిక అమలు పూర్తికావాల్సి ఉందని, అయితే అనేక కారణాలతో ప్రగతి కనిపించ లేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ఈ అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగించాల్సి వచ్చిందని వారంటున్నారు. కాగా ఐదో ఆర్థిక సంఘం కూడా కొద్ది రోజుల క్రితమే తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. దీని అమలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులే పూర్తిగా అమలు కాని నేపథ్యంలో ఇక ఐదో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు ఎప్పుడు ప్రారంభమవుతాయె చూడాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం తన తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారు. తిరుపతిలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే అధికారుల సూచనలను అనుసరించి సీఎం తన పర్యట నను రద్దు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు., అమరావతి తిరుపతి మార్గంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్ ప్రయా ణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. దీంతో సిఎం చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు, తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరిగే మహిళా సాధికారతపై జాతీయ సదస్సులో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, బీజేపీ ఎంపీ పురందరేశ్వరి సహా పలు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతుంది.

# తిరుమలలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

- వాహనసేవల వీక్షణకు 35 ఎల్ఇడిస్క్రీన్లు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పదిరోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే తిరుమలలో ఆలయ మాఢవీధుల్లో ఏర్పాట్లు దాదాపు పూర్తికావస్తున్నాయన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణకు భక్తులకు తిరుమలఅంతటా 35 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆదివారం సాయంత్రం టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాఢవీధుల్లో తనిఖీ చేశారు. పదిరోజుల్లో మొదలుకానున్న స్వామివారి వాహనసేవల వీక్షణకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు,అందులో ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత, సౌకర్యాలు ఏర్పాటుచేస్తామన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

## విజయవాడలో డయేరియాపై ఆందోళనపడాల్సిన అవసరం లేదు: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని డయేరియాపై ఎవ్వరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదు అని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ... డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. విజయవాడ రాజరాజేశ్వరి పేటలో ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, హ్యాండ్ వాష్, పినాయిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. డయేరియాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను సంప్రదించాలని సూచించారు.

## సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి తీసుకొచ్చింది మీరు, పిపిపి విధానంపై దుష్ప్రచారం చేస్తారా..

- మాజీ సిఎం జగన్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ



**విజయవాడ.సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి మీరు తీసుకొచ్చిన మీరు, పీపీపీ విధానంపై దుష్ప్రచారం చేస్తారా !అంటూ ఏపీ ఆరోగ్యశాఖా మంత్రి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు లేఖ రాసారు.రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను రూ.8,480 కోట్లతో నిర్మించాలని నాటి మీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నాలుగేళ్ళలో రూ.1450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందనే విషయం మరిపోయారా ?అని మంత్రి సత్యకుమార్ జగన్‌ను ప్రశ్నించారు.ఈ లెక్కన చూస్తే 17 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి 150 ఎంబిబిఎస్ సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించడానికి మీకు 23 ఏళ్ళు పడుతుంది'.అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మీ ప్రణాళిక ప్రకారం 17 వైద్య కళాశాలలు 2023-24 సంవత్సరంలో మొదలై 2025-28 నాటికి 2,550 ప్రవేశాలు జరగాలి. మీ నిర్వాకంతో నిర్మాణాలు గుంతల స్థాయిలోనే ఉండిపోయాయి' అని మంత్రి విమర్శించారు. 'ఆర్థిక సమస్యలు లేకుండా ఉండేందుకే మీ ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వైద్య కళాశాలల నిర్మాణం తలకు మించిన భారమని భావించి రూ.12 లక్షలు,రూ.20 లక్షల వార్షిక ఫీజులతో సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిని ప్రవేశపెట్టారు...ఇప్పుడు పీపీపీ విధానంపై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు? భారీ అంచనాలు రూపొందించి నాలుగేళ్ళలో ఏడాదికి రూ.363 కోట్ల చొప్పున మాత్రమే ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలో రూ.6,379 కోట్లు ఖర్చు చేయాలని అంటున్నారు. ఇదేం ద్వంద్వ వైఖరి? పాడేరు కళాశాలలో 100 సీట్లు కోల్పోడానికి జగనే కారణం.చిత్తశుద్ది లేకపోవడం వల్లే రెండో దశ లోని 5 కళాశాలలు 700 సీట్లు కోల్పోయాయి.

పులివెందుల కళాశాల నిర్మాణానికి రూ.412 కోట్లు ఖర్చుచేసి మార్కాపురం,మదనపల్లె,ఆదోని వైద్యకళాశాలల నిర్మాణంలో ఎందుకు వివక్ష చూపారు' అని లేఖలో ప్రశ్నించారు.'కార్పొరేట్ సంస్థలు నడుపుతూ రూ.వేల కోట్ల వ్యాపారం చేసే జగన్‌కు పీపీపీకి ప్రైవేటీకరణకు మధ్య తేడా తెలియదా?పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులకు అవసరమైన నిధులు,నైపుణ్యాల కోసం ప్రైవేటు భాగస్వామిని ఎంచుకుంటారు. అలా అమలయ్యే ప్రాజెక్ట నియంత్రణ పూర్తిగా ప్రభుత్వం చేతిలో ఉంటుంది' అని సత్యకుమార్ యాదవ్ వివరించారు. మళ్ళీ అధికారం లోకి వస్తే పీపీపీ కళాశాలలను రద్దు చేస్తామని జగన్ హెచ్చరించడం హాస్యాస్పదమని మంత్రి పేర్కొన్నారు.

ప్రముఖులకు మొమెంటోలు అందచేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తనదైన శైలిలో మెమొంటోలను అందజేశారు. లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా,

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరికి,రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

## ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి : సిఐటియు రాష్ట్ర కమిటీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రకటించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడమంటే బిల్లును ప్రవేశపెట్టి తమ మందబలంతో ఆమోదింపజేసుకుంటామని చెప్ప టం మినహా మరొకటి కాబోదని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రివర్గం ఆమోదం పొందిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా రద్దు చేయాలని కోరారు. కార్మికులు ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించ టానికేనని తెలిపారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించ బడతాయని చెప్పిందని తెలిపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గుజరాత్ బిజెపి ప్రభుత్వం 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు పాస్ చేసిందని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించకుండా బిల్లు పెట్టేందుకు సిద్ధమవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## మహిళలను ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని మోడీ కార్యక్రమాలు

- పలువురు మహిళా ప్రతినిధులు



**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాత వార్తప్రతి నిధి:** దేశంలో మహిళలను ముందుకు తీసుకెళ్ళేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ,కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి,పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు తెలిపారు. తిరుపతిలో మొదటిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సు శ్రీవారిపాదాల చెంత ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళా శక్తితో దేశం ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి చెందుతందన్నారు. తిరుపతి సదస్సుకు విచ్చేసిన ఎంపి పురందేశ్వరి, మాజీ గవర్నర్ తమిళిసై, ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి ,ఏపి మంత్రులు అనిత,సవిత, మహారాష్ట్ర ఎంపి రోహిణి, సంధ్యారాణి, ఎంఎల్ఎ పరిటాల సునీత,తమిళనాడు మంత్రి గాంధీ ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరు మల, సెప్టెంబర్ 14ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నగేశ్ బీమపాక , ఏపి హైకోర్టు జడ్జి జస్టీస్ టిసిడి శేఖర్‌లు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుం బంతో కలసి వచ్చిన వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనంచేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాచకులు, అనధికార వ్యాపారుల తరలింపు

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో తిరుమల నుండి యాచకులు, అనధికార వ్యాపారులను ఆదివారం టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు తరలించారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యల దిశగా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమలలో పర్యటించారు. కళ్యాణకట్ట, ఎస్వీషాపింగ్ కాంప్లెక్స్,ఆస్థానమండపం ప్రాంతాల్లో 82మంది యాచకులు, అనధికార వ్యాపారులను తిరుపతికి తరలించారు. వారి అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. హోటళ్ళు, టీ దుకాణాలు ,చిల్లరదుకాణాల యజమానులు తిరుమలలోపనిముగిసిన తరువాత కార్మికులకు తిరుపతిలో వసతి కల్పించాలని పోలీసులు సూచించారు.

## విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్,సెప్టెంబరు14, ప్రభాతవార్త** విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతి స్పెషల్ ట్రైన్ ఈ నెల 15 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా, తిరుపతివిశాఖపట్నం రైలును ఈ నెల 16 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు వివరించారు. ఈ మార్గంలో మొత్తం 22 సర్వీసులు నడుస్తాయి.ఇక తిరుపతి నుంచి అనకాపలి - తిరుపతి మధ్య అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 27 వరకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా సంబల్‌పూర్ ఇరోడ్ మధ్య కూడా రైల్వే శాఖ ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సంబల్‌పూర్ నుంచి ఇరోడ్ వెళ్లే రైలు సెప్టెంబరు 17 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం ప్రయాణిస్తుంది.తిరుగు ప్రయాణంలో ఇరోడ్ సంబల్‌పూర్ రైలు సెప్టెంబరు 19 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం సర్వీసు అందిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో కూడా మొత్తం 22 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

## ప్రధాని జన్మదిన సందర్భంగా 'సేవాపక్షోత్సవాలు'



కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షోత్సవాలు' నిర్వహించుటకు బిజెపి నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు.ఈ మేరకు పార్టీ నాయకులు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, దివ్యాంగులకు సత్కారం, క్రీడల పోటీలు, అన్నదానాలు నిర్వహిస్తామని వివరిం చారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనరేంద్ర మోదీ జన్మదిన కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 17న రక్తదానం నిర్వహిస్తామన్నారు. బిజెపి నాయకుల ప్రధాన కార్యక్రమాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ మాజీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కూనాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమం

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతిని ధి:** ఏపీ పౌరగ్రంథాలయ సంస్థ ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థులో పఠనాసక్తిని పెంచేందుకు ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తోంది. నిష్ణాతుల మార్గదర్శనంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై మక్కువను పెంచుతుంది. ఈ ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో మాతృభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ మన మాతృభాష అయిన తెలుగు తెలిసి ఉండాలి. విద్యార్థులు మాతృభాష నేర్చుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుసుకుంటారు. పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు అని తెలుగు ఉపాధ్యాయురాలు వల్లభనేని సుమతి గారు విద్యార్థులకు తెలియజేశారు.

ప్రతి ఆదివారం ఆమె విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం, చదవటం రాయటం , బోధన తదితర అంశాలు లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయం అమెరికాలో ఉన్న వారి సుమతి కుమారుడు వల్లభనేని వంశీ మాతృభాష మీద మక్కువతో విద్యార్థులకు అక్షరాలతో కూడిన పదాలు నేర్చుకునే పుస్తకాలను బహుకరించారు.

**ACHARYA N.G RANGA AGRICULTURAL UNIVERSITY**
Administrative Office, Lam, Guntur-522034: A.P.

**e-Procurement Tender Notice**


Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 06-08, dated 11.09.2025 Civil work - 1 No, Electrical work - 2 Nos, through e-procurement. Details can be had from **www.angrau.ac.in** or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through **http://www.apeprocurement.gov.in.** For the works 06-08, downloading starts from 15.09.2025 @ 3.00 PM onwards & ends on 29.09.2025 upto 3.30 PM. For details contact: TPA to Estate Officer: 9490008945.

Sd/- ESTATE OFFICER

DIPR.No.4422PP/CL/Advt/1/1/2022-23, Date: 12.09.2025

15-09Pg7exHMNWJQE.qxdO*P:15-09Pg7exHMNWJQE.qxd 1/1/02 9:20 AM Page 1





## అలయ్ బలయ్ కార్యక్రమానికి రండి

### సిఎం రేవంత్‌రెడ్డికి దత్తాత్రేయ ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డిని దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సిఎంకు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను సిఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ నిర్వహిస్తారు. రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు ప్రతీ యేడాది దసరా సమయంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు, అధికారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయాలకు అతీతంగా నాయకులను ఒకే వేదికమీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 2005లో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

## టైంస్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదు

### రాష్ట్ర గిరిజన హాస్టల్, ఆశ్రమం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని తెలంగాణ గిరిజన హాస్టల్, ఆశ్ర మం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు ఎం. పాపారావు, బి.మధు, నాగేశ్వరరావు, బ్రహ్మాచారి, గోపాల్‌లు స్పష్టం చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 12 నుంచి సమ్మె ప్రారంభించారని గుర్తు చేశారు. టైస్కేల్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం, పాత పద్ధతిలోనే వేతనాల చెల్లింపులు, చనిపోయిన కాంటినెంట్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం వంటి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవటంతో సమ్మెకు దిగవలసి వచ్చిందని తెలిపారు. జిల్లాలలో సమ్మె చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను అధికారులు ఫోన్‌లు చేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదరించటం సరికాదని, సమ్మెచేసే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహకం

### రైతులకు రాయితీలు ప్రకటించిన డైరెక్టర్ యాస్మిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇవ్వాలని ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకుగాను రైతులకు వివిధ రాయితీలు అందించేందుకు ప్రణాళికను రూపొందించింది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యాన శాఖ డైరక్టర్ యాస్మిన్ బాషా ప్రకటించారు. తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు నిమిత్తం 18.48 కోట్ల రూపాయలను కేటాయించారు. అదేవిధంగా కూరగాయల సాగు నిమిత్తం 10 వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను 9.60 కోట్ల రూపాయలు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం 2.35 కోట్ల రూపాయలు కేటాయింపులు చేశారు.

అలాగే రాష్ట్రంలోని 2,549 ఎకరాల్లో పూల సాగు నిమిత్తం 2.06 కోట్ల రూపాయలు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు సంబంధించి 5.33 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈవిధంగా ప్రకటించిన ఉద్యాన పంటల సాగు నిమిత్తం అన్ని విభాగాల్లో 40 శాతం రాయితీని రైతులకు అంద చేయనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గాను వాటి యూనిట్లకు 1.08 కోట్ల రూపాయలను కేటాయింపులు చేశారు. పాత తోటల పునరుద్ధరణకు మరో 2 కోట్ల రూపాయలు, నీటి వనరుల సృష్టి కోసం 2.73 కోట్ల రూపాయలు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం 14.24 కోట్ల రూపాయలను కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. ఇక సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు వంటి యూనిట్ల ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు నుండి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలి

### ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** టెట్‌పై ఈ నెల 1న సుప్రీంకోర్టు ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్ )ఉత్తీర్ణులు కావాలని లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు నుండి సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలంటే విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23 ను సవరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులు అప్ డేట్ కావటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే 2010కి ముందే నియామకమైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 15 సంవత్సరాల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో పరీక్ష పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారని, దీంతో ఏర్పడే సంక్షోభాన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం సవరించాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్తం క్యాంపైన్‌లో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రెండేళ్ల కాలంలో వీలైనన్ని ఎక్కువ పర్యాయాలు టెట్ పరీక్ష నిర్వహించి అవసరమైన ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణులు అయ్యేలా అవకాశం కల్పించాలన్నారు. డిగ్రీ, బిఎడ్ అర్హతలతో ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఓడిఎల్ (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లర్నింగ్) పద్ధతిలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ల ద్వారా డిఎడ్ స్వల్పకాలిక శిక్షణను అందించి టెట్ పేపర్ 1 వ్రాసుకోవడానికి అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు.

# సింగరేణి మనుగడను సర్కారు కాపాడాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉన్న సింగరేణి మనుగడను ప్రభుత్వం కాపాడాలని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సింగరేణిపై సమీక్ష చేసి, సింగరేణి కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. సింగరేణి పట్ల డిప్యూటీ సిఎం భట్టికి మరింత శ్రద్ధ ఉండాలని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంతం పట్ల, సింగరేణి సంస్థ పట్ల ప్రేమ లేదు అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలను ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. సింగరేణిని కాపాడాలని కెసిఆర్ అనేక ప్రయత్నాలు చేశారని, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1400 బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని, కార్పొరేట్ సంస్థలను కాపాడటం కోసం బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని చెప్పారు.

తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికి దక్కాలని కెసిఆర్ అన్నారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 4 బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని, 4 బొగ్గు బ్లాకులను కాపాడటం కోసం కెసిఆర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి బొగ్గు బ్లాకుల వేలం పాటలో కలిసి పాల్గొన్నారని గుర్తు చేవారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకు ఎట్లా వచ్చిందని, కర్ణాటకలో కాపర్, బంగారం గనులను సింగరేణి దక్కించుకుందని సింగరేణి సంస్థ ప్రకటించిందని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగి, సింగరేణి నాశనం అయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు.

# అటవీప్రాంతం గుండా నూతన రోడ్డు మార్గాలు

### మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** వచ్చే జనవరిలో జరిగే మహా మేడారం జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పనులను వేగవంతం చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మేడారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె దగ్గరుండి పరిశీలిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు చాలా ముఖ్యమైనవని, జిల్లా ఎస్పీతోపాటు మేడారం సర్కిల్‌లో పనిచేసే పోలీస్ అధికారులతో కలిసి కొత్తరోడ్లను పరిశీలించినట్లు తెలి పారు. ప్రస్తుతం ఉన్న మార్గాలను వెడల్పు చేయడంతో పాటు కొత్తరోడ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంగుండా నూతన రహదారి మార్గా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కొండపర్తి నుంచి గోనెపల్లి, ముత్తాపురం మీదుగా పడికాపురం వరకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని, కాల్వ పల్లి నుంచి కన్నేపల్లికి వచ్చే దారిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాల్వపల్లి నుంచి ఊరటం వరకు వచ్చే దారిలో బీటీ రోడ్డు వేస్తున్నామని, అడవి దారులను డెవలప్ చేసుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులందరూ మేడారం ఆలయం వరకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఛత్తీస్‌గడ్, ఖమ్మం వైపు నుంచి వచ్చే భక్తులకు చిన్నబోయినపల్లి మీదుగా ఊరటం దాకా రహదారి మార్గాన్ని కల్పిస్తామని, మేడారం మహా జాతర లోపు రూ 16.5 కోట్లతో కొండాయి బ్రిడ్జి కంప్లీట్ చేస్తామని, దీనికి సంబంధించి నిధులను సీఎం ఇప్పటికే మంజూరు చేశారు చేసినట్లు తెలిపారు. జాతర సమయంలో ఎక్కడికక్కడ అటవీ ప్రాంతంలో పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేస్తామని, మట్టి రోడ్లను, బీటి రోడ్లను ఏర్పాటు చేస్తాం వచ్చిపోయే భక్తులకు ఇబ్బంది లేకుండా డివైడర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ కీర్తిని మరింత పెంచే విధంగా యజ్ఞంలా పనిచేస్తున్నట్లు తెలిపారు. కొంతమంది తమ ప్రయోజనాల కోసం దేవుడి దగ్గర చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి పూజారుల ఆలోచన, విశ్వాసం నమ్మకం, ఆచారం లకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఒక ఆదివాసి బిడ్డగా ఆదివాసి జీవితాన్ని తెలిసిన వ్యక్తిగా మొదటి నుంచి ఆదివాసి సాంప్రదాయాలు ఆచారాలను కాపాడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే అడ్డుకున్నానని, ఆదివాసి సంప్రదా యాలకు భంగం వాటిల్లకుండా పనులు చేయించే బాధ్యత నాదిసమ్మక్క సారలమ్మ కీర్తి ఇనుమడింప చేసే విధంగా మేడారం ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు.

# గద్వాల జిల్లా కెటిఆర్ సభ అట్టర్‌ఫ్లాప్

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తేరు మైదానానికి ఒక చరిత్ర ఉందని, దాన్ని కెటిఆర్ అబద్దాలకు అడ్డగా మార్చి నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చి పోయాడని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మండిపడ్డారు. అలంపూర్ నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ఫ్యూడలిస్టు, శాడిస్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదని సంపత్ కుమార్ అన్నారు.

శనివారం సభలో కెటిఆర్ మాట్లాడుతూ గురుకుల హాస్టల్‌లో ఎలుకలు దూరుతున్నాయని చేసిన విమర్శను సంపత్ కుమార్ తిప్పికొట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి రోజుల్లో తాను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి కొట్లాడి అలంపూర్ నియోజకవర్గానికి అత్యధిక గురుకులాలను తీసుకువచ్చానని గుర్తుచేశారు. అలంపూర్ నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ ఇల్లు కట్టలేదని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లకు నిర్విఘ్నంగా నిర్మాణం జరుగుతుం దన్నారు. ఇది ప్రజాపాలనకు ధర్పం పడుతుందని అన్నారు. పదేళ్ల రాజకీయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం తగదన్నారు.

పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని సంపత్ కుమార్ అన్నారు.

టిఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కెటిఆర్ చేతుల మీదుగా 9 పర్మిషన్లు ఇచ్చాడు అని అన్నారు. దళితులు, బిసిల గురించి మాట్లాడే నైతికత కెటిఆర్‌కి లేదన్నారు.

# దేశ సమగ్రతకు పునాది హిందీ

### కులాలు, మతాల పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



అవార్డులను ప్రదానం చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** అధికార బాషగా హిందీ ఈ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు చెప్పారు. టిపిసిసి మైనార్టి సెల్ ఛైర్మన్ రాజేష్‌కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్ కుమార్ అధ్యక్షతన ఆదవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యసంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'హిందీ దివస్' కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, గౌరవ అతిధులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హార్కర్ వేణుగోపాలరావు, ఎఐసిసి కార్యదర్శి శ్వనాథన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొంతమంది తమ స్వార్థ రాజకీయల కోసం కులాలు, మతాలు పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు. రాజకీయాలు అనేవి పదవుల కోసం మాత్రమేనని, ఇంకొందరు తమ పదవులు కాపాడు కోవ దానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు.

ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రపం చీకరణ ప్రభావంతో ఇంగ్లీషుకు ప్రాధాన్యత పెరిగినప్పటికి హిందీ తన స్థానాన్ని కోల్పోలేదన్నారు. తెలంగాణ లౌకిక వాదానికి పెట్టింది పేరని, భాష, ప్రాంతం అనే భేదం లేదన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమని, పరస్పరం గౌరవించుకుంటూ కలిసి, మేలిసి జీవించాలని, మర్వాడీలపై దాడులు సరికాదన్నారు.

హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, ప్రదీప్ సురానీ, లక్ష్మీనారాయణ రాఠి, సిఎ మురళిమనోహార్ పలోడ్, భీమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. హిందీ దివస్ సందర్భంగా పలువురికి ముఖ్య అతిధులు అవా ర్డులను ప్రదానం చేశారు.

# 'సెప్టెంబరు 17'ను తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తమకు తెలిసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినంగా నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేనందున తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. ఇందుకు తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఈ మేరకు ఆ వివరాలతో కూడిన ప్రకటనను కూనంనేని విడుదల చేశారు. నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన సిఎంకు సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, ఫోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. హైదరాబాద్‌లో నాటి పోరాట యోధులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని కోరారు. నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలని సూచించారు. పలు సభలలో నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నామని సిఎంకు తెలిపారు. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నానని కూనంనేని వెల్లడించారు.

## గ్రూప్-1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్ 1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర పన్నుతున్నారని ఎంపి చామల కిరణ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గ్రూప్ 1 పరీక్షలలో 563 అభ్యర్థుల దగ్గర మూడు కోట్ల రూపాయలు లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్ళను ఎంపిక చేసిందని అంటున్నారు. మీ హయాంలో మీరెట్లా ఉద్యోగాలు ఇవ్వలేదు, మీ హయాంలో గ్రూప్ 1, 2, 3 4, పెట్టే పరిస్థితి లేదన్నారు. మా సిఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లుతున్నామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లో కూడా అడ్డంకులు రావద్దన్న సదుద్దేశంతో గ్రూప్ 1 పరీక్షలు పెట్టామన్నారు. 563 మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరు మూడు కోట్లు పెట్టే స్తోమత ఉంటుందా? మీ హయాంలో ఎవరికి ఉద్యోగాలు ఇవ్వని మీరు మీకు ఓటేయని ప్రజలు బాధపడుతూ ఉండాలనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల మీద నీకు ప్రేమ లేదని, అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేస్తూ ఇండియాకు వచ్చి మంత్రి పదవి చేపట్టిన నీకు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎలా మాట్లాడతావు అంటూ ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్‌కి గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగుల తల్లిదండ్రులు మీడియా ముందుకు వచ్చి బుద్ధి చెప్పాలన్నారు. శనివారం కెటిఆర్ మాట్లాడిన మాటలు నిజమా కాదా తెలియాలి అంటే తల్లిదండ్రులు స్పందించాలన్నారు.



పాతబస్తీ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో మర్కాజి మిలాద్ ఊరేగింపు

## పాతనగరంలో మిలాద్ ఊరేగింపు..

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన మిలాద్ ర్యాలీ ప్రశాంతంగా కన్నుల పండుగగా కొనసాగింది. దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చార్మినార్, గుల్జారా హౌస్, మదీనా, దారుషిఫా, ఓల్గా హోటల్, శాలిబండ, హుస్సేనీఆలం, మొగల్‌పుర, భవానీనగర్, చాంద్రాయణగుట్ట, కాలాఫత్తర్, కామాటిపుర బహదూర్‌పుర, నయాపూల్, సిటీ కళాశాల చౌరస్తా, మూసాబౌలి, మిశ్రీగంజ్, కాజీపుర, కిల్వత్, వట్టెపల్లి, కిషన్‌బాగ్, ఫత్తర్‌గట్టితో పాటు వివిధ ప్రాంతాలలో మిలాద్ ర్యాలీని నిర్వహించారు. పాతబస్తీ మిశ్రీ గంజ్ దర్గా నుంచి ప్రారంభమైన మిలాద్ ఊరేగింపు పలు ప్రాంతాల మీదుగా కొనసాగిన అనంతరం చార్మినార్‌కు చేరుకుంది. కాగా పాతనగరంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ర్యాలీలు చార్మినార్‌వద్ద ప్రధాన ర్యాలీలో కలిశాయి.

ప్రశాంతమైన వాతావరణంలో ర్యాలీని నిర్వహించామని మిలాద్ మర్కాజీ ఊరేగింపు జాయింట్ కన్వీనర్, ఖాద్రియా ఇంటర్నేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖాద్రి తెలిపారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమన్ సింగ్, దక్షిణ మండలం డిసిపి స్నేహ్ మెహ్రాతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు ఉన్నాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జారాహౌస్‌తోపాటు పలుచోట్ల వేదికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. మిలాద్ ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చార్మినార్, గుల్జారాహౌస్, మదీనా ప్రధాన రహదారులలో నిలబడి ప్రజలు మిలాద్ ఊరేగింపును తిలకించారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు ప్రశాంతంగా జరిగిందని చార్మినార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## పెరిగిన చికెన్ ధరలు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** నాన్ వెజ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో చికెన్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కిలో చికెన్ ధర 240 రూపాయలుగా ఉంది. వారానికి సుమారు 20 రూపాయల చొప్పున ధర పెరుగుతూ వచ్చి ప్రాంతాలను బట్టి ఇప్పుడు ఏకంగా 240 నుండి 260 రూపాయల వరకూ ధర పలుకుతోంది. దీంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చికెన్ ధరల పెరుగుదల పెద్ద భారమైంది. వారానికి ఒకటి రెండు సార్లు చికెన్ తినే వారు ఇప్పుడు వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా చేపలు, గుడ్లు వైపు మొగ్గుచూపుతున్నారు. కాగా ఇప్పటి వరకూ శ్రావణ మాసం, వినాయక చవితి కారణంగా అంతగా డిమాండ్ లేకుండా ఉండటంతో చికెన్ ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే దసరా పండుగ సమయం దగ్గరపడు తుండటంతో మళ్లీ చికెన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దసరా సంద ర్భంగా ఇంటింటా విందులు, వేడుకలు ఉండటంతో చికెన్‌కు డిమాండ్ ఏర్పడింది.

## పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే మా ఓటు

### పాట్నా పెన్షన్ సంఘర్ష్ సభలో ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పాత పెన్షన్ అమలు చేసేవారికి ఓటు వేయాలని నేషనల్ మూవ్మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆదివారం బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో మిల్లర్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆధ్వర్యంలో పెన్షన్ సంఘర్ష్ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర పరిధిలోనిది. ఇటీవల దేశంలో పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు చేస్తామని తెలంగాణ, కర్ణాటక లో సిపీఎస్ ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బీహార్ లో కాంగ్రెస్ పార్టీ ,రాష్ట్రీయ జనతా దళ్లు, తెలంగాణ ,కర్ణాటక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుండా బీహార్‌లో సిపీఎస్ ఉద్యోగుల ఆయా పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం యూ.పి.యెస్ ప్రకటించడం ద్వారా, రెండు దశాబ్దాల తర్వాత ఎన్.పి.యెస్ నిష్ప్రయోజనమైందన్నారు. ఉద్యోగికి కంట్రిబ్యూషన్ తో సంబంధం లేకుండా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ యూ. పి.యెస్ విధానం ద్వారా ఇప్పటికి ఎన్. పి.యెస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టిన 10.53 లక్షల కోట్లకు మరింతగా కంట్రిబ్యూషన్ ను పెంచి ప్రవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పడమేనన్నారు. 2004 నుండి అమల్లోకి తెచ్చిన పి.ఎఫ్ ఆర్ డి ఏ బిల్లు 2013 సెప్టెంబర్ లో పార్లమెంట్‌లో పాస్ చేయించారని ఇప్పటివరకు వ జమైన మొత్తం నిధి అంతా ఇష్టా రాజ్యంగా షేర్ మార్కెట్ లోకి పెట్టుబడులుగా వెళ్లాయని ఆయన ఆరోపించారు. ఎన్. పి.యెస్ పై నిరసనలు వెల్లువెత్తటంతో, కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు మార్చుకోవచ్చని అంటూనే ఇన్నాళ్ళు ఎన్.పి.ఎస్ లో జమకాబడిన మొత్తాలను కేంద్రం ఇవ్వదని ఓపీఎస్ ను పునరుద్ధరించిన రాష్ట్రాలకు స్పష్టం చేయడం ,రాష్ట్ర ఉద్యోగుల పై రాష్ట్రాల అధికార స్వేచ్ఛ హరించడమేన్నారు.



# వలసలపై లండన్‌లో భారీ నిరసనలు

## మరోవైపు వలసదారులకు మద్దతుగా ర్యాలీలు

## హింసాత్మకంగా మారిన లండన్ వీధులు



**లండన్, సెప్టెంబరు 14:** యునైటెడ్ కింగ్‌డమ్ రాజధాని లండన్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్త నెలకొంది. ఫార్‌రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు. మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో సుమారు 1.10లక్షల నుంచి 1.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన విసిరి దశలో కొంతమంది నిరసనకారులు అదు పుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి పళ్లు విరగగా, మరొకరికి వెన్నెముకకు గాయమైందని, ఇంకొకరికి ముక్కు విరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఓ వీడియోలో మాట్లాడుతూ భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, వలసలు ఆపండి వంటి ప్లకార్డులతో నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఇదే సమయంలో స్టాండ్ అప్ టు రేసిజం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది. వేల మంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరగగా మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండ్ అప్ టు రేసిజం' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు.

అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది. స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థనాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు.ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.

# భారత్ పాకిస్తాన్ మ్యాచ్‌కు నిరసనగా టీవీల ధ్వంసం



భారీ ఆందోళనలు జరిపిన శివసైనికులు

**ముంబయి, సెప్టెంబరు 14:** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ మ్యాచ్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ మ్యాచ్ ను వ్యతిరేకిస్తూ శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గం) పార్టీ కార్యకర్తలు ముంబైలో ఆందోళన చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ దూబే నేతృత్వంలో నిరసనకారులు టీవీ సెట్లను పగలగొట్టి, కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద్ దూబే మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశమని, అలాంటి దేశంతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం మన సోదరీమణుల సిందూరాన్ని అవమానిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. దీనికి గుర్తుగా మహిళా కార్యకర్తలు చేతిలో సిందూరం పట్టుకుని నిరసన తెలిపారు. దుబాయ్ లో జరగనున్న ఈ మ్యాచ్ ను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నామని దూబే అన్నారు. పహల్గామ్ లో తమ ఆప్తులను కోల్పోయిన సోదరీమణులు, తల్లులు ఈ మ్యాచ్ ను ఎలా చూడగలరని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఈ మ్యాచ్ ను ఆపాలి వారి మనోభావాలతో ఆడుకోవద్దు, బీసీసీఐకి, జై షాకు తమ తప్పు తెలిసేలా విరాళాలు పంపుతున్నామని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత క్రికెటర్లు కూడా ఈ మ్యాచ్ ను బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆటగాళ్లు ఈ మ్యాచ్ ను బహిష్కరిస్తే, మేము వారికి అండగా నిలుస్తాం. అలా కాకుండా ఆడితే మాత్రం, వారి తీరును కూడా ఖండిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నిరసనల మధ్య, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 8:00 గంటలకు భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# యుద్ధాల ఆంక్షలతో సమస్యలు పరిష్కరించలేరు

## చైనా తీవ్ర స్పందన



**బీజింగ్, సెప్టెంబరు 14:** తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరి ష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. స్లోవేనియా పర్య టనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహిం చదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయ పడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

## జెన్‌జడ్ ఉద్యమంలో మృతులకు

# 'అమరవీరుల హోదా'

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

**ఖాట్మండు, సెప్టెంబరు 14:** జెన్‌జడ్ యువత చేపట్టిన భారీ ఆందోళనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిన కొన్ని రోజులకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాజాగా కీలక ప్రకటనలు చేశారు. తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల పాటే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుశీల కర్కి మాట్లాడుతూ తానుగానీ, తన బృందం గానీ అధికారాన్ని రుచి చూడటానికి ఇక్కడికి రాలేదు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. ఆరు నెలలకు మించి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగం. కొత్తగా ఎన్నికయ్యే పార్లమెంటుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని కర్కి హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అదే సమయంలో నిరసనల సందర్భంగా జరిగిన విధ్వంసకర ఘటనలపై విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చామని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# వరద సాయం ఉగ్ర సంస్థల పరం

## పాకిస్థాన్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 14:** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాకిస్థాన్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి లేకపోయినా కూడా వరద బాధితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరు ద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన తర్వాత మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్ఇటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ. 4.7 కోట్లకుపైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి ఉగ్ర సంస్థలకు మళ్లిస్తోంది.

# మోడీ మణిపూర్ పర్యటన కంటితుడుపు చర్యే



## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** కల్లోలిత మణిపూర్‌లో ప్రధాని పర్యటన కేవలం ఒక పిట్‌స్టాప్ వంటిది మాత్రమేనని ఎఐసిసి అధ్యక్షుడుఖర్గే వాదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ పర్యటన కేవలం ఒక పిట్ స్టాప్ (చిన్న విరామం) మాత్రమేనని ఇది రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌ల లో పర్యటించడానికి వచ్చిన మోదీపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. నరేంద్ర మోదీ గారు.. మణిపూర్‌లో మీ 3 గంటల పర్యటన కనికరం కాదు. ఇది ఒక ప్రహసనం. కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. రిలీఫ్ క్యాంప్‌లలోని ప్రజల రోదనలు వినకుండా పారిపోవడమే మీ ఉద్దేశ్యం అని ఆయన పోస్ట్ చేశారు. అక్కడితో ఆగకుండా హింస మొదలైన ఈ 864 రోజుల్లో 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మొత్తంగా 67,000 మంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. అంతేకాకుండా 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఈ సమయంలో మీరు 46 విదేశీ పర్యటనలు చేశారని కానీ సొంత ప్రజలను పరామర్శించడానికి ఒక్కసారి కూడా రాలేదని ఖర్గే అన్నారు. మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్‌లోని అమాయక ప్రజల జీవితాలను బుల్డోజ్ చేసిందంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అలాగే ప్రధాని, హోం మంత్రి అమిత్ షా అసమర్థత, కుమ్మక్కు కారణంగానే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా ఈ సమస్యను కప్పిపుచ్చుకోవాలని చూశారని ఆరోపించారు. ఈ విషయంలో మీ రాజధర్మం ఎక్కడ కనిపిస్తుందో చెప్పాలంటూ ఖర్గే ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని ఇంతకుముందే రాష్ట్రానికి వచ్చి ఉండాల్సిందని అన్నారు. రెండు సంవత్సరాల తర్వాతనైనా ఆయన మణిపూర్‌ను సందర్శించడానికి నిర్ణయించుకోవడం సంతోషం. ప్రధాని మోదీ తన పర్యటనలో నిరాశ్రయులైన ప్రజలతో మాట్లాడారు. అలాగే రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మణిపూర్‌లో మైతేయ్, కుకి వర్గాల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై మే 2023 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి.

# మా కన్నీళ్లు ఆరకముందే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లా..

## పహల్గావ్ బాధితుల ఉద్వేగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్ లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు. మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులుకూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తోఅన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

# ఏకైక ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేపై ప్రజాభద్రతా చట్టం

**శ్రీనగర్, సెప్టెంబరు 14:** ప్రజాప్రతినిధిపై ప్రజా భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కానీ జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై పోలీసులు ఈ పీఎస్ఏ చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. గత వారం పోలీసులు అదుపులోకి తీసుకున్న మెహ్రాజ్ మాలిక్‌పై ఇప్పటికే 18 కేసులు నమోదై ఉన్నాయని, పోలీస్ డైరీలో ఆయనపై రోజువారీ నివేదికలు ఉన్నాయని దోడా జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేసిన పీఎస్ఏ డోసియర్‌లో పేర్కొన్నారు. 33 పేజీల ఈ డోసియర్‌లో మాలిక్‌ను హిస్టరీ షీటర్‌గా పేర్కొంటూ ఆయన సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టమని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికారులు, రాజకీయ ప్రత్యర్థులపై ఆయన తరచుగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని డోసియర్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, వైద్యుల పట్ల అనుచిత భాష ఉపయోగించడం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. 1978లో ఈ చ ట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేపై పీఎస్ఏ కింద కేసు నమోదు కావడం ఇదే మొదటి సారి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని విచారణ లేకుండానే రెండు సంవత్సరాల వరకు నిర్బంధించవచ్చు. ఇటీవల దోడా జిల్లా మెజిస్ట్రేట్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజులకే పోలీసులు మెహ్రాజ్ మాలిక్‌పై ఈ చట్టాన్ని ప్రయోగించారు. మాలిక్ అరెస్టుకు వ్యతిరేకంగా దోడాలో భారీ నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి అధికారులు కర్ఫ్యూ విధించి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఈ అరెస్టును సమర్థిస్తుండగా మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వంటి ఇతరపార్టీల నాయకులు మాత్రం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## అసోంలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు



**గౌహతి, సెప్టెంబరు 14:** అసోంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధేకియజులి ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5కిలోమీటర్ల లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది.అసోంలోని ఇదే ప్రాంతంలో వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోడీ ప్రస్తుతం అసోం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

## చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్



**తైపెయి సిటీ, సెప్టెంబరు 14:** తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సిజిఎ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటి కాగా మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలాపాలు సాగిస్తుండగా ఈ ఘటన చోటుచేసు కొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి.ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో రెండు చైనా నౌకల ను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు.అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రాంతానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

## మాడ్రిడ్‌లో చర్చల వేళ అమెరికాపై చైనా దర్యాప్తులు షురూ



**బీజింగ్, సెప్టెంబరు 14:** అమెరికా రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ చైనా ఒకేసారి రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళఇది జరగడం గమనార్హం. మాడ్రిడ్ సమావేశంలో జాతీయ భద్రత, టిక్ టాక్ సోషల్ మీడియా యాజ మాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది.కొన్ని ఐసి చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారుచేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తు చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ అయ్యారు. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

## టేకాఫ్ కాకుండానే రన్‌వేపై నిలిచిపోయిన ఇండిగో



**లక్నో, సెప్టెంబరు 14:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వేపైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆసమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు.

## గగనతలాన్ని కాపాడిన మిగ్ 21లకు రిటైర్మెంట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత వాయుసేనకు దాదాపు అర్ధశతాబ్దానికి పైగా సేవలు అందించి గగనతలాన్ని కాపాడిన మిగ్-21లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి.కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. వాయుసేన మిగ్-21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యాసంస్థలు వార్ మెమోరి యల్స్ మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు తుది వీడ్కోలు పలకనున్నారు.

# బీహార్‌లో 243 స్థానాల్లోను పోటీచేస్తాం

## మహాకూటమి కీలకనేత తేజస్వియాదవ్ సంచలనం



**ముజఫరాపూర్(బీహార్), సెప్టెంబరు 24:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన మై బెహన్ యోజన ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

### భద్రతా వలయం ఛేదించుకుని తేజస్వి కాళ్లపై పడ్డయువకుడు!

బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్‌పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు. దీనికిముందు ముజఫర్‌పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని చేధించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. ఈ ఘట నకు సంబంధించిన వీడియో సోషల్ మీడి యాలో వైరల్ అవుతోంది. తేజస్వియాదవ్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని కొందరు.. భద్రతా లోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

# ఆక్వాను ఆదుకోండి - కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

## - అమెరికా సుంకాలతో రాష్ట్రంలో ఆక్వాకు తీవ్ర నష్టాలు వచ్చాయి - దేశీయ వినియోగంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ముఖ్యమంత్రి వినతి

**విజయవాడ,సెప్టెంబర్14, ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా సుంకాలతో ఇబ్బందిపడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఆక్వా రైతులు నష్టపోకుండా కేంద్ర స్థాయిలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు వివిధ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. దేశీయంగానూ ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు సీఎం విడివిడిగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాట్లు వంటి అంశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి, ఇతర దేశాలతో ఆక్వా విషయంలో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రికి, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రికి లేఖలు రాశారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కోంటున్నాయని సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ స్థాయిలో జరిగే రొయ్యల ఎగుమతుల్లో ఏపీ నుంచి 80 శాతం వాటా ఉందని.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా ఏపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. సుమారు రూ. 21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం మీద ఆధారపడి 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30 లక్షల మంది ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా విధించిన సుంకాలతో రొయ్యలు ఎగుమతులపై ఎక్కువగా ప్రభావం పడిందని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రూ. 25 వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. 50 శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దు అయ్యాయయని లేఖలో వివరించారు. దాదాపు 2 వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ. 600 కోట్ల మేర సుంకాల భారం పడిందని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిపిన చర్చల ఫలితంగా కేజీ ఆక్వా ఫీడ్ ఎమ్మార్పీపై రూ. 9 మేర తగ్గించ గలిగామన్నారు. సబ్సిడీతో ట్రాన్స్ఫార్మర్లు సరఫరా చేసేందుకు కూడా ఆలోచన కూడా చేస్తున్నామని సీఎం తన లేఖల్లో వివరించారు. రాష్ట్రం ప్రభుత్వంతో పాటు కేంద్ర సాయం కూడా ఆక్వా రైతులను నిలబెట్టేందుకు అవసరమవుతుందని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతి దారులకు..ఆక్వా కంపెనీలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల పాటు మారటోరియం విధించాలని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు... ఫ్రోజెన్ రొయ్యలపై ఉన్న 5 జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడం వంటి చర్యలు తీసుకోవాలని సీఎం లేఖల్లో కోరారు. ఈ చర్యలతో పాటు అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్ ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

యూరోపియన్ యూనియన్, సౌత్ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని లేఖల్లో ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతి దారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీఫుడ్ సరఫరా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

ఈ చర్యలతో పాటు దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆడపిల్లలను అదనపు భారంగా భావించవద్దు

## - హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్




విజయవాడలో బాలికల భద్రత,రక్షణపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్,ఇతర న్యాయ ప్రముఖులు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లలను ఎప్పుడు అదనపు భారంగా భావించడం కూడదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్ అన్నారు.ఆడపిల్లలను మనం బాధ్యతగా స్వీకరించి,వారి వ్యక్తిత్వాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సామాజిక తీర్చిదిద్దాలన్నారు.వారిలో సృజనాత్మక,ఆలోచనా విధానం ఒక ఉన్నతమైన సమాజాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. భారతదేశంలో బాలికలు, సురక్షిత వాతావరణం,.సంరక్షణ, అనే అంశంపై రాష్ట్ర స్థాయి ఆదివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కాలాక్షేత్రం లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ థాకూర్ ముఖ్య అతిధిగా హాజరయి,మాట్లాడుతూ ఈ సమావేశం ఒక బాలిక సంరక్షణకు సంబంధించినదన్నారు. చరిత్రలోకి వెళితే, మహిళలు ఎలా బాధపడ్డారో మనం చూశామని, ముఖ్యంగా ఈ దేశంలో ప్రారంభంలో సతి సహగమనం అనే ఆచారం ఉండేదని, సామాజిక సంస్కర్త రాజా రామ్ మోహన్ రాయ్ కృషి వల్ల ఆ ఆచారం నిషేధించబడిందన్నారు. అనేక సంవత్సరాలుగా మహిళల బాధలు మరియు వేదనలు తగ్గినప్పటికీ, మహిళాలపై వివక్ష పూర్తిగా తొలగించబడలేదన్నారు. సాధారణంగా సంవత్సరాలుగా ఒక మహిళను ఎవరైతే ఎక్కువ లేదా బాలికను కుటుంబానికి ఆస్తిగా కాకుండా భారంగా చూసారో ఆ సమాజానికి ఆపాదించబడుతుందన్నారు. చాలా కుటుంబాలలో ఒక బాలికను బాధ్యతగా కాకుండా ఒక భారంగా పరిగణిస్తారు. బాలికలు కుటుంబానికి సహకరించలేరని, అందువల్ల వీలైనంత త్వరగా ఆమెకు వివాహం చేయాలనే ప్రయత్నాలు జరుగుతాయన్నారు. అందువలన బాల్య వివాహాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. బాలికల రక్షణ గురించి చట్టపరమైన ఫ్రేమ్ వర్క్ ఉన్నప్పటికీ, నిజ జీవితంలో దానికి కార్యరూపం అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. ప్రపంచ జాబితా ప్రకారం నేడు 90 మిలియన్ల మంది పిల్లలు లైంగిక హింసను అనుభవిస్తున్నారన్నారు, ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది మహిళలు మరియు పురుషులు వారి బాల్యంలో అలాంటి హింసకు గురయ్యారన్నారు. 1.6 బిలియన్ల మంది పిల్లలు తప్పకుండా వారి ఇంట్లో సంరక్షకుల ద్వారా హింసాత్మక శిక్షను భరిస్తున్నారన్నారు. హింసాత్మక క్రమశిక్షణను అనుభవించే పిల్లలలో మూడింట రెండు వంతులు శారీరక శిక్షకు మరియు మానసిక దూషణకు గురవుతున్నారన్నారు. నలుగురు చిన్న పిల్లల్లో ముగ్గురు తమ సంరక్షకుల ద్వారా క్రమం తప్పకుండా హింసకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలో హింస ఉందని, దాదాపు 130 మిలియన్ల, 13 నుండి 15 సంవత్సరాల వయస్సు గల ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులు బెదిరింపులకు గురవుతున్నారన్నారు.. ప్రపంచంలోని పిల్లలలో 86 మందిని చట్టం ద్వారా శారీరక శిక్ష నుండి పూర్తిగా రక్షించబడలేదన్నారు. ఇప్పుడు ఆన్లైన్ లో 30 దేశాల్లోని యువకులలో మూడింట ఒక వంతు మంది ఆన్లైన్ వేధింపులకు గురవుతున్నట్లు నివేదించారు. 2020లో 153,000 కంటే ఎక్కువ వెబ్సైట్లు బాల లైంగిక వేధింపుల చిత్రాలను కలిగి ఉన్నట్లు నివేదించబడ్డాయని , ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 16 ఎక్కువని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా లైంగిక హింస విస్తృతంగా ఉందని, సుమారుగా 15 మిలియన్ల మంది కౌమార బాలికలు 15 నుండి 19 సంవత్సరాల మధ్య బలవంతపు లైంగిక సంబంధాన్ని లేదా ఇతర బలవంతపు లైంగిక చర్యలను వారి జీవితకాలంలో అనుభవించారని తెలిపారు. అంగవైకల్యాలు కలిగిన పిల్లలు వైకల్యం లేని పిల్లల కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ హింసకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం వారిలో 90 మంది కుటుంబానికి తెలిసిన వారిచే దాడికి గురయ్యారని, ఇది చాలా భయంకరమైనదన్నారు.

## రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు చెక్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇక మీదట రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దళారుల దందాకు చెక్ పెట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో విఐపిల కోసం ఏర్పాటు చేసిన 'అంతరాలయ దర్శనాలు'కు రూ.500ల టిక్కెట్లు ఏర్పాటు చేసారు.ఈ అవకాశాన్ని దళారులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నారు. అంతేకాకుండా అంతరాలయానికి వచ్చిన విఐపిల నుంచి అర్చకులకు కూడా తట్టల్లో ఘనంగానే సంభావనలు దక్కేవి. అయితే సామాన్య భక్తులు ఆ సమయంలో నొచ్చుకునే వారు. కొన్ని సమయాల్లో సామాన్య భక్తులు సంయమనం మరచి రెచ్చిపోయి సిబ్బంది మీద తిరగబడే సందర్భాలు లేకపోలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. వారి భక్తిభావాన్ని పరిరక్షించుటకు దేవస్థానం ఎన్నో చర్యలు తీసుకుంటుంటే దళారులు ఆ అవకాశాలను ఙకూడా సద్వినియోగం చేసుకుంటున్నారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి దేవస్థానం రూ.500లు టిక్కెట్లు ఖరారు చేసారు. ఎవరైనా సరే అంతరాలయ దర్శనానికి వెళ్ళాలంటే ఈ టిక్కెట్టు కొనుక్కోవాల్సిందే అని ఖరారు చేసారు.ఈ నిర్ణయం దళారులకు వరంగా మారింది. వచ్చిన విఐపిలకు అంతరాలయ దర్శనం చేయిస్తామంటూ వేల రూపాయలు దండుకోవటం మొదలెట్టారు. అయితే రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. అంతేకాక స్వామి గర్భగుడి వద్ద ఉన్న సిబ్బందిపై సామాన్యభక్తులు తెలియక తిరుగుబాటు చేసే వారు.ఈ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఇఓ బాపిరెడ్డి ఎలాగోలా చెక్పెట్టాలని నిర్ణయించారు.

## జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి: సిపిఐ రామకృష్ణ

### - విజయవాడలో కాంగ్రెస్ నేతలు రఘువీరా, శివాజీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలనే అంశంపై ఆదివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి, కొలనుకొండ శివాజీ, జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జన గణనతో పాటు, కులగణన కూడా చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించిన విధంగా.. బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ రెండు అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనిట్లు చెప్పారు. పక్కన ఉన్న తెలంగాణాలో కుల గణన అమలు చేశారని, కర్నాటలో కూడా ప్రకటించారని.. మన ఏపీలో కూడా కుల గణన జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ సాధించుకునేందుకు ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై ఈరోజు సమావేశంలో చర్చిస్తున్నామన్నారు. 143 వెనుక బడిన కులాలు ఉండగా, బీసీలకు స్థానాలు తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారని చెప్పారు. తెలంగాణాలో కుల గణన జరిగిన నేపథ్యంలో బీసీలకు పదవులు వచ్చాయని, ఏపీలో కూడా ఇదే విధంగా కుల గణన చేపట్టి.. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపుతామని రామకృష్ణ పేర్కొన్నారు. రఘువీరారెడ్డి,

కొలను కొండ శివాజీలు మాట్లాడుతూ తెలంగాణా,కర్ణాటకలో బీసీ ముసాయిదాను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు.నిర్దిష్ట ప్రామాణికాలతో బీసీ సర్వేను నిర్వహించి, తదనుగుణంగా రూపొందిన నివేదికపై చర్చించి.తర్కించి రిజర్వేషన్లు అమలు చేసారన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో 7,441 బిఇడి సీట్లు భర్తీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** రాష్ట్రంలో బ్యాచ్లర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బి.ఇడి) సీట్ల భర్తీకి నిర్వహించిన రెండో విడత టిజి ఎడ్సెట్ కౌన్సె లింగ్లో 7,441 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆదివారం టిజి సెట్స్ కన్వీనర్ పాండురంగారెడ్డి

సీట్ల కేటాయింపు వివరాలు వెల్లడించారు.రెండో విడత కౌన్సెలింగ్లో కన్వీనర్ కోటాలో మొత్తం 10,005 బి.ఇడి సీట్లు అందుబాటులో ఉండగా, 12,076 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 9,955 సీట్లు కేటాయించగా, 4,474 మంది విద్యార్థులు రిపోర్టింగ్ చేసినట్లు తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 వరకు కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని అన్నారు.



జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్ను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

# సమాజ మనుగడకు కళలు దోహదం చేస్తాయి

## డా. పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజ మనుగడకు సాహిత్యం, కళలు దోహదం చేస్తాయని డా. పట్టాభి కళాపీఠము వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం గుంటూరు ఎస్.హెచ్.వో హాలులో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్ ను సాహితీవేత్తలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు మల్లెతీగ సాహిత్యసేవాసంస్థతో కలిసి రచయితలు, కళాకారులు, కార్టూనిస్టుల కోసం నవంబరులో విజయవాడలో ఒక గొప్ప సాహిత్య సాంస్కృతిక సంబరం చేయడం నేటి అవసరంగా భావిస్తున్నానన్నారు. ఈ వేదికను ఔత్సాహికులందరూ వినియోగించుకోవాల్సిందిగా కోరారు. ఉత్సవాల కమిటీ గుంటూరు పట్టణ కార్యదర్శి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ ఎలాంటి రుసుమూ లేకుండా ప్రతినిధులందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ముందుగా పేరు నమోదు చేసుకుని వేడుకల్లో పాల్గొన్నవారికి సత్కారం చేయాలని కమిటీ నిర్ణయించిందని, కవులు,రచయిత(త్రు)లు,కార్టూనిస్టులు,కళాకారులు తమ పేరు, వివరాలు పంపి నమోదు చేసుకోవాలని కోరారు.

ఇతర వివరాలకు 9246415150, 83329 03156 నెంబర్లలో సంప్రదించవచ్చారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, సింగర్ ఎన్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



# శ్రీవారి అనుగ్రహం మహిళా శక్తిపై ఉండాలి

## - తిరుమలలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లా

**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం దేశంలోని మహిళాశక్తిపై కలగాలని లోక్సభస్పీకర్ ఓంబిర్లా తెలిపారు. తిరుపతిలో తొలిసారిగా జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశసింగ్, ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుతో కలసి ఓంబిర్లా తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. వీరికి టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన బిర్లా అనంతరం ఆనంద నిలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామినికి దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు.రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఓంబిర్లా, హరివంశ్సింగ్, అయ్యన్నపాత్రుడు, రాఘురామరాజుకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. వీరితోబాటు ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శ్రీవారిని దర్శించుకున్నారు.

# ఎన్ఎఫ్ఐఆర్ నూతన జాతీయ కార్యవర్గం

## - జాతీయ ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన డాక్టర్ మర్రి రాఘవయ్య

## - రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎన్నికైన భరణి భాను ప్రసాద్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ మహాసభల్లో తెలుగు రాష్ట్రాలు మరోసారి తమ సత్తాను చాటుకున్నాయి. ఇటీవల న్యూఢిల్లీలోని కర్నయిల్ సింగ్ స్టేడియంలో 31వ జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో సమాఖ్య ప్రతినిధులు రాబోయే కాలవ్యవధికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్ఎఫ్ఐఆర్ అధ్యక్షులుగా గుమాన్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మర్రి రాఘవయ్య, కోశాధికారిగా ఆర్పి సింగ్, తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎం భరణి భాను ప్రసాద్లను సమాఖ్య ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులుగా యు వెంకటేశ్వర్లు, కె విఆర్ ప్రసాద్, ఎం వెంకటేశ్వరరావు, కె ప్రభాకర్, అరుణ్ కుమార్, ప్రభురాజ్, రమణయ్య, డి సత్యవాణిలను ఎన్నుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లివ్వాలి



**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, మహిళా బిల్లులో బిసి మహిళకు ప్రత్యేక సబ్కోటా ఇవ్వాలన్నారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసారావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎలమందరావు, బిఎస్ఆర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీర్స్ డే సందర్భంగా టిఎస్ సిఎం రేవంత్రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తమ మేధో శక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజనీర్లదేనని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజి నీరుగా, దార్శని కుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సిఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాదు నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు,ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారన్నారు.

## యూరియా కొరత తీవ్రం

### పంట చేతికి రాదనుకొని మరణించిన రైతు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రతరం అవుతోంది. యూరియా బస్తాలు దొరకపోవడంతో పంట చేను చేతికి రాదన్న మనస్తాపంతో ఒక యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, ధనియాలపాడు పంచాయతీ పరిధిలోని సేవ్యాతండాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల తెలిపారు.

# అద్భుతంగా ముగిసిన రాయలసీమ నృత్యకళోత్సవాలు

**తిరుపతి,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** నాటక రంగాన్ని పరిరక్షించుకుంటూ కళాకారులను ప్రోత్సహించేదిశగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చేపడుతున్న నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం ఉదయం ఒంగోలు జానపద బృందం కళాకారులు సుగాలి నృత్యం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. కళాకారులకు ప్రదర్శన బహుమతిగా శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమలను అందజేశారు. విజేతలకు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడురోజులు జరిగిన రాయలసీమ రంగస్థలి నృత్యకళోత్సవాలు కళాకారులను, ఆహుతులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు శ్రీకృష్ణదేవ రాయ పురస్కారాలను నిర్వాహకులు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్రెడ్డి, కోండే చెంగారెడ్డి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు ,మల్లారపు వాసు ప్రదానం చేశారు.



# తిరుమలలో జడివాన

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం వేకువజాము నుండి ఉదయం 9గంటల వరకు తిరుమలలో జడివాన కురిసింది., వేకువజామున 4గంటలనుండి మోస్తరుగా కురిసిన వాన ఆ తరువాత చిరుజల్లులతో బలంగా పడింది. ఆదివారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రముఖులు, భక్తులు గొడుగులక్రింద సేదదీరారు. అంతేగాక వానలోనే స్వామివారిని దర్శించుకున్నారు. జడివానతో తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లటిగాలులు వీస్తున్నాయి

## డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జికి పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డితోపాటు సిద్దిపేట నియోజకవర్గఇన్చార్జి పూజల హరి కృష్ణకు పిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపి మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డిపై గజ్వేల్కు చెందిన దళితులు, పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేయడంతో నర్సా రెడ్డిని గాంధీభవన్కు పిలిపించి షోకాజ్ నోటీసు జారీ చేశారని పార్టీ వర్గాలు తెలిపారు. పిసిసి క్రమశిక్షణ కమిటీకి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించినట్లు వివరించారు. అలాగే సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణపై సైతం పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్గౌడ్కు 10మందికిపైగా సిద్దిపేటకు చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో వివరణ ఇవ్వలని పిసిసి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీచేసిందని పార్టీ శ్రేణులు తెలిపారు.

# కీచక టీచర్ కటకటాల్లోకి

## వెరిటాస్ సైనిక్ పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుని లైంగిక దాడి

**ములుగు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్ చక్కదిద్దాల్సిన పాఠశాలలో ఉపాధ్యాయుడు వారిపై లైంగిక కోరిక చూపితే ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్కు చెబితే పాఠశాల నుంచి రెడ్ టీసీ ఇచ్చి పంపిస్తామని హెచ్చరించిన సంఘట ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థిని కుటుంబసభ్యులు, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్రెడ్డి అందించిన వివరాల మేరకు... హైదారాబాద్కు చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతి చదువుతుంది. కాగా ఈనెల 4న సాయంత్రం విద్యార్థులందరూ చదువుకుంటున్నారు. అదే సమయంలో పాఠశాలలోని ప్రణయ్ అనే ఉపాధ్యాయుడు వచ్చి ఉపాధ్యాయుల దినోత్సవం కోసం తరగతి గదిని డెకరేషన్ చేయాల్సి ఉందని ఓ విద్యార్థిని తీసుకొని వెళ్లారు. తరగతి గదిలోకి వెళ్లగానే లైట్స్ ఆఫ్చేసి ఆ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థి ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లింది.

## లక్షలతో నిర్మించారు.. తుప్పల్లో వదిలేశారు..



చీపురుపల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో చీపురుపల్లి పట్టణ పరిధిలో భవనాలు తుప్పలపాలై శిథిలావస్థ చేరుకుంటున్నాయి. ప్రధానంగా కొత్త అగ్రహారం సమీపంలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రం నిరుపయోగంగా పడి ఉండడంతో భవనం శిథిలావస్థ చేరుకొని భవనం చుట్టూ తుప్పలు పేరుకుపోయి భయానకంగా దర్శని ఇస్తుంది. అదేవిధంగా రామాంజనేయ కాలనీ సమీపంలో నిర్మించిన హెల్త్ సెంటర్ కూడా ఉపయోగంలోకి తీసుకోక పోవడంతో పిచ్చి మొక్కల పేరుకు పోయి భవనం నిరుపయోగంగా దర్శనమిస్తుంది. చీపురుపల్లి ప్రాంతంలో అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నడిపిస్తుండగా నిర్లక్ష్యంగా వదిలేసిన భవనాలను వాడుకులోకి తీసుకోగలిగితే కొన్ని శాఖలకు ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బహుళ అంతర పంటల విధానాలు రైతులకు మేలు



పాచిపెంట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త

రైతులు కేవలం ఏకపంట విధానాన్ని పాటించటం కంటే బహుళ పంటల విధానం లేదా అంతర్పంటల విధానాన్ని అవలంబించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ అధికారి కే.తిరుపతిరావు అన్నారు. ఆదివారం పాంచాలి గ్రామంలో వరి గట్ల మీద కంది విత్తనాలను నాటిస్తూ పత్తిలో అంతర పంటగా వేసిన కంది వ్యవసాయ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర పంటల విధానంతో కేవలం అదనపు ఆదాయం రావడమే కాకుండా భూమి బయట లోపల జీవ వైవిధ్యం పెరిగి భూమి యొక్క భౌతిక స్థితి మెరుగుపడి పంటకు కావలసిన అన్ని పోషకాలు అందుతాయని బహుళ పంటల వేరు బుడిపెలులో ఉన్న సూక్ష్మజీవులు గాలిలో ఉన్న నత్రజని భూమిలోకి స్త్రీకరించి పంటకు అందేటట్లు చేస్తుందని వివరించారు. అలాగే వరి గట్ల మీద కంది విత్తనాలు నాటుకోవడం ద్వారా ఒక ఎకరా వరిగట్ల మీద నుండి కనీసం 100 కిలోల వరకు కంది పంటను పొందవచ్చని దీనికి ఎలాంటి ఖర్చు లేదని ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న కందిని నాటుకుంటే సరిపోతుందని తెలిపారు. గట్ల మీద కంది విత్తనాలు నాటడం ద్వారా వేరు వ్యవస్థ భూములోనికి వెళ్లడం వలన గట్లు కూడా స్థిరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ కృష్ణ, ప్రకృతి సేద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీ సూర్య పీఠంలో భానుసప్తమి పూజలు



పార్వతీపురం, సెప్టెంబర్14, ప్రభాతవార్త

స్థానిక శ్రీ సూర్య పీఠంలో భానుసప్తమి సందర్భంగా విశేష అర్చనలు సప్త సూర్య నమస్కారములు, తృచ సౌరారుణ పారాయణలు, నారాయణ సూక్త, విష్ణుసూక్త, ఆయుస్సూక్త రుద్రమన్యుసూక్త సకలదేవతా మంత్ర హవనములు అశేష శేముషీనిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మధురగాయక, జాతీయ స్థాయి ఉత్తమ గాయకులచేత సత్కారములు పొందిన ఉభయతెలుగు రాష్ట్రాలలో వేదికలపై తన గానా మృతమును పంచి, నాటకరంగ పద్య గానకళా ప్రతిభచే ఉత్తరాంధ్ర కే ఎంతోగుర్తింపు తెచ్చిన శ్రీ సూర్యపీఠ ఆస్థాన పండిత గాయకులు భాస్కరభట్ల సత్యప్రసాద్ శర్మ నీ దుశ్శాలువతో సౌరయాగశాలలో సత్కరించారు. సూర్యభగవానుని ప్రతిమ, కళ్యాణ శేషవస్త్రం, లక్ష్మీనారాయణ యంత్రాన్ని నరహరిశాస్త్రి బహూకరించారు. ఈ కార్యక్రమములో వే.వివేకానంద శర్మ, వే.నీలకంఠ శర్మ, వే.బదరీ శర్మ, దా.ఉమా శర్మ, కేశవ శర్మ, హర్ష శర్మ, దివాకర శర్మ, టి.ఆర్.కె.శర్మ తదితరులు వైదిక సహకారం అందించారు. అనంతరం బాల భాస్కర ఋషివాటికలో నారాయణ సేవ జరిగింది.

## 'స్త్రీ శక్తి' పథకంతో పాపం జెంటిల్ మేన్స్!

### మహిళలతో రద్దీగా ఆర్టీసీ బస్సులు -అటో ఇటో ఎటో పోతున్న ఫ్రీ ప్రయాణం -సీట్లుఖాళీ లేక దిగిపోతున్న పురుషులు -సర్కార్ సర్వేలు ఫలితం శూన్యం



సాలూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

కూటమి సర్కార్ మహిళామణులకు ఉచిత ప్రయాణం "స్త్రీ శక్తి" పథకం అనే ఆయుధం చేతికి ఇవ్వడంతో ఆర్టీసీ బస్సులలో పురుషులు ప్రయాణించాలంటే అల్లాడి (ఒనికి) పోతున్నారు. ఎందుకంటే ఈమధ్య ఆర్టీసీ బస్సులో కేవలం సీటుకోసం పెద్దాయన అని చూడకుండా ఒక మహిళ చేసిన రాద్ధాంతం రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.అంతేకాకుండా ఒకరిపై ఒకరు పోలీస్ కేస్ పెట్టేవరకు వెళ్ళింది. ఇది ఇలాఉంచితే ఈ స్త్రీ శక్తి పథకం మహిళలకు వరంలా మారీనా ఆటోనే జీవనాధారంగా నడుపుతున్న ఆటో వాలాకు మాత్రం శాపం తగిలి రోడ్లపై దర్నాలు చేయడం చూసాం.అలాగే సేమ్ టైం అంతంత మాత్రం లాభాలతో నడుస్తున్న ఆర్టీసీ కూడ స్త్రీశక్తి దెబ్బకు కుదైలైనా బయటకు గంభీర్యం ప్రదర్శిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకా ప్రతిరోజూ ఫ్రీ బస్ ప్రయాణంలో మహిళలు సీట్ల కోసం సిగపట్లు పట్టుకోవడం అక్కడక్కడ దృశ్యాలు కామన్ గా కనపడుతున్నాయి. అలాగే పురుషులు బస్ ఎక్కేటప్పుడు సీట్లలలో ఫుల్ గా స్త్రీలు ఉంటే జెంటిల్ మెన్ లా కామ్ గా బస్సుదిగి తమదారి తాము (బైక్ లో) చూసుకుంటున్నామని వాపోతున్నారు.ఇంకా చెప్పాలంటే ఇప్పుడున్న పరిస్థితుల బట్టి మహిళా ఫ్రీబస్ లలో సీసీ కెమెరాలు అలాగే పోలీస్ సెక్యూరిటీ పెడితే కానీ పురుషులు ధైర్యంగా బస్సులలో ప్రయనించలేరని పలువిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం మహిళా ఉచిత ప్రయాణం గురించి ఎన్నో సర్వేలు చేసి స్త్రీ శక్తి పథకం అమలు చేసినా ఫలితం మాత్రం శూన్యం అని జనాలు పెదవివిరుస్తూన్నారు. కూటమి సర్కార్ ఉచిత ప్రయాణం రైట్ రైట్ అని సుదూరంగా జర్నీ సాగిస్తుందో లేక మధ్యలో మంగళం ( పునిస్టాప్ ) పాడుతుందో కొంతకాలం వెయిట్ చేస్తే గాని తెలియదని ఈ విషయంపై జనాలలో చర్చ నడుస్తుంది.ఈ దెబ్బతో స్త్రీ శక్తి ఏలా ఉంటదో అందరికి అర్ధమైందని అందులో ముఖ్యంగా పురుషలకు బాగ అర్థమయ్యిందని ప్రసార మాధ్యమాల్లో మెసెజ్‌లు చక్కెర్లు కొడుతున్నాయి.

## శరవేగంగా కాలువల నిర్మాణ పనులు



శృంగవరపుకోట, సెప్టెంబర్14,ప్రభాతవార్త

ఎస్.కోటలోని విశాఖ-అరుకు ప్రధాన రహదారికి ఇరువైపులా దేవిబొమ్మ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడం వర్షాలు కురిసే సమయంలో రోడ్లుపై పెద్ద ఎత్తున వరద నీరు నిలచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడడం జరిగేది.రహదారికి ఇరువైపులా ఆక్రమణలను చోటుచేసుకోవడం వలన వరద నీరు నిలిచి ఇలాంటి పరిస్థితిలు నెలకొనడంతో ఇటీవల రెవెన్యూ,పంచాయతీ రాజ్ శాఖాధికారులు సంయుక్తంగా కలిసి ఆక్రమణలు తొలగించారు.దింతో కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

## మండలం సర్వ సభ్య సమావేశం :ఎంపిడీవో రత్నం



రామభద్రపురం,సెప్టెంబర్14,ప్రభాతవార్త

రామభద్రపురం మండలం అభివృద్ధి కార్యాలయంలో 15న ఉదయం 11 గంటలకు సర్వ సభ్య సమావేశం జరుగును అని మండలంలో గల మండలం స్థాయి అధికారులు కు సర్పంచ్ లకు ఎంపిటిసి లకు తెలియ పరచడం అయ్యింది అందరు ఈ సమావేశం నకు 11 గంటలకు హాజరు కావాలని కోరుచున్నాము.

## ఘనంగా గణేష్ కోవెల వద్ద "అన్న సమారాధన"



గజపతినగరం, సెప్టెంబర్ 14,(ప్రభాతవార్త

స్థానిక వినాయక కోవెల వద్ద వరసిద్ధి వినాయక పూజ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన "అన్న సమారాధన" కార్యక్రమం ఘనంగా జరిగింది. సుమారు 4000 మంది భక్తులు ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ప్రతి ఏడాది గణేష్ నిమజ్జనం అనంతరం అన్న సమారాధన కార్యక్రమం చేపట్టడం జరుగుతుంది. అందులో భాగంగా నిర్వాహకులు ఈ అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టగా, ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజు తొలి వడ్డన చేసి ప్రారంభించారు.

## రాళ్లదాడిలో సిఆర్పిఎఫ్ సిబ్బందికి స్వల్ప గాయాలు

మక్కువ సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

మక్కువలో జరిగిన దేశమ్మ తల్లి వారాల పండగలో స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం జరిగిన రాళ్లదాడిలో ముగ్గురు సిఆర్పిఎఫ్ సిబ్బందికి స్వల్పంగా గాయాలైనట్లు తెలిసింది. నాలుగు రోడ్లు కూడలిలో ఆకతాయిల మధ్య ఘర్షణ జరిగింది. అయితే ఊరేగింపుగా వెళుతున్న సందర్భంలో స్థానిక రచ్చబండ సమీపంలో కొంతమంది గుర్తుతెలియని ఆకతాయిలు రాళ్ల దాడి జరిపిన నేపథ్యంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిఆర్పిఎఫ్ సిబ్బంది ముగ్గురికి గాయాలైనట్లు సమాచారం.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



గజపతినగరం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

స్థానిక సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక నేత్రాలయ ఐ కేర్ వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో డా.గిరిజ 90 మందికి పరీక్షలు నిర్వహించగా, 51 మందిని కేటరాక్ట్ సర్జరీకి ఎంపిక చేశారు. కేటరాక్ట్ సర్జరీకి ఎంపికైన వారందరినీ బస్ ద్వారా తీసుకొని వెళ్ళి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సహాయ స్ఫూర్తి అధ్యక్ష, కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్, నేత్రాలయ ఐ కేర్ నిర్వాహకులు మౌనిక, కృష్ణ,సభ్యులు శ్యామ్, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

## 24న నిర్వహించనున్న బహిరంగ సభ జయప్రదం చేయండి..

బొబ్బిలి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



ఈనెల 24 న అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో బహిరంగ సభ జయప్రదం చేయాలని నేడు గోడ పత్రికలు విడుదల చేశారు. 1932 సెప్టెంబర్ 24 పూనా వడంబడిక పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలియజేశారు. అస్పృశులుగా భావించబడి సర్వ హక్కులకు దూరమైన ప్రజలకు రెండు ఓట్లు హక్కును సాధించిన ప్రపంచ మేధావి భారతరత్న బాబాసాహెబ్ డా.బి అంబేద్కర్ కొంగ తీసిన రోజు పనులు 32 సెప్టెంబరు అన్నారు ప్రత్యేక నియోజకవర్గాలలో ఓటు వేసే హక్కు జనరల్ నియోజకవర్గాల్లో ఓటేసే హక్కును కూడా సాధించారు అంబేద్కర్ త్రివర్ణ హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తూ హరిజనవంతరణ ముసుగులో ఉన్న గాంధీ అంటరాని వారికి రెండు ఓట్లు ఉండరాదని ఎరివాడ జైల్లో నిరాహార దీక్ష పూణి త్రివర్ణ హిందు వులకు సవర్ణనలను అంబేద్కర్ పైన అస్పృశ్యమైన రెచ్చగొట్టారు దీనిపై మాతో వచ్చే మేధావులు భారీ బహిరంగ సభలో మాట్లాడుతారని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అందరూ ఆహ్వానం కావాలని కోరారు

## హక్కులు కల్పించండి... ఆదుకోండి.. అగ్రహారం రైతుల ఆవేదన



చీపురుపల్లి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

చీపురుపల్లి పట్టణ పరిధిలోని గులివిందాడ అగ్రహారం పరిధిలోగల 1190 ఎకరాల ఇనాం భూములకు సంబంధించి రైతులకు హక్కులు కల్పించి ఆదుకోవాలని రైతులంతా ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం నాడు అగ్రహారం సచివాలయం దగ్గర రాజకీయ పార్టీలకు అతీతంగా రైతులంతా సమావేశమయ్యారు. జీ అగ్రహారం పరిధిలో గల ఇనాం భూములకు సంబంధించి తమ సాగులో ఉన్న రైతులందరికీ హక్కులు కల్పిస్తూ పాసు పుస్తకాలు మంజూరు చేయాలంటూ రైతులు తీర్మానించుకున్నారు. ఇనాం భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఏళ్ల తరబడి తాము సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలంటూ ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. రైతులుగా ఆ భూములపై వ్యవసాయం చేసుకుంటూ ఇళ్ల తరబడి కుటుంబాన్ని పోషించుకున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఈ సందర్భంగా రైతులు కోరారు.

## 8 మద్యం బాటిల్లతో ఒకరి అరెస్ట్

గజపతినగరం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె.జనార్ధన్ రావు ఆధ్వర్యంలో ఆదివారం సర్కిల్ పరిధిలో గల బోండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేపట్టారు. ఈ క్రమంలో దేవుపల్లి గ్రామంలో 8 మద్యం సీసాలతో పి.బానయ్య అను వ్యక్తి పట్టుబడగా, ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ జనార్ధన్ తెలిపారు. ఈ దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్లు పి.నరేంద్ర కుమార్, పి.శాంతిలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ భాషా, పి.బి.ఎస్వి.ఆర్ రాజు, కానిస్టేబుల్లు. అప్పారావు, బి.గంగాధరుడు పాల్గొన్నారు.

## ఏ.పి.టి.ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి కొండపల్లికి వినతి



నెల్లిమర్ల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) తలపెట్టిన నిరసన వారంలో భాగంగా ఆదివారం ఆ సంఘం నాయకులు రాష్ట్ర ఎంఎస్ఎమ్ఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను మంత్రికి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పిఆర్సి కమిషన్ నియమించి ఐ ఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావలసిన అన్ని బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఈ హెచ్ ఎస్ పరిమితిని 25 లక్షల రూపాయలకు పెంపుదల చేయాలని, ఉపాధ్యాయులకు యాప్ ల బాధ్యతల నుంచి తప్పించాలని, అసెస్మెంట్ బుక్ లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ విజయనగరం జిల్లా అధ్యక్షులు షేక్ బుఖారీ బాబు, ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్ కర్రి రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు మజ్జి రమేష్, మర్రాపు శ్రీనివాస్ కె.వెంకునాయుడు, తిరుమలరెడ్డి .శ్రీనివాస్ రావు, ఏపి టి ఎఫ్ అర్బన్ నాయకులు బి సుగుణాకర నాయుడు, కె. వెంకట రావు, జి.కృష్ణ మూర్తి, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల

శృంగవరపుకోట,సెప్టెంబర్14,ప్రభాతవార్త



మహిళా సాధికారతపై తిరుపతిలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పార్లమెంటరీ కమిటీ జాతీయ సదస్సులో ఆదివారం ప్రారంభించిన మొదటి రోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో రాష్ట్రం నుంచి ముఖ్య అతిథులుగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు,పలువురు రాష్ట్ర మహిళా మంత్రులు,ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో బిసీలకే పెద్దపీట



కోటబొమ్మాళి-ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంలో బిసీలకే పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లి రవేంద్ర, దువ్వారపు రామారావులన్నారు. ఆదివారం విజయవాడలో బిసి సాధికారిక కీన్వినర్‌లు, జిల్లా అధ్యక్షుడు, జూనల్ కన్వీర్‌లను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ లోనే అత్యంత జనబాలం కలిగిన బీసీలకు ప్రభుత్వ పథకాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరుగుతుందని వారు అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి ఇన్‌మనేషన్ పదవుల్లో, పార్టీ పదవుల్లో గుర్తింపు నిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. ప్రభుత్వ కార్యాక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత బిసీలపై ఉందన్నారు. ఈ సమావేశంలో టిడిపి కలింగ వైశ్య సాధికారిక రాష్ట్ర కన్వీనర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, తదితరులు ఉన్నారు.

## జన్ని కుటుంబానికి ఎస్‌జిఎఫ్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం



కవిటి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

మండలం పెద్ద మెలియాపుట్టుగ గ్రామానికి చెందిన చింతామణి దేవాలయం అర్చకుడు జన్ని గోపాల్(40) అకాల మరణంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ జి ఎఫ్ ఫౌండేషన్ సభ్యులు తక్షణ సహాయంగా రూ.11,000 అందించారు. కుటుంబానికి మరింత చేయూత అందించేందుకు గ్రామస్తులు, ఇతర సేవా సంస్థలు ముందుకు రావాలని %ూ+ఖీ% సభ్యులు విజ్ఞప్తి చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
25 Glorious years
వార్త

## భవన నిర్మాణ కార్మికుడి మృతి



మక్కువ సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

మక్కువ బిసి కాలనీలో భవన నిర్మాణ పనిని పరిశీలించే క్రమంలో విద్యుత్ తీగలు తలకు తగలడంతో భవన కార్మికుడు అక్కడకక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇంటిపైన పిట్టగోడలు పనుల కోసం చప్ప బుచ్చంపేట పంచాయతీ పాలికవలస గ్రామానికి చెందిన పాల గౌరీ శంకర్ అనే భవన కార్మికుడు పనిని చేస్తున్నాడు. తాను నిర్మించిన ఇల్లు ప్లాస్టింగ్ పనులను పరిశీలన చేసేందుకు మేడ పైకి వెళ్ళాడు. మెట్ల డూమ్ పనిని పరిశీలించేందుకు పిట్టగోడ ఎక్కడంతో పైనుంచి ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయి మరణించాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రదర్శనగా హైస్కూల్ విద్యార్థులు



దత్తరాజేరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

18వ జనవిజ్ఞాన వేదిక మహాసభలు విజయనగరంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో దత్తిరాజేరు మండలం రామచంద్రపురం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు అయిన ఎస్ మణికంఠ ఎస్ రోహిత్ వీళ్ళతోపాటు గైడ్ ఉపాధ్యాయుడు ఎస్ రవీంద్రను ప్రధానోపాధ్యాయులు సిహెచ్ కృష్ణమూర్తి మరియు ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

## గరివిడి అభివృద్దే ధ్యేయంగా పురోగమిస్తాం..

గరివిడి సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



గరివిడి అభివృద్దే ద్యేయంగా పురోగమిస్తామని రీ యూనియన్ ఆఫ్ గరివిడి సంస్థ ప్రతినిధులు వెల్లడిం చారు. విశ్వ భారత్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బలివాడ రమేష్ నేతృత్వంలో ఏర్పడిన రీ యూనియన్ ఆఫ్ గరివిడి ..భవిష్యత్తు కార్యాచరణకు సంభందించి నూతన కమిటీల సమావేశం స్థానిక ఒక హొటల్లో ఆదివారం రాత్రి నిర్వహించారు. రీ యూనియన్ ఆఫ్ గరివిడి ప్రతినిధి కంబాల శివ,విశ్వ భారత్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బలివాడ రమేష్, సీనియర్ కార్మిక నాయకులు ముదునూరు జగన్నాధరాజు, ఎస్ డి ఎస్ స్వయం ప్రతిపత్తి కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ కెప్టెన్ కుప్పిలి చంద్ర మౌళి పట్నాయక్, తెలుగు ఉపన్యాసకులు రాంభట్ల సుబ్బారావు తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఇతర కమిటీ ప్రతినిధులతో సమాలోచనలు చేశారు.గరివిడి పట్టణంలో నెలకొన్న సమస్యలతో పాటు యువతకు ఉపాది అవకాశాలు, క్రీడా, కళా రంగాలు తో పాటు ఇతర రంగాల్లో రాణిస్తున్న వారికి ప్రోత్సాహం అందివ్వడం అంశాలపై వారు దృష్టి పెట్టి పురోగతి సాధిం చాలని సంకల్పించారు. కమిటీ ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి, అలోచనలను పంచుకున్నారు. కొండపాలెం సర్పంచ్ ప్రతినిధి పి.కుమార్, రఘు, కమిటీ సభ్యులు పాల్గొని పలు సూచనల చేశారు.

## ఘనంగా హిందీ దివస్



లక్కవరపుకోట, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

మండలంలోని కొట్యాడ ఉన్నత పాఠశాలలో ఆదివారం హిందీ దివస్ ఉత్సవాన్ని ఎచ్ఎం జామి అప్పల నాయుడు అధ్యక్షులుగా హిందీ ఉపాధ్యాయులు కామేష్అలాగే ఉపాధ్యాయిని ఉమల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ సాహిత్యంకి సంబంధించిన పలు పద్యాలు గీతాలు ఆలపిస్తూ నృత్యం చేశారు ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు హిందీ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. కొట్యాడ జడ్పీ హైస్కూల్ కొట్యాడ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లమ్మచెరువు గండిని ఇరిగేషన్ శాఖ వెంటనే బాగుచెయ్యాలి..రైతుల విజ్ఞప్తి

బొబ్బిలి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



మల్లంపేట గ్రామ పైభాగంలో ఉన్న మల్లమ్మచెరువు శనివారం సాయంత్రం గండి పడిందని దానిని వెంటనే ఇరిగేషన్ శాఖ అధికారులు మరమత్తులు చేయాలని చెరువు ఆయుకట్ట మల్లంపేట రైతులు పోల జగన్, పోల వెంకట రమణ, కర్రి అప్పారావు, పెంట అప్పలనాయుడు తదితర రైతులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు ఈ చెరువు గండి పడిన సమాచారాన్ని ఇరిగేషన్ అధికారులకు, బొబ్బిలి మీడియాకు తెలిపారు. మల్లంపేట గ్రామపై భాగం నుంచి ఇరిగేషన్ కాలువ పరిధిలో, కొత్తచెరువు, తమ్మినాయుడు చెరువు,మల్లమ్మచెరువు, ఉన్నాయని, శనివారం సాయంత్రం, మల్లమ్మచెరువు మధుములు, గట్టు చిదిలమై ఉన్నందున గండి పడి దని తెలిపారు. గండి పడిన విషయాన్ని తెలుసు కున్న ఆయకట్టు మల్లంపేట రైతులు వెంటనే ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమత్తులు చేసినట్లు తెలిపారు.ఇరిగేషన్ అధికారులు వెంటనే ఈ చెరువు మధుములు, నిర్మించి పాత పద్దతి మధు ములు, విధానం బదులు లేటెస్ట మధుములు నిర్మించి ఆయుకట్ట భూములు పంటలు కాపాడాలని రైతులు కోరుకున్నారు.

## రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు రానున్నాయి

### -గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నాం -అవసరమైనంత మేరకే యూరియాను వినియోగించాలి -పైడితల్లి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహిస్తాం -రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త ప్రతినిధి

గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ దేశాలను ఆకట్టుకున్నామని, త్వరలో రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక బ్రాండ్ అని, ఆయన్ను చూసే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని కొనియాడారు. విజయనగరంలోని తమ క్యాంపు కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్ ఆదివారం మీడియా సమా వేశాన్ని నిర్వహించారు. ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో ప్రపంచ దేశా లను, పెట్టుబడుదారులను ఆకర్షించడంలో సఫలీకృతం అయ్యామని మంత్రి అన్నారు. జర్మనీలోని ఫ్రాంక్ ఫర్డ్‌లో జరిగిన సదస్సులో కూడా సత్ఫలితాలు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ సారధ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెట్టేవిధంగా భరోసాను నింపిందని అన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో మరింతగా పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే సుమారు 11 లక్షల కోట్ల పెట్టుబడులు సిద్ధంగా ఉన్నాయని, ఇవన్నీ కార్యరూపం దాల్చి ఫలితాలను ఇవ్వడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగానే గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొత్తం 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని, వీటిలో ఇప్పటికే 50 పార్కులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, త్వరలో మరికొన్నింటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. 11పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు కూడా జరుగుతోందని అన్నారు. రక్షణ రంగం, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని వివరించారు. మెరుగైన వైద్య సదుపాయాలను వీలైనంత త్వరగా ప్రజలకు అందించే లక్ష్యంతోనే వైద్య కళాశాలలను పిపిపి పద్దతిలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయం, పోర్టులు, జాతీయ రహదారులు, భారీ ప్రాజెక్టులను పిపిపి పద్దతిలో నిర్మిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య రంగం నిర్వీర్యం అయ్యిందని, మౌళిక సదుపాయాల కల్పన పడకేసిందని మంత్రి చెప్పారు. తమ పార్టీ హయంలోనే గతంలో కూడా రాష్ట్రానికి అత్యధికంగా మెడికల్ సీట్లు వచ్చాయని చెప్పారు. ఆరోగ్య భీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని, దీనివల్ల ప్రతీఒక్కరికీ ఆరోగ్య భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో తాము ముందు నుంచీ ఒకే విధానంలో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీకి ఈ విషయంలో స్పష్టత లేదని, రోజుకో మాట చెబుతోందని అన్నారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం శుభకరమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను అమలు చేశామని, రాష్ట్ర ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. అనంతపురంలో జరిగిన భారీ సభ ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రానికి 50వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని మంత్రి చెప్పారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా అధికంగా యూరియాను వినియోగించడం మంచిది కాదని అన్నారు. కేన్సర్, కిడ్నీ సమస్యలు వ్యాధుల విజృంభనకు కొంతవరకు అధిక యూరియా కారణమై ఉండవచ్చునని అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి పండుగను మునుపటి ఏడాదివలే ఈ ఏడాది కూడా భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ తెలిపారు.



## హాంకాంగ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమితో రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఈ భారత జంట చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్ మరియు చాంగ్ వాంగ్ ద్వయం చేతిలో ఓడిపోయింది. ఆదివారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రన్నరప్‌గా నిలిచారు. ఎనిమిదో సీడ్ రాంకిరెడ్డి-శెట్టి జోడీ చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్‌చాంగ్ వాంగ్ జోడీ చేతిలో 21-19, 14-21, 17-21 తేడాతో పరాజయం చెందింది. 2025 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో సహా ఐదు సెమీఫైనల్స్‌లో నిష్క్రమణలను ఎదుర్కొన్న ఈ భారత జంట హాంకాంగ్ ఓపెన్‌ను ఒక గంటలోపు పోటీని ముగించింది. రెండవ గేమ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ప్రదర్శన నిరాశాజనకంగా ప్రారంభమైంది. ఆట సగం ముగిసే సమయానికి 5-11తో వెనుకబడి ఉంది. ఆ తర్వాత ఈ జంట తమ లక్ష్యాన్ని మరింతగా పెంచుకుని, త్వరలోనే అంతరాన్ని కేవలం రెండు పాయింట్లకు తగ్గించింది. అయితే, వారు తమ లయను కోల్పోయి చివరికి రెండవ సెట్‌ను 14-21తో వదులుకున్నారు. మూడవ మరియు చివరి గేమ్‌లో, చైనాకు చెందిన వీచాంగ్ 0-6తో ప్రారంభంలో ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, దాన్ని 11-2కి పెంచారు. అయితే భారత జంట తీవ్రంగా పోరాడి 17-20తో అంతరాన్ని తగ్గించింది. కానీ తదుపరి పాయింట్‌లో షటిల్‌ను వైడ్ చేసి మ్యాచ్‌ను వదులుకుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష ్య సేన్, చైనాకు చెందిన రెండో సీడ్ షి ఫెంగ్ లీతో తలపడనున్నాడు.



## వరల్డ్ కప్ నింగ్బోలో మేఘనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025లో మేఘనా సజ్జనార్ తొలి కాంస్యం సాధించగా, స్వప్నిల్ కుసాలే ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. చైనాలోని నింగ్బోలో ఆదివారం జరిగిన ఈ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మేఘనా సజ్జనార్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా తన తొలి వ్యక్తిగత అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. 31 ఏళ్ల మేఘనా 632.6 స్కోరుతో క్వాలిఫైయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు చేరుకుంది. ఫైనల్‌లో అస్థిరమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఆమె 230.0 షూట్ చేసి కాంస్యం సాధించడానికి పట్టుదలతో ప్రయత్నం చేసింది. ఈ టోర్నీలో చైనాకు చెందిన టీనేజర్ పెంగ్ జిన్లు 255.3 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణం సాధించగా, నార్వేకు చెందిన ఒలింపియన్ జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ 252.6 పాయింట్లతో రజతం గెలుచుకుంది. కాగా భారత్‌కు చెందిన పారిస్ 2024 కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో పరాజయాన్ని చవిచూశాడు. 587-30+తో 21వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమయ్యాడు. ఇక కిరణ్ అంకుష్ జాదవ్ నాల్గవ స్థానంలో (590-31+) అర్హత సాధించినా, చివరి రౌండ్ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. ఈషా, మేఘన మరియు కిరణ్ తప్ప, మరే ఇతర భారతీయ షూటర్లు నింగ్బోలో ఫైనల్స్‌కు చేరుకోలేదు. ఒలింపిక్ పతక విజేత మను భాకర్ ఈ ఈవెంట్‌లో పాల్గొనలేదు. దీంతో మేఘనా పోడియం ఫినిషింగ్‌తో, భారత్ రెండు పతకాలతో టోర్నమెంట్‌ను ముగించింది. ఇప్పటికే శనివారం ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించింది.

### ఆస్ట్రేలియాతో మహిళల వన్డేలో..
## భారత్ 281 పరుగుల స్కోర్
### వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన స్మృతి, ప్రతీక

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ మహిళా క్రికెట్ జట్టు భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ అద్భుత ప్రదర్శన కనపరిచారు. ఇద్దరూ అర్ధ శతకాలతో చెలరేగి 100కు పైగా పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ క్రమంలోనే పాతికేళ్లుగా బెలిండా క్లార్క్-లిసా కైట్లీ పేరిట ఉన్న వన్డే ప్రపంచ రికార్డును స్మృతి-ప్రతీకా బద్దలు కొట్టారు. ఆదివారం న్యూ ఛండీగఢ్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళల వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 281 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. స్మృతి, ప్రతీక రావల్, హర్లీన్ ల అర్ధ సెంచరీలతో రాణించారు. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ప్రతీక, స్మృతి ఫ్లాట్ పిచ్‌పై 114 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో భారత స్కోరుకు పునాది వేశారు. ప్రతికా 96 బంతుల్లో 64 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. అర్ధ సెంచరీ ఆరు బౌండరీలతో స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. ఆమె 32వ ఒఐడీ అర్ధ సెంచరీ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ చేతిలో రనౌట్ అయింది. అలాగే హర్లీన్ మిడిల్ ఓవర్లలో 57 బంతుల్లో 54 పరుగులు చేసింది. అందులో తన నాలుగో వన్డే అర్ధ సెంచరీలో 4 బౌండరీలు, 2 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 18 పరుగులు మాత్రమే చేయగా, చివరి ఓవర్లలో రిచా ఘోష్ 25, రాధా యాదవ్ 19, దీప్తి శర్మ 20 నాటౌట్‌గా ఫర్వాలేదనిపించారు. ఈ క్రమంలో 50 ఓవర్లలో భారత్ జట్టు ఏడు వికెట్లు నష్టానికి 281 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డేల్లో ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన రెండవ అత్యధిక స్కోరు. ఆస్ట్రేలియా బౌలర్లలో పేసర్ మేఘన్ షట్ రెండు వికెట్లు పడగొట్టగా, అలానా కింమ్ గార్త్, అన్నాబెల్, సదర్‌లాండ్, అలనా కింగ్, తహ్లియా మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.







### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..
## ఫైనల్స్‌కు కుషారే

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, హైజంప్‌లో సర్వేష్ కుషారే ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడుగా రికార్డుకెక్కాడు. టోక్యోలోని నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీల్లో 29 ఏళ్ల జంపర్ అర్హత పోటీలో 2.25 మీటర్లు దూకి, పురుషుల హైజంప్ ఫైనల్‌కు టాప్ 12 అథ్లెట్లలో చారిత్రాత్మక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఫైనల్‌లో చోటు దక్కించుకోవడానికి తన రెండవ ప్రయత్నంలో 2.25 మీటర్లు క్లియర్ చేశాడు. గత సంవత్సరం పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన కుషారే, 2.16 మీటర్లతో విజయవంతమైన క్లియరెన్స్‌తో ఓపెనింగ్ చేశాడ. ఆ తర్వాత 2.21 మీటర్లతో, ఆపై 2.25 మీటర్లకు పైగా ప్రయాణించి తన చారిత్రాత్మక అర్హతను నిర్ధారించుకున్నాడు. ఇక ఒలింపిక్ ఛాంపియన్ జియాన్మార్కో తంబేరి 2.21 మీటర్లు జంప్ చేయడంలో విఫలమై పోటీ నుండి నిష్క్రమించాడు. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, న్యూజిలాండ్‌కు చెందిన హామీష్ కెర్ కూడా 2.25 మీటర్లు క్లియర్ చేసి సులభంగా అర్హత సాధించాడు. కాగా పురుషుల హైజంప్ ఫైనల్ ఈ నెల 16వ తేదీన జరగనుంది.

### వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
## పసిడితో మెరిసిన జాస్మిన్



**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత విజేతను ఓడించి భారత్ బాక్సర్ జాస్మిన్ స్వర్ణంతో మెరిసింది. ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో బాక్సర్ నుపుర్ రజతాన్ని దక్కించుకుంది. లివర్‌పూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో జాస్మిన్ లంబోరియా 57 కిలోల బరువు విభాగంలో తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత పోలాండ్‌కు చెందిన పారిస్ స్జెరెమెటాపై అద్భుతమైన విజయం సాధించింది. జాస్మిన్ రౌండ్ 2, 3లో దూసుకుపోయి నంబర్ వన్ సీడ్ స్జెరెమెటాను 4-1 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని గెలుచుకుంది. అంతేకాకుండా ఈ ఎడిషన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ఇది తొలి స్వర్ణం. కాగా జాస్మిన్ ఈ ఏడాది అస్తానాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె బర్మింగ్‌హామ్ 2022 కామన్వెల్త్ గేమ్స్, 2021 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను కూడా కైవసం చేసుకుంది. ఇక 80 కిలోల ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన అగాటా కాజ్మార్స్కా చేతిలో ఓడిపోయి భారత్‌కు చెందిన నుపుర్ రజతం సాధించింది. సెమీఫైనల్లో, జైస్మిన్ వెనిజులాకు చెందిన ఒమైలిన్ కరోలినా అల్కాలా సెగోవియాను 5-0 తేడాతో ఓడించింది. అలాగే 80 కిలోల విభాగంలో మరో భారత్ బాక్సర్ పూజా రాణి ఇంగ్లాండ్‌కు చెందిన ఎమిలీ అస్క్విత్‌తో జరిగిన అద్భుతమైన సెమీఫైనల్ తర్వాత పోడియం ఫినిషింగ్‌తో సరిపెట్టింది.

## డేవిస్ కప్ విజేతగా సుమిత్



**న్యూఢిల్లీ:** భారత్ స్విట్జర్లాండ్‌ను ఓడించి తొలి యూరోపియన్ విదేశీ డేవిస్ కప్ విజయాన్ని సాధించింది. ఈ విజయం భారత్ 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌కు చేరుకోవడానికి అర్హత కల్పిస్తుంది. భారత్ కాలమానం ప్రకారం ఆదివారం బీల్‌లో జరిగిన డేవిస్ కప్ 2025 ప్రపంచ గ్రూప్ టైలో భారత నెంబర్ వన్ ప్లేయర్ సుమిత్ నాగల్‌తో కూడిన పురుషుల జట్టు స్విట్జర్లాండ్‌ను 3-1 తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. దీంతో 32 సంవత్సరాల తర్వాత ఒక యూరోపియన్ దేశంపై భారత్ సాధించిన తొలి విదేశీ డేవిస్ కప్ విజయం ఇది. చివరిసారిగా 1993లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఇక నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్ రబ్బర్‌లో సుమిత్ నాగల్ 6-1, 6-3 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించి విజయాన్ని నమోదు చేశాడు. డేవిస్ కప్ స్టాండింగ్స్‌లో 37వ స్థానంలో ఉన్న భారతదేశం, తొమ్మిదో సీడ్ స్విట్జర్లాండ్ (24వ ర్యాంక్)ను ఓడించి 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌లో స్థానాన్ని సంపాదించుకుంది. రివర్స్ సింగిల్స్‌లో మొదటి మ్యాచ్‌లో 18 ఏళ్ల బెర్నెట్‌ను ఎదుర్కొన్న సుమిత్ ప్రారంభంలోనే బ్రేక్ వేసి ఆధిపత్యం చెలాయించాడు. డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన దక్షిణేశ్వర్ సురేష్ తొలి సింగిల్స్ రబ్బర్‌లో 76(4), 63తో హోమ్ ఫేవరెట్ జెరోమ్ కిమ్‌ను ఓడించాడు. 626వ ర్యాంక్‌లో ఉన్న సురేష్ అద్భుతమైనప్రదర్శన చేశాడు. వరుససెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకునే ముందు బహుళ బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. తరువాత సుమిత్ నాగల్ 6-3, 7-6(4)తో రెండుసార్లు ఒలింపియన్ మార్కోఆండ్రియా హ్యూస్లర్‌ను ఓడించాడు. మొదటి సెట్‌లో నాగల్ రెండుసార్లు హ్యూస్లర్‌ను బ్రేక్ చేసి, రెండవ సెట్ టైబ్రేక్‌లో భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని ఇచ్చాడు.

### శీతాకాల సమావేశాల్లోనే
## 'ఎఫ్‌డిఐ' బిల్లు!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** బీమారంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐలను అనుమతించే బిల్లును వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బీమారంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతోపాటు అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఈ ఎఫ్‌డిఐ బిల్లును రానున్న శీతకాలసమావేశాల్లోనే పార్లమెంటులోప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు. బీమా చట్టం 1938 లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రతిపాదించింది.
బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రస్తుత 74శాతంనుంచి 100శాతం వరకూ పెంచడంతోపాటు అధీకృత మూలధనం తగ్గించడం, కాంపోజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధిచట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు తెలిపారు. పాలసీదారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం వారి ఆర్థికభద్రతను పెంచడం బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థలప్రవేశాన్ని సులభతరంచేయడం ఆర్థికవృద్ధి, ఉపాధికల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలాసీతారామన్ అన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చినసంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని అన్నారు.
దీపావళి పండుగకు ముందేజిఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. ప్రధాని మోడీసూచనమేరకే ఈ సంసకరణలనుప్రజలకుముందు తీసుకువచ్చి దేశంలోని సామాన్య కుటుంబాలపైభారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారతతోనే భారత్ అభివృద్ధిచెందిన దేశంగా మారుతుందన్నారు.



## న్యూయార్క్‌లో ముకేష్ అంబాని లగ్జరీ విల్లా కొనుగోలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబాని అమెరికాలో విలువైన ఆస్తులు కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లో ప్రస్తుతం 145కోట్లను వెచ్చించి లగ్జరీ భవనం కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రశాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.145 కోట్లతో కొనుగోలుచేసినట్లు రియల్‌డీల్ తాజా నివేదికతో వెలుగులోకి వచ్చింది. 2023 ఆగస్టులోమన్‌హట్టన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబాని ఈ కొత్త భవంతిని కొనుగోలుచేసారు. ఈ భవనం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అమెరికా విభాగం కొనుగోలుచేసింది. టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో 20 మిలియన్ డాలర్లకుకొనుగోలుచేసి లగ్జరీభవనంగా మార్చాలనిచూసారు. తర్వాత 2021లో దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఇపుడు అదే భవనం 17.4 మిలియన్ డాలర్లకు అంబాని సొంతంచేసుకున్నారు. అంబాని ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లతో అంటే రూ.8.2 లక్షలకోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నవ్యక్తిగా నిలిచారు. రెండోస్థానంలో ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని ఉండగా ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని తేలింది.

## మరోసారి తెరపైకి బ్యాంకుల విలీనం!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** దేశంలో ఇప్పటి వరకు చాలా సార్లు బ్యాంకుల విలీనం జరిగింది. రెండు మూడు బ్యాంకులను కలిపి ఒక పెద్ద బ్యాంకుగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం అంశం తెరపైకి వచ్చింది. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో భారత్‌కు చెందిన బ్యాంకులకు చోటు కల్పించాలని లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎస్‌బీ మంథన్ 2025 పేరిట ఈ సమీక్ష చేపట్టారు. ఇందులో కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని టాప్20 బ్యాంకుల్లో రెండు దేశీయ బ్యాంకులకు చోటు కల్పించేలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని బ్యాంకులను విలీనం చేసే అవకాశాలపై చర్చించినట్లు సమాచారం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం గత రెండు రోజుల పాటు పీఎస్‌బీ మంథన్ 2025ని నిర్వహించింది. ఇందులో తొలి రోజున బ్యాంకుల విలీనం, వరల్డ్ టాప్ 20లో రెండు దేశీయ బ్యాంకుల లక్ష్యంపై చర్చించినట్లుగా ప్రభుత్వ వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. కేంద్రం జాబితాలో పెద్ద బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకుల విలీనం, ఏ బ్యాంకులు ఉండొచ్చు అనే విషయాలపై క్లారిటీ లేదు. ప్రస్తుతం ఆస్తుల విలువ పరంగా చూసుకుంటే వరల్డ్ టాప్ 100లో భారత్ నుంచి కేవలం రెండు బ్యాంకులే చోటు దక్కించుకున్నాయి. దేశీయ అతిపెద్ద బ్యాంకింగ్ సేవల సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 43వ స్థానంలో కొనసాగుతోంది. ఇక ప్రైవేట్ రంగంలోని దిగ్గజ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్‌డిఎఫ్‌సి) 73వ స్థానంలో ఉంది. పీఎస్‌బీ మంథన్ 2025లో జరిగిన ప్రధాన చర్చలంలో వరల్డ్ టాప్ 20 బ్యాంకుల్లో మన దేశానికి రెంచిన రెండు బ్యాంకులను నిలపడంపై చర్చ జరిగినట్లు సమాచారం. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేస్తారా అని అడిగిన ప్రశ్నకు అలాంటి చర్చ జరగలేదని అధికారులు తెలిపారు. అయితే, విలీనం ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమావేశానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రెటరీ ఎం నాగరాజు నేతృత్వం వహించారు. ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు, ప్రభుత్వ బ్యాంకుల టాప్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీఎస్ శెట్టి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర హాజరయ్యారు. సమావేశం తొలి రోజున చీఫ్ ఎకానమిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే, డీఎఫ్ఎస్ మాజీ సెక్రెటరీ, ఎక్స్ ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ దెబాశిస్ పాండా మాట్లాడారు.

## దీపావళికి ఇపిఎఫ్ఓ ధమాకా!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** ఎటిఎంలద్వారా పిఎఫ్ డబ్బు ఉపసంహరించుకునేకొత్త సౌకర్యం త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను సులభంగా నిర్వహించుకునేందుకు ఇపిఎఫ్ 3.0 పేరుతో కొత్త విధానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. నిజానికి సెప్టెంబరులోనే ఈ కొత్తవిధానాలు రావాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వాటిని నిలిపివేసారు. దీపావళికి ముందు ఏటిఎంలద్వారా పిఎఫ్ సొమ్ము ఉపసంహరించుకునే వెసులుబాటు కస్టమర్లకు కల్పిస్తుందని తెలుస్తోంది. బ్యాంకుల తరహాలోనే సరళమైన లావాదేవీని సృష్టించేప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకోనున్నట్లు వెల్లడించింది. అక్టోబరు 10,11 తేదీల్లో ఇపిఎఫ్ఓ ట్రస్టుకమిటీ సమావేశం కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరుగుతుంది. దీపావళికి ముందు సుమారు 8 కోట్లమంది పిఎఫ్ చందాదారులోటిఫికేషన్‌కు సంబంధించి ఈసమావేశంలోముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. యుపిఐద్వారా పిఎఫ్ డబ్బును ప్రవేశపెట్టడం వంటి బ్యాంకింగ్‌షేవలపైనే చర్చించనున్నారు. నెలకు అదనంగా కనీసం పెన్షన్‌ను రూ.1000నుంచి 1500 నుంచి 2500కు పెంచే ప్రణాళిక గురించి కూడా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య వివాహం ఇల్లు కొనుగోలు వంటి కొన్ని నిర్దిష్టకారణాలతో పిఎఫ్ ఖాతాదారులు ఇంటర్నెట్‌ద్వారా రూ.5 లక్షలవరకూ వారి సొమ్ము విత్‌డ్రాచేసుకోవచ్చు. కానీ డబ్బులుచేతుల్లోకి రావడానికి కనీసం రెండుమూడురోజులు పడుతోంది.కొత్తగా పిఎఫ్‌లో ఏటిఎం సేవలు అందుబాటులోకి వస్తే సొమ్ములు తీసుకోవడం మరింత సులువవుతుంది. అయితే బ్యాంకులద్వారా పిఎఫ్ సొమ్ము సులభంగా పొందేలాచేయడంచేస్తే పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేసాయి. పిఎఫ్ అనేది ఉద్యోగులు తమ పదవీ విరమణ సమయంలో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే పథకం అని వాటిని ఎటిఎంలద్వారా తీసుకోడానికి అనుమతించేలా పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని అంటున్నారు.



## బోయింగ్‌పై రూ.27.36 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరోసారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన ఉల్లంఘనలను గుర్తించడంతోసుమారు 3.1 మిలియన్ డాలర్లు అంటే రూ.27.36 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబరు 2023నుంచి ఫిబ్రవరి 2024లోపు చోటుచేసుకున్నవేనని ఎఫ్ఎఎ తెలిపింది. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడంవంటి వాటాతో చాలా సంఘటనలున్నాయి. వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలోనిర్వహించినదర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలునానయి. కెన్సాస్‌లోని బోయింగ్‌సబ్‌కాంట్రాక్టుసంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదేపరిస్థితి నెలకన్నది. 2విమానాలు ఎగిరేందుకు యోగ్యత లేనివిగా గుర్తించింది. నాణ్యతలేనివిమానానికి ధృవీకరణ వచ్చేట్లు సంతకంచేయాలని ఒత్తిడిచేసినట్లు గుర్తించారు. పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాదిజూన్‌లో అమెరికా నేషనల్‌ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు 17 నెలలపాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదలచేసింది. బోయింగ్ తయారీ భద్రతా పర్యవేక్షణలో చాలా లోపాలున్నా ఎఫ్ఎఎ తనిఖీలు ఆడిట్స్ ఏమాత్రం ప్రభావంచూపలేదని పేర్కొంది. అందువల్లనే అలాస్కా సంఘటన చోటుచేసుకున్నట్లు గుర్తించింది.



## బ్యాంకుల్లో 444 రోజుల డిపాజిట్లపైనే ఎక్కువ ఆసక్తి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** బ్యాంకులు కొత్తగాప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ అన్నివర్గాలను ఆకర్షిస్తోంది. వడ్డీరూపంలోనే కాకుండా పెట్టుబడిదారులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోంది. అయితే ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటికంటే ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు 6.75% వడ్డీతో ఎక్కువ రాబడి ఇస్తోంది. 10.25 లక్షలుపెట్టుబడి పెడితే ఈ బ్యాంకులు మెచూరిటీ 11,11,952.08 వరకూ లభిస్తుంది. రెండోస్థానంలోఉన్న పంజాబ్‌సింధ్ బ్యాంకు 6.70శాతం, ఎస్‌బిఐ తన అమృత్ సృష్టితో 6.60శాతంతో మూడోస్థానంలోను, కెనరాబ్యాంకు 6.50శాతంతో చివరిస్థానంలోను ఎక్కువ రిటర్నులిచ్చే బ్యాంకుల్లో నిలిచాయి. ఎస్‌బిఐలో అయితే 6.60సాధారణ వడ్డీరేటు. ఈ క్రమంలో రూ.10.25 లక్షలకు 444 రోజుల తర్వాత సుమారు రూ.11,09,958.24 వస్తుంది. వడ్డీరూపంలో రూ.94,958.24 పొందుతారు. పంజాబ్ సింధ్‌బ్యాంకులో అయితే ఇదే మొత్తానికి మెచూరిటీ విలువ సుమారు 11,11,287.15 అవుతుంది. వడ్డీరూపంలో 86,287.15 వస్తుంది. ఇక ఐఒబిలో అయితే 444 రోజుల ఎఫ్డీలో 6.75శాతం వడ్డీతో 10.25 లక్షల సొమ్ముకు 11,11,952.08 వస్తుంది. వడ్డీ 86,952.08గా ఉంది. ఇక కెనరాబ్యాంకు అయితే ఈస్కీంపై 6.50 వడ్డీ ఇస్తోంది. ఈ జాబితాలో తక్కువ వడ్డీరేటు. 10.25 లక్షలసొమ్ముకు సుమారు 11,08,630.59 వస్తుంది. వడ్డీ కేవలం రూ.83,630.59 మాత్రమే వస్తుంది. రిటర్నులు కొంచెం తక్కువగా ఉంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.



# వైభవంగా స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామివారికి 108 స్వర్ణ సంపంగిలతో వైభవంగా జరిగింది. సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.

# భద్రయ్యపేట గ్రామంలో ఆర్ఓ ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా



పద్మనాభం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త

భద్రయ్య పేట గ్రామస్తుల్లో కిడ్నీ సమస్య పరిష్కారంలో భాగంగా స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ నిర్మించిన ఆర్వో ప్లాంట్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న నానుడికి అనుగుణంగా కేవలం పత్రికలో వార్త చూసి రోటరీ క్లబ్ ప్రతినిధులు స్పందించడం ముదావహమని పేర్కొన్నారు. గ్రామంలో కిడ్నీ సమస్య తీవ్రత తగ్గించడానికి మినరల్ వాటర్ కు ధీటుగా స్వచ్ఛమైన నీటి సౌకర్యం కల్పించిన రోటరీ క్లబ్ సేవలను కొనియాడారు. మండలంలో స్వచ్ఛంద సంస్థల సాయం కోసం ఎదురుచూస్తున్న అనేక గ్రామాల కు కూడా సేవలను అందజేయాలని కోరారు. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆర్వో ప్లాంట్‌ను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. 2014-19లో భీమిలి నియోజకవర్గాన్ని రూ.4,700 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. ఏటా గ్రామాల్లో అభివృద్ధి పనులకు దివీస్ సంస్థ సి.ఎస్.ఆర్ కింద రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లు ఖర్చు చేస్తుందని వెల్లడించారు. రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు కంచర్ల రాంప్రసాద్ మాట్లాడుతూ 190 దేశాల్లో రోటరీ క్లబ్ స్వచ్ఛంద సేవలందిస్తోందన్నారు. గంటకు 500 లీటర్ల కెపాసిటీ గల ఆర్వో ప్లాంట్‌ను గ్రామానికి అందించామని తెలిపారు. క్లబ్ ప్రతినిది శోభన్ ప్రకాష్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన తాగు నీరు రోటరీ క్లబ్ లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా నిత్యావసరాలను గంటా అందజేశారు. కార్యక్రమంలో 10వ పేజీలో

# బీజేపీ ఉన్నది.. అభివృద్ధి పథంలో నడిపేందుకే



**దేశంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుతో అభివృద్ధి పథంలోకి -అభివృద్ధి అంటే నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు వచ్చిన తర్వాత -రాష్ట ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి జరుగుతుంది -కేంద్ర రాష్ట్ర పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి -కార్యకర్తలకు పిలుపు : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**





10లో

**విశాఖలో జోరుగా శిబిరాలు -పోలీసులు దాడులు చేస్తున్న మారని జూదగాళ్ళు -పేకాటరాయుళ్లకు కలిసొచ్చిన నగదు రహిత లావాదేవీలు -పోలీసులకు చిక్కకుండా ఫోన్ల నుంచి మనీ ట్రాన్స్ఫర్ -టాస్క్ ఫోర్స్ పోలీసుల స్పెషల్ ఫోకస్ -ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి -ఆరుగురు పేకాట రాయుడు అరెస్ట్ -రూ.1,52,000లు స్వాధీనం**

# పేకాటతో జీవితాలు ఛిద్రం



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

పేకాట వ్యసనం సరదాగా మొదలై ఆ తర్వాత బానిసలుగా మార్చి జేబులను గుల్లచేస్తున్నది.తర్వాత కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుంది. ఈ జూదానికి యువత కూడా బానిసలవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. పట్టుబడితే సాధారణ కేసుల కారణంగా పేకాటకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. దీంతో రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతున్నది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం కూడా పేకాట రాయుళ్లకు వరంగా మారింది .. శత కోటి దరిద్రాలకు, అనంత కోటి ఉపాయాలన్నట్టు నగదు రహిత లావాదేవీలు పేకాట రాయుళ్లకు అవకాశంగా మారింది.. చేతిలో రూపాయి లేకున్నా 10వ పేజీలో

# 22 నుంచి విజయదుర్గాదేవి శరన్నవరాత్రులు మహోత్సవాలు



ఆరిలోవ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

స్థానిక 9వ వార్డ్ హనుమంతువాక, విజయ దుర్గ కాలనీ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ విజయ దుర్గా దేవి శరన్నవ రాత్రి మహోత్సవాలు ఈనెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ దసరా రోజు వరకు అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ఆలయ అధ్యక్షులు ఎస్ఎస్ఎన్ రాజు తెలిపారు. ఆలయంలో 22 నుండి ప్రతిరోజు అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకములు ప్రత్యేక పూజలు, 30న దుర్గాష్టమి, 1న మహార్నావమి, అదేవిధంగా ఆలయ ప్రధాన అర్చకులు సంపత్ కుమార్ శర్మ పర్యవేక్షణలో వేద పండితులచే సామూహిక లక్ష కుంకుమార్చనలు జరగనున్నట్లు తెలిపారు. అదే రోజున ఆలయ ప్రాంగణం నందు మహా అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు జీవీఎంసీలో
# ప్రజా సమస్యల పరిష్కార వేదిక



విశాఖపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాల లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం" 2025 సెప్టెంబర్ 15వ తేదీ సోమవారం ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు, హారికల్చర్, రెవిన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై సెప్టెంబర్ 15వ తేదీ సోమవారం ఉదయం 11గంటల 10వ పేజీలో

# విశాఖ ఋషికొండ బీచ్‌లో విషాదం

**ఇద్దరు టెన్త్ విద్యార్థులు గల్లంతు -గాలింపు చర్యలు చేపట్టినా కానరాని విద్యార్థుల జాడ**





(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖ రిషికొండ బీచ్‌లో విషాదం చోటు చేసుకుంది. సరదాగా బీచ్ వద్ద సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు విద్యార్థులలో ఇద్దరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళితే అశోక్ నగర్, పీఎం పాలెంకు చెందిన మండల సంజయ్(17), తులసీ నగర్, పీఎంపాలెం కు చెందిన మామిడి శెట్టి శ్యామన్ సాయి(14), తులసి నగర్, పీఎంపాలెంకు చెందిన ఎన్ని బాల ఆదిత్య (14), ఎం.విద్యాసాగర్ (14) అనే నలుగురు టెన్త్ విద్యార్థులు కలిసి ఆదివారం రిషికొండ బీచ్‌కు వెళ్లారు. వీరందరూ స్నానానికి బీచ్ లోకి దిగగా వీరిలో ఇద్దరు మండల సంజయ్, మామిడి శెట్టి శ్యామ్ సాయిలు అలల్లో చిక్కుకొని గల్లంతయ్యారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డులు వెంటనే వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ విద్యార్థుల ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న గల్లంతయిన విద్యార్థుల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పీఎం పాలెం సీఐ బాలకృష్ణ నేతృత్వంలోని కేసు నమోదు చేశారు. సోమవారం కూడా గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా సిఐ బాలకృష్ణ తెలిపారు.

# ఉపమాక వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతము పై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మంగళవారం రెండు రోజులపాటు కృష్ణాష్టమి వేడుకలు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం ఆలయంలో నిత్య పూజా కార్యక్రమములు, బాలభోగ నివేదనలు, నిత్య హెూమములు, తీర్థగోష్ఠి వరకూ యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు యశోదా దేవి అలంకరణ నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా యశోద దేవి అలంకరణలో ఉన్న అమ్మవారు కృష్ణ పరమాత్మకు ఉగ్గుపాలు పడుతూ ఉండే విశేష అలంకరణ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.



సాయంత్రం ఆలయంలో విశేష అలంకరణలో ఉన్నటువంటి యశోదా దేవి అమ్మవారికి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులకు నారద మహాముని ప్రతిష్ఠితమైన ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి వారికి విశేష పూజా కార్యక్రమములు, ధూప దీప నైవేద్యములు, సప్త హారతులతో నీరాజనాలు సమర్పించిన తర్వాత తీర్థ గోష్టి భక్తులందరికీ విశేష ప్రసాద నివేదనలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం గరుడాద్రి పర్వతముపై ఉన్నటువంటి శ్రీ స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకము విశేష ప్రసాద వేదనలలు, తీర్థ గోష్టి నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం కొండ దిగువున గల ఆలయంలో నిత్య పూజా కార్యక్రమములు నిర్వహించి, రాజభోగ ప్రసాద నివేదనలు, తీర్థ గోష్టి నిర్వహించిన తర్వాత సాయంకాల ఆరాధనలు, నిత్య సేవా కాలము విశేష ప్రసాద నివేదనలు తీర్థ గోష్టి ప్రసాద వినియోగము నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కృష్ణాష్టమి 10వ పేజీలో

# విశాఖలో అబ్బురపరిచిన డాగ్ షో



10లో

## భద్రయ్యపేట గ్రామంలో ఆర్ఓ ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా

9వ పేజీ తరువాయి ..

కార్యదర్శి షాహీదా మెహది, రోటరీ క్లబ్ ప్రతినిధులు కంకటాల మల్లిక్, అన్నపూర్ణ, కూటమి నాయకులు కురుమిన రామస్వామి నాయుడు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, చిక్కాల విజయ్ బాబు, కాళ్ల నగేష్ కుమార్, శాఖారి శ్రీనివాస్, కురుమిన లీలావతి, గాడు వెంకటప్పడు, తాట్రాజు అప్పారావు, కాళ్ల సత్యనారాయణ, పాండ్రంగి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి భాజపాలో తగిన గుర్తింపు : రాష్ట్ర అధ్యక్షులు మాధవ్


గాజువాక,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త



కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బిజేపి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డాకి విశాఖ విమానాశ్రయం లో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఘణంగా వీడ్కోలు పలికారు. గాజువాక నుండి వెల్లిన బిజేపి నాయకులు కరణంరెడ్డి నరసింగరావుని, కేంద్ర మంత్రికి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పరిచయం చేసారని కేఎన్ఆర్ తెలిపారు. ఈ సందర్భంగా మాధవ్‌కి ధన్యవాదాలు తెలిపారు. కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చే పార్టీ బిజేపి అని అన్నారు. అందుకు నిదర్శనం విమానాశ్రయంలో పలువురు కార్యకర్తలను కేంద్ర మంత్రి జాతీయ అధ్యక్షులు జేపి నడ్డాకి పరిచయం చేయడంలో ప్రత్యేక శ్రద్ధని రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, నాగేశ్వరరావు, ములకలపల్లి ప్రకాష్, వెంకటరావు, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## గాజువాక టీడీపీ సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనుకు ఘన సత్కారం

గాజువాక,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్తగా అందరి మన్ననలు పొంది తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రసాదుల శ్రీనివాస్‌ను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఇండ్రస్టియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా నియమింప బడిన సందర్బంగా అయనను తెలుగుదేశం పార్టీ శిష్టకరణ సాధికార కమిటీ ప్రతినిధులు కలసి అభినందించారు. శాలువ కప్పిసత్కరించారు. భవిష్యత్‌లో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బలివాడ సత్యారావు, బాసంగి తిరుపతిరావు ప్రతాపరావు శ్రీనివాసరావు, కరకవలస గౌరీప్రసాద్, మణిపాతృని సత్యనారాయణ, గర్భాం విజయలక్ష్మి, నాగుమంత్రి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## 65వ వార్డులో టీడీపీ నేతలకు సత్కారం



గాజువాక,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త

ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 65వ వార్డులో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసిన వార్డు తెదేపా కార్యకర్తలను పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు,వార్డు అధ్యక్ష, కార్యదర్శులు రట్టి వాసు, వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలను సాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన మేరకు తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు,వారి ఇబ్బందులు, ప్రభుత్వ సేవల సద్వినియోగం తదితర అంశాలపై ప్రజలతో మమేకమైన తీరు చాలా గొప్పది అని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్,డైరెక్టర్ అంగ కృష్ణ, పార్టీ నాయకులు, మహిళా నేతలు,అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేవిడి గ్రామంలో భక్తి శ్రద్ధలతో అవతార్ మెహెర్ బాబా వార్షికోత్సవం

పద్మనాభం,సెప్టెంబరు14, ప్రభాతవార్త



మండలంలో రేవిడి గ్రామంలో ఉన్న అవతార్ మెహెర్ బాబా కేంద్ర 17వ వార్షికోత్సవంను కేంద్ర ప్రతినిధి బాపిరాజు ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులు బాబా చిత్రపటంను కలశాలతో ముందుగా ఊరేగించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు విజినిగిరి శంకరరావు పతాక ఆవిష్కరణ చేసారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు భక్తులు ఆధ్యాత్మిక ప్రవచనాలను, భక్తి గీతాలను ఆలపించారు. మధ్యాహ్నం బాబాకి హారతి కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థి అభివృద్ధిలో ఉపాధ్యాయులది ముఖ్య పాత్ర..

### నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్

విశాఖపట్నం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



విద్యార్థి అభివృద్ధిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్యమైన పాత్రని నాగార్జున విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య వి బాల మోహన్ దాస్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు 2024 -25 ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కృష్ణ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎస్ రామకృష్ణారావు, సిక్కిం మాజీ డిజిపి అక్షరి సుధాకర్, బి వి ఎఫ్ ఫౌండర్ నరవ ప్రకాష్ రావులతో కలిసి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ మంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ద్వారానే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థుల మేధస్సుకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన ఉండాలని పేర్కొన్నారు. ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుండే క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరు తప్పకుండా ఆరోగ్యం తో పాటు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సిక్కిం మాజీ డిజిపి అక్షరి సుధాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంత గొప్పదన్నారు. ప్రతి ఒక్కరు నడవడిక అనేది నేర్చుకోవాలని ఒకరి ఒకరిని గౌరవించుకుంటూ ముందుకు సాగడం ద్వారా వారిపై మంచి అభిప్రాయం ఏర్పడుతుందన్నారు. జీవితంలో రాణించాలంటే సరైన మార్గదర్శకం అవసరం అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన బాల వికాస్ ఫౌండేషన్ ఫౌండర్ నరవ ప్రకాష్ రావు మాట్లాడుతూ జాతీయ రాష్ట్రస్థాయిలో విశాఖపట్నం చెందిన ఉపాధ్యాయులు అవార్డులు పొందడం ఆనందానికి గర్వకారణం అన్నారు. అనంతరం జాతీయ అవార్డు పొందిన ఉపాధ్యాయిని తిరుమల శ్రీదేవి, రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన జి కుమారస్వామి, జివిం సుజాత, ఎం మోహన్ రావు లను ఘనంగా సత్కరించి సన్మానించారు.కార్యక్రమానికి వ్యాఖ్యాతగా రచయిత ఆర్.శివకుమార్ వ్యవహరించగాబ్రహ్మకుమారిస్ ప్రతినిధి బి.కె.కామేశ్వరి, బివిఎఫ్ కన్వీనర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, అధ్యాపకులు, ఎన్జీవోలు, మేధావులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

విశాఖపట్నం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందు బాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుం దని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్లను వాట్సప్ లో అంద జేస్తున్నామని, ఎండార్స్మెంట్లను రిజిస్టర్ పోస్ట్ ద్వారా సంబంధిత చిరునామాకు పంపిస్తున్నామని చెప్పారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్గా పూరించాలన్నారు. రివిజిట్ అర్జీదారులు పాత రసీదును తీసుకు రావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

### కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి

అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరుకు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ ను సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



## జేపీ నడ్డాకు ఘన స్వాగతం పలికిన మూల వెంకట్రావు

విశాఖపట్నం,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సారథ్యం ముగింపు సభకు విశాఖ నగరానికి విచ్చేసిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బిజెపి బీసీ నేత మూల వెంకట్రావు ఘన స్వాగతం పలికారు. విశాఖ విమానా శ్రయంలో నడ్డాను కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మూల వెంకట్రావు మాట్లాడుతూ నడ్డా సారథ్యంలో భారతీయ జనతా పార్టీ దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందిందని వెల్లడించారు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ కాషాయి జెండాను రెపరెపలాడించడంలో నడ్డా కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

## బీజేపీ బహిరంగ సభకు పద్మనాభం నుండి తరలివెళ్లిన నాయకులు

పద్మనాభం, సెప్టెంబరు14, ప్రభాతవార్త



విశాఖపట్నంలో ఆదివారం రాష్ట్ర బి.జె.పి అధ్యక్షుడు పి.వి.ఎన్ మాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిజెపి బహిరంగ సభకి పద్మనాభం నుండి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు. పాండ్రంగి, అనంత వరం, కొవ్వాడ, రెడ్డపల్లి తదితర గ్రామాల నుండి అధిక మంది నాయకులు, కార్యకర్తలు బస్సులపై తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మహేష్, సోమేశ్వరరావు, వెంకటరరావు, శ్రీనివాసరావు, పేర్రాజు, పాల్గొన్నారు.

## మాధవ్ ప్రజలకు నిజాలు మాత్రమే చెప్పండి : సిపిఐ డిమాండ్



విశాఖపట్నం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ విశాఖ ఉక్కు కర్మాగారంపై ప్రజలకు నిజాలు మాత్రమే చెప్పాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్ కె.రహిమాన్‌లు కోరారు. ఆదివారం వారిరువురు పత్రికా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాకారానికి ఎన్డిఎ ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజి ఇచ్చి ఆదుకుంటే వామపక్ష పార్టీలు విశాఖ ఉక్కును కేంద్రం ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తున్నదని అబద్దపు ప్రచారం చేస్తున్నాయని మాధవ్ చెప్పడాన్ని వారు తప్పుపట్టారు. ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటి ప్రైవేట్ పరం చేసి కార్మికులను తొలగించడం అబద్ధమా అని వారు ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తాం అని ఈరోజు విశాఖ వచ్చిన మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాతో ప్రకటన చేయించండని తెలిపారు. విశాఖ ఉక్కును విస్మరించి ప్రైవేట్ రంగంలో నెలకొలపుతున్న ఆర్ఎస్ఎల్ఆర్ మిట్టల్ కంపెనీకి కేంద్రం ప్రభుత్వం ఎరకమైన అనుమతులు ఇవ్వలేదని చెప్పించండి అన్నారు. నవరత్న హోదా కలిగిన విశాఖ ఉక్కుకు స్వంత ఘనులు కేటాయించి అన్ని రకాలుగా కేంద్రం ప్రభుత్వం ఆదుకుంటుంది అని చెప్పించాలని ఈ ప్రాంతానికే చెందిన వ్యక్తిగా మాధవ్ బాధ్యత తీసుకోవాలని సిపిఐ తరుపున విజ్ఞప్తి చేశారు.

## కళాకారులతో సాంస్కృతిక వైభవం

విశాఖపట్నం సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు మహమ్మద్ షకీల్ ఆధ్వర్యంలో "టాలెంట్ హంట్" పేరున నృత్య పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. నృత్య కళాకారులు నాట్య గురువులు చెప్పే ప్రతి అంశాలపై చక్కని అవగాహన పెంపొందించుకుని చక్కని నృత్య కళాకారులుగా ఎదిగి రాణించాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న జి.రాజేశ్వరి, ఎం.రాజేశ్వరి, భవ్యరాశి, కళ్యాణ్ నాట్య గురువులను ముఖ్య అతిథి ఎంవి రాజశేఖర్ చేతులమీదుగా ఘనంగా సత్కరిచగా సత్కార గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. సందడిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నృత్య గురువులు, కళాకారులు వారి తల్లితండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు విజేతలకు జ్ఞాపికలు గాయకులు మహమ్మద్ తాజ్, మహమ్మద్ షకీల్ అందజేశారు.

## వైసీపీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా బెవర జగదీశ్వరరావు

ఆరిలోవ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డుకు చెందిన బెవర జగదీశ్వర రావు వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శిగా నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో పార్టీ అధిష్టానం ఇంతటి బాధ్యతగల పదవిని నియమించడం ద్వారా రాష్ట్రస్థాయి నుంచి వార్డు స్థాయి వరకు మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ పెద్దలు, సీనియర్ నాయకులు ఆదేశాలను అనుసరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. 15 సంవత్సరాలుగా వైసీపీ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశానని, ఇంతటి పదవి రావడానికి సహకరించిన రీజనల్ కోఆర్డినేటర్ కొరసాల కన్నబాబు, సిటీ ప్రెసిడెంట్ కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, స్టేట్ సోషల్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్ అంజి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఆరిలోవ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



స్థానిక 11వ వార్డ్ ఆరిలోవ ముస్తఫా కాలనీ లో ఆదివారం ముస్తఫా ముస్లిం వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మ దినం సందర్భంగా 250 మంది స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ప్రతా పరుద్ర హాజరై ఆయన చేతుల మీదగా విద్యార్థు లకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి నజీర్, అహ్మద్, తెదేపా నాయకులు రాగతి అచ్యుతరావు, ముగడ రాజారావు, అసోసియేషన్ సభ్యులు ఎస్కే కాలేషా, మొహుద్దీన్, అక్బర్ ఆలీ, ఎస్ కే ఫిరోజ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలి

### బీసీ బాలికల కళాశాల సంక్షేమ వసతి గృహ సందర్శనలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణయ్య

విశాఖపట్నం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వ కళాశాల వసతి గృహ విద్యార్థినులను ఉద్దేశించి అన్నారు. చదువుపై దృష్టి సారించాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం జిల్లా పర్యటనలో భాగంగా బీసీ నాయకులు, అధికారుల తో కలసి స్థానిక పాత పోస్టాఫీసు ఏరియాలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. ముందుగా అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనం తరం విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ అంశాలపై వారితో కుశలంగా మాట్లాడారు. వసతి గృహాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, చదువు ఇతర పరిస్థితులపై ఆరా తీశారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, చదువుకు ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎప్పటి సిలబస్ అప్పుడే చదివేసుకోవాలని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిం చుకునేం దుకు చిట్కాలు పాటించాలని చెప్పారు. వర్తమాన అంశాలపై అప్డేట్ అవ్వాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో స్కాలర్ స్కాలర్షిప్స్, మెస్ ఛార్జీల కోసం విద్యార్థినులు చెప్పిన అంశాలను ఆయన శ్రద్ధగా విన్నారు. వసతి గృహంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఏ సమస్య వచ్చినా అధికారులు లేదా స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా తమ దృష్టికి తీసుకురావొచ్చని కృష్ణయ్య చెప్పారు. సాంఘిక సంక్షేమ శాఖ డిడి, బీసీ వెల్ఫేర్ ఇన్చార్జి అధికారి కె.రామారావు, బీసీ నాయకులు పితాని ప్రసాద్, డా.జగదీష్, పరిపూర్ణచారి, వసతి గృహ అధికారులు జ్యోతి, శివ పాల్గొన్నారు.

## పేకాటతో జీవితాలు ఛిద్రం

9వ పేజీ తరువాయి ..

యథేచ్ఛగా ఈ ఆట జోరుగా సాగుతుంది..పోలీసులకు చిక్కకుండా ఫోన్ల నుంచే పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్ జరుగుతుంది..ఈ మార్పు కారణంగా విశాఖ నగరంలో పేకాట శిబిరాలు జోరందుకున్నాయి.ఈ నేపథ్యంలో పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దృష్టి సారించి జూద కేంద్రాలపై దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ పేకాట కేంద్రాలు వెలుస్తూనే ఉన్నాయి. ఈ మేరకు సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో పేకాట స్థావరాలను సమూలంగా నిర్మూలించడానికి టాస్క్ ఫోర్స్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

### అడ్డదారులు తొక్కుతున్న యువత

దేశ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యువకులు అడ్డదారులు తొక్కుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ వంటివి ఆడుతూ లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసలుగా మారుతూ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ తరహా యువకుల సంఖ్య గత కొన్నాళ్లుగా పెరుగుతోంది. చెడు స్నేహాలు, అలవాట్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారిలో విద్యార్థుల నుండి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ ఉండడం గమనార్హం. కూర్చున్న చోటనే సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో పేకాట ఊబిలో పడి కొంత మంది జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆశకుపోయి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. తద్వారా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి.

### టాస్క్ ఫోర్స్ పోలీసుల స్పెషల్ ఫోకస్

జీవితాలను చిత్రం చేస్తూ బతుకులను అంధకారంలో పడేసే పేకాటను రూపుమాపడం కోసం విశాఖ నగర టాస్క్ ఫోర్స్ పోలీసులు కృషి చేస్తున్నారు.. స్పెషల్ ఫోకస్ పెట్టి పేకాట కేంద్రాలపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిఐలు భాస్కరరావు, అప్పలనాయుడుల నేతృత్వంలో ఎస్సై భరత్ కుమార్ రాజు తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలను గుర్తించి జూదరులను పట్టుకుంటున్నారు.. తాజాగా ఆదివారం ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దార్థ నగర్‌లో ఓ పేకాట స్థావరంపై సిటీ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు.. ఈ మేరకు అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అదుపులను తీసుకున్నారు. వారి నుండి రూ.1,52,000లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం వారిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు.

## సోమవారం జివిఎంసిలో ..

9వ పేజీ తరువాయి ..

నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

## విశాఖలో అబ్బుర పరిచిన డాగ్ షో

మాధవధార, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

విశాఖ గాదిరాజు పాలస్‌లో ఆదివారం నాడు కెన్నెల్ క్లబ్ ఆధ్వర్యంలో డాగ్ షో నిర్వహించారు.రోటరీ క్లబ్,ఎస్ కె డెవలపర్స్ సహకారంతో నిర్వహించిన ఈ డాగ్ షో కు శరత్ శర్మ,గౌరీ నాల్గోల్కర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.ఈ డాగ్ షోకు దేశ నలుమూలల నుంచి విశేష స్పందన లభించింది. తెలంగాణ, ఒడిస్సా, కలకత్తా, భువనేశ్వర్, చతిష్గడ్ జంషెడ్పూర్, ఊటి, కొడైకెనాల్ ముంబై నుంచి 43 జాతులకు చెందిన 256 డాగ్స్ పాల్గొన్నట్లు క్లబ్ సెక్రటరీ కృష్ణ తెలిపారు. ఈ షోలో వివిధ జాతుల కుక్కలు తమ ప్రత్యేకతలను ప్రదర్శించాయి. సందర్శకులు అబ్బురపడేలా వివిధ రకాల ప్రదర్శనలను శునకాలను ప్రదర్శించాయి.కుక్కల యజమానులు, జంతు ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కెన్నెల్ క్లబ్ అసోసియేషన్ కోశాధికారి నారాయణ రెడ్డి,సభ్యులు సురేష్, రాజేష్, సీరట్ల శ్రీనివాస్, పవిత్ర, విశాఖ సింగ్, గణేష్, ప్రసాద్, రోటరీ తరుపున రాథోడ్, విశ్వనాథ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## సివిల్ ఇంజనీరింగ్ కార్యకలాపాలను సమీక్షించిన డిఆర్ఎం



విశాఖపట్నం, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

పునరుద్ధరించిన ఇంజనీరింగ్ కాన్ఫరెన్స్ హాల్‌లో వాల్టెయిర్ డివిజన్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంతో డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు, కొనసాగుతున్న నిర్వహణ పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనులు, విపత్తు నిర్వహణ సంసిద్ధత బండరాళ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలలో భద్రతా చర్యలపై చర్చలు జరిగాయి. భూస్థాయి చర్యలను అంచనా వేయడానికి డిఆర్ఎం సీనియర్ సూపర్‌వైజర్లతో సంభాషించారు భద్రతా ప్రోటోకాల్‌లను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది చెప్పారు. ఏడిఆర్ఎం (మౌలిక సదుపాయాలు) ఈ.శాంతారామ్, ఏడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ఏ కె మోహరానా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్లు, అధికారులు, సివిల్ ఇంజనీరింగ్ విభాగం సీనియర్ సూపర్ వైజర్లు కూడా పాల్గొన్నారు. సమావేశానికి ముందు, డిఆర్ఎం లలిత్ బోహ్రా సివిల్ ఇంజనీరింగ్ విభాగం పునరుద్ధరించిన కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించారు. అప్‌గ్రేడ్ చేసిన సౌకర్యాలను ప్రశంసించారు. అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైల్వేలకు భద్రత అత్యంత ప్రాధాన్యత అని పునరుద్ఘాటించారు. రైలు కార్యకలాపాలు సజావుగా సాగాలంటే జట్టుకృషి, నిరంతర అప్రమత్తత, సకాలంలో విధులను నిర్వర్తించడం అవసరమని ఆయన అన్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే సీజన్‌లో డివిజన్ మొత్తం పనితీరును మెరుగుపరచడానికి అంతర్-విభాగ సమన్వయం ప్రాముఖ్యతను ఆయన చెప్పారు.

## ఉపమాక వెంకన్న ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

9వ పేజీ తరువాయి ..

ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులను బుల్లి కృష్ణుడిని స్వామివారి పీఠముపై అధిష్టింప జేసి ముందుగా విష్వక్సేన పూజ పుణ్యాహవాచనము వెన్నతో కూడిన ఉట్టికి ప్రత్యేక ఆరాధనలు అనంతరం ఆలయంలో ఏకాంతంగా ఉట్టి కొట్టు సంబరాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఆలయం లో సాయంకాల పూజలు యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

## బీజేపీ ఉన్నది..

విశాఖపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

బిజెపి పార్టీ అనేది దేశాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. ఆదివారం రైల్వే గ్రౌండ్స్‌లో నిర్వహించిన సారథ్యం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తోపాటు శ్రీ మహావిష్ణువు సింహాచల కొండపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సారథ్యం సభలో విజయవంతంగా నిర్వహించారని 26వ జిల్లాగా విశాఖ పట్నంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారని ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు తాను ఒకసారి తిరుపతి వెళ్లానని అక్కడ తాను వైసిపి పూర్తిగా అవినీతిలో ఊరికిపోయిందని వాటిని నిర్మూలించవలసిన అవసరం ఉందని ప్రజలకు చెప్పానని తెలిపారు. అయితే ఎన్నికలు జరిగింతర్వాత డబల్ ఇంజన్ సర్కార్కు ప్రజలు పట్టం కట్టారని ఆయన అన్నారు. 11 సంవత్సరాల తర్వాత వచ్చిన మార్పులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాకముందు ఏ విధంగా దేశం ముందుకు సాగిందో ఆలోచించేయాలని ప్రతి ఒక్కరిగా అయినా సూచించారు. నరేంద్ర మోడీ పేదవాడి అభివృద్ధి కోసం ఎటువంటి కార్యచరణ చేపడుతున్నారో సబ్కా సత్ సబ్కా వికాస్ సైతాంతిక సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు అన్నారు. కాశ్మీర్ రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పినట్లు చేశామని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేశామని చెప్పారు. రామజన్మభూమి లో రాముని ఆలయం నిర్మించామని ముస్లిం సమాజానికి ముస్లిం మహిళలకు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పార్లమెంట్లో సవరణ తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు. బిజెపి అనేది కార్యకర్తల పార్టీ అని ప్రపంచంలో అత్యధిక రాజకీయ పార్టీగా బిజెపి ఉందని ఆయన చెప్పారు. 2024లో నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన నాటికి ఆర్థిక పరిస్థితి నత్త నడక నడిచేదని ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ఇప్పుడు మొదటి స్థానంలో ఉందని ఇది గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రాబోయే తరానికి జీఎస్టీ 2.0 నీ తీసుకొని సంస్కరణలో తీసుకువచ్చామని దేశంలో సెప్టెంబర్‌లో దసరా దీపావళి ఒకే నెలలో వచ్చినట్టు ఉంటుందని అన్నారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ పూర్తిగా తీసివేస్తున్నామని దేశం ఆరోగ్య దేశంగా ఉండాలని మోడీ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. రక్షణ రంగంలో ఏడు రెట్లు ప్రగతి సాధించామని మందులు తయారీ అభివృద్ధిలో కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. మోడీ నాయకత్వంలో దేశం తో పాటు చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు వెళ్లేందుక రహదారులు ఏర్పాటు చేశామని చెప్పారు. స్మార్ట్ సిటీగా, సాగరం అల్లగా అభివృద్ధి చెందుతుందని విద్యాసంస్థల అభివృద్ధికి అనేక రకాల ప్రతిష్టాత్మక విద్యాలయాలు తయారవుతున్నాయన్నారు. ఈ విద్యాలయాలు ఆంధ్రప్రదేశ్ లో కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమృత్ భారత్‌గా వందే భారత్ పేరుతో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తున్నామని, భోగాపురం నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు.17 మెడికల్ కళాశాలలు కట్టిస్తున్నామని అమరావతి రాజధాని కట్టేందుకు సహకరిస్తున్నామని అని చెప్పారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందన్నారు. పాలన ఏ విధంగా ఉందో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. 15 నెల ముందు ఆంధ్రప్రదేశ్ పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని ఇప్పుడు ఆంధ్రాని చంద్రబాబు నాయుడు వెలుగులోకి తీసుకు వస్తున్నారని ఆయన అన్నారు. బిజెపి ఉండే దేశమును అభివృద్ధి పదంలో తీసుకెళ్లడానికేనని కేంద్ర రాష్ట్ర పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లండి అని పిలుపునిచ్చారు. దేశం రూపురేఖలు మార్చేందుకు మోడీ సూచనలు సేవలు దేశానికి ఎంతైనా అవసరం ఉందని చెప్పారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, పరశురామరాజు, శివ ప్రకాష్ రెడ్డి, ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో బిజెపి సారథ్యం సభకు భారీగా తరలి వెళ్ళిన నాయకులు..



ఎలమంచిలి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన సభకు ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధి నుండి బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి ఆధ్వర్యంలో భారీగా నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. పట్టణంలోని బిజెపి కార్యాలయం వద్ద ఆదివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోగల బిజెపి నాయకులు భారీ ర్యాలీగా సమావేశంలో పాల్గొనడానికి వెళ్లారు. బిజెపి నాయకులు సుందరపు సన్యాసిరావు, ఆడారి శ్రీధర్, కర్రి జానకిరామ్, మల్ల కొండబాబు, ఎల్లపు శేషు, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో యధేచ్ఛగా గోమాంసం విక్రయాలు...అధికారులు ఉన్నారా..

ఎలమంచిలి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



పట్టణంలోని గోమాంసం విక్రయాలు యదేచ్ఛగా జరుగుతున్నాయి. రూరల్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ గ్యారేజ్ కూత వేటు దూరంలోనే షెడ్డులు వేసి మరి ఈ విక్రయాలను సాగిస్తున్నారు. గోవదను నిషేధించామంటూ ప్రభుత్వాలు తెలియజేస్తున్న ఇక్కడ మాత్రం ఆ నిషేధం ఎక్కడా కనబడటం లేదు. సాధారణ మార్కెట్ కంటే ఇక్కడ విక్రయాలు అధిక మొత్తంలో జరుగుతున్నట్లు సమాచారం. షెడ్లు వేసుకుని ఇంత వ్యాపారం జరుగుతున్న అధికారులు చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గోవధను నిషేధించాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ గోవదలోని అవి బతికున్నవా చనిపోయినవా అని కూడా తెలియకుండా వాటిని విక్రయాలు జరుగుతూ ఉంటారని కొందరు విమర్శిస్తున్నారు. ఏదేమైనా నాయకులు కూడా దీని మీద ప్రత్యేక దృష్టి సారించి పూర్తిస్థాయిలో ఈ గోవధను అరికట్టాలని డిమాండ్ భారీగా వినిపిస్తుంది.

## అధికారుల పర్యవేక్షణ లేకుండా నిర్మాణ పనులు : ప్రగడ నాగేశ్వరరావు



ఎలమంచిలి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతో ప్రతిష్టాత్మకంగా అచ్చుతాపురం అనకాపల్లి రోడ్డు విస్తరణ చేపట్టారు. ఈ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు కనీసం అధికారులు పర్యవేక్షణ లేకుండా నిర్మాణాలు ఏమిటి అంటూ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణలోనే నిర్మాణ పనులు జరగాలని దీనికి సంబంధించిన అధికారులు అధికారులను ఆదేశించారు.

## దీక్షలు వెనుక పరమార్ధం తెలుసుకోవాలి : వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీహరిరాజు

నక్కపల్లి, సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



సనాతమైన హిందూ ధర్మంలో భక్తులు చేపట్టే పూజలు, దీక్షల వెనుక ఎన్నో పరమార్ధాలు, ఆరోగ్య సూత్రాలు దాగి వున్నాయని, వాటి గురించి తెలుసు కున్నప్పుడు తప్పకుండా ప్రయోజనం చేకూరుతుందని వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టుముక్కల శ్రీహరి రాజు చెప్పారు. మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయంలో ఆదివారం భవానీ దీక్షాపరులనుద్దేశించి ఆయన మాట్లాడారు. సృష్టికి మూలమైన జగన్మాత అనేక రూపాల్లో, అనేక చోట్ల దర్శనమిస్తుంటారని, చిత్తశుద్ధితో మనసు ను అమ్మవారి పాదాలపై నిమగ్నం చేసే పూజల వల్ల ఎంతో ఫలితం వుంటుందన్నారు. దీక్షల వెనుక ఎన్నో ఆరోగ్య చిట్కాలు దాగి వున్నాయని చెప్పారు. అనేక గ్రామాల్లో ఇంటిల్లిపాది అమ్మవారి దీక్షలు చేపట్టడం వల్ల ఆయా కుటుంబాలు, గ్రామాలు సుభిక్షంగా వుంటాయని చెప్పారు. ఆదివారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, చందనాడ ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వైసీపీ నాయకులు మనబాల తాతారావు, తళ్లా భార్గవ్, నెల్లిపూడి సర్పంచ్ సురేశ్ రాజు రేబాక గూడుపమ్మతల్లిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భవానీదీక్షా పరులు బొడ్డాప్రసాద్, మహేశ్, తోట రాజు, బండి సతీశ్, పి.శ్రీను, "జయ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌విఎస్ ఆచార్యులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం.!




(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎన్.వి.ఎస్. ఆచార్యుల కు ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య, రాష్ట్ర శాఖ వారి ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారాన్ని అందజేశారు. ఈనెల 5న ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామని, ఉపాధ్యాయవృత్తిలో అంకిత భావంతో పనిచేసిన బ్రాహ్మణోత్తమ ఉపాధ్యాయులను రెండు తెలుగు రాష్ట్రాల తరపున గుర్తించి ఈ పురస్కారాలను అందజేయడం జరిగిందన్నారు. ఆదివారం గుంటూరులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా, జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి (జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం,తిరుపతి), డా.మంజుల చింతలపాటి (ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సంగీత విభాగం), కౌతా సుబ్బారావు,(కౌతా ధర్మ సంస్థల అధినేత), మంగళంపల్లి అంజిబాబు(రాష్ట్ర బ్రాహ్మణసంఘం ప్రతినిధి) పాల్గొని వారిచేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందించడం జరిగిందని అవార్డుగ్రహీత ఎన్.వి.ఎస్.ఆచార్యులు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల తరపున ఈ పురస్కారం అందుకోవడం మరచిపోలేనిదని ఆయన అన్నారు.గత 15 సంవత్సరాలుగా ఆచార్యులు ఎన్నో పురస్కారాలు వరించాయని, ఆయన పనిచేసిన పాఠశాలల్లో అకడమిక్ అంశాలపైనే కాక దాతలు, పూర్వ విద్యార్థులనుండి పాఠశాలల అభివృద్ధికి కృషిచేయడం, సెలవురోజులలో గ్రామాల్లో విద్యార్థులకు కథలు చదివించడం, గ్రంథాలయాలలో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొని వాటిపట్ల అవగాహన కల్పించడం, చిన్నారులను పద్యపఠనంపై ప్రత్యేక శిక్షణనిచ్చి పోటీలను నిర్వహించి జిల్లా,రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేలా చేయడం వంటి వివిధ అంశాలపై ఆయన ప్రత్యేకశిక్షణనిచ్చి చిన్నారులను మెరికల్లా తీర్చిదిద్దడం, భాషోత్సవాలను నిర్వహించి మాతృభాషపై మమకారం పెంచడం ,స్వంత ఖర్చులతో బహుమతులను ఇవ్వడం,పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలలు. కమ్యూనిటీ సెంటర్, దేవాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం,వంటి అంశాలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. దేవాదాయ శాఖ మాజీ ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, మాట్లాడుతూ భావి భారతానికి ఉపాధ్యాయులే రూపకర్తలని,సమాజ దార్శనికులని,పేర్కొన్నారు. సమాజం పట్ల చిత్తశుద్ధితో,గురుతర బాధ్యతతో వ్యవహరిస్తున్న వారి సేవలను ఆపన్న ప్రదీపనా బ్రాహ్మణసేవాసంఘ సమాఖ్య గుర్తించి వారిని ఘనంగా సత్కరించుకోవడం ఒక అదృష్టమని అన్నారు. ఎస్.టి.విష్ణువర్ధన్ (అధ్యాపకులు సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి) బ్రాహ్మణసంఘం ప్రతినిధులు బందా రవి, పాండురంగారావు,తుళ్ళూరి రమేష్, కాణిపాకం అర్చక పురోహిత విభాగం అధ్యక్షులు కె.లక్ష్మీనారాయణ, కార్యదర్శి మామిళ్ళపల్లి అయ్యన్న, రాష్ట్ర బ్రాహ్మణసంఘం ప్రతినిధి రాంభద్రుడు పాల్గొన్నారు.

## మూడో రోజుకు చేరిన ఏపీటీఎఫ్ ఆందోళన

(నక్కపల్లి, ప్రభాతవార్త)



ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన నిరసన వారంలో భాగంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకు చేపట్టిన ఆందోళన కార్యక్రమం మూడో రోజుకు చేరింది. ప్రజాప్రతినిధులను కలిసే కార్యక్రమంలో భాగంగా తమ సమస్యల పరిష్కారం కొరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత వ్యక్తిగత కార్యదర్శి వారికి మోమరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కేకేఎల్ఎన్ ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్ దాడిశెట్టి కొండల రావు, రాయవరం మండల బాధ్యులు జి. సునీల్, శ్రీనివాస రావు, పాయకరావుపేట మండల శాఖ బాధ్యులు సత్య మహేశ్, నాయకులు దొండపాటి రమేష్, అల్లు అప్పలరాజు, గోవింద రావు, కాదంబరి శ్రీనివాస్, గొంతి అప్పారావు, పిన్నింటి చంద్రరావు లు పాల్గొన్నారు.

## విలియం కేరిని సత్కరించిన గ్రామస్తులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

రాష్ట్ర హోమ్ విపత్తుల నిర్వహణ శాఖ మంత్రివర్యులు వంగలపూడి అనితమ్మఆశీస్సులతో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ గా నియమితులైన పల్లా విలియం కేరి ఆదివారం పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు సికోలు కొండబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట మార్కెట్ వైస్ చైర్మన్ కంకిపాటి వెంకటేశ్వర రావు (బాబులు), కీర్తి సీతారామ్, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు వద్దాది వాసు, గ్రామ అధ్యక్షులు బొలిశెట్టి నాగేశ్వరరావు, సత్యవరం ఉపాధ్యక్షులు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు సిద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఏనుగు చిన్నా, కుంద్రపు రాజా, సత్యవరం టిడిపి గ్రామ ప్రధాన కార్యదర్శి కే. ముత్యాలు కూలి,నానాజీ, పాయకరావుపేట పీఏసీ డైరెక్టర్, గ్రామ పెద్దలు బోడపాటి నాగేశ్వరరావు, కోంద్రపు కృష్ణ, కుంద్రపు వీరన్న, రజాల లక్ష్మణ్, రాంపండు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.



## వయోజన విద్యా కేంద్రం ఏర్పాటు!

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలం లోని చిన్నదొడ్డిగళ్ళు గ్రామం రెల్లి కాలనీ లెటర్స్ ఇండియన్ ట్రస్ట్ సహకారంతో డిఎల్ పురం తేజ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మహిళలు చదువు నేర్చుకోవాలని ఉద్దేశంతో వైఎస్ జన విద్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గెట్టం నానాజీ, కర్రీ నూకరాజు నూకరాజు లు సంస్థ చైర్మన్ దూలపల్లి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బంగారు సత్తిబాబు, నైట్ స్కూల్ టీచర్, మహిళలు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సిఐ రామకృష్ణ

నక్కపల్లి, ప్రభాతవార్త



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ విషయంలో వ్యాపార సంస్థలు రహదారిపై ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ లడ్డు రామకృష్ణ హెచ్చరించారు. ఎస్సై విభీషణరావు ఆధ్వర్యంలో అడ్డురోడ్డు -రేవు పోలవరం రహదారి మార్గంలో ఉన్న వ్యాపార సంస్థల యజమానులతో శనివారం సాయంత్రం సమావేశం షాపులు వద్ద వాహనాలను నిలుపుదల చేసి రహదారి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ,ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

## బద్దా ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించిన టిడిపి నాయకులు



(నక్కపల్లి, ప్రభాతవార్త)

కాలుకు సర్జరీ ఇంటిదగ్గ చికిత్స పొందుతున్న పట్టణ టిడిపి దళిత సంఘం నాయకుడు భద్ర ప్రకాష్ కుమారుడును హాలో పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో కర్రి వెంకట సత్యనారాయణ (కేవీ), స్కూల్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్, అల్లాడ సన్యాసిరావు, తాతారావు, బండారు అనంతలు కలిసి ఇంటికి వెళ్లి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గ్రామస్తులు శాంతియుత దీక్షలు.. అడ్డుకున్న పోలీసులు

(నక్కపల్లి, ప్రభాతవార్త)



బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయవద్దని రాజయ్య పేట గ్రామంలో మత్స్యకారులు శాంతి యుతంగా రిలే నిరాహారదీక్షలు ఆదివారం నుంచి ప్రారంభించారు. మండలంలోని రాజయ్య పేటలో ఆందోళనకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు ఎరుపల్లి నాగేష్,పిక్కి సత్తయ్య, ఎం. మహేష్‌బాబు, జీ.సోమేశ్వరరావు, ఎం.సూరిబాబు, డి.నానాజీ, ఎం.నరేష్,ఏ.మాదవ్, కె.కాశీ, పి.నల్ల,సిహెచ్ వసంతమ్మ, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అవిశ్వాస భయంతోనే మళ్లీ వైసీపీ గూటికి

అనకాపల్లి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



మునగపాక ఎంపీపీ మళ్ల జయలక్ష్మి వైసిపి పార్టీ అవిశ్వాసం పెడతారని భయంతో జనసేన పార్టీ నుండి తిరిగి సొంత గూటికి వెళ్లారని నాగులపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు ఎల్లపు వెంకట భాస్కరరావు పత్రికా సమావేశంలో ధ్వజమెత్తారు. ఎంపీపీ తన స్వంత స్వలాభం కోసమే జనసేన పార్టీలో చేరిందని తెలిపారు. ఆమె స్వలాభం తో జనసేన పార్టీ లోకి వచ్చారని, ఇపుడు అవిశ్వాస భయంతో మాట మార్చారని, అసత్య ప్రకటనలు మానుకోవాలని తెలిపారు. అనంతరం మండల జనసేన పార్టీ నాయకులు ఎ.వి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయ్ కుమార్ నియోజకవర్గం లో అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారని జయలక్ష్మి వైసీపీలో ఎంపీపీగా ఉండి మండలంలో ఏమి అభివృద్ధి పనులు సాధించిందని దమ్ముంటే బహిరంగ చర్చకి రావాలని అన్నారు. ఎమ్మెల్యే పై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అల్లవరపు రమణబాబు, వేగి కృష్ణ, ఎల్లపు సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ధార్మిక చింతన, సామాజిక సద్భావన ధ్యేయం



అనకాపల్లి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ ల కోసమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ఏర్పడిందని ఆర్ఎస్ఎస్ ప్రచారక్ వి.హరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ సభ్యులు విల్లూరి శ్రీనివాసరావు, అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ దాడి వాసు పేర్కొన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. బంకుపల్లి సత్యనారాయణ సభా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ ప్రచారక్ వి. హరి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్రపతి శివాజీ, బాల గంగాధర్ తిలక్ గొప్పతనాన్ని తెలియజేస్తూ హిందూ మతానికి, ధర్మానికి వారు చూపిన మార్గమే మనకు శిరోధార్యమన్నారు. కేవలం తొమ్మిది రోజులతో వినాయక నవరాత్రులు ముగిసి పోలేదని ధర్మ చింతన, పర్యావరణ పరిరక్షణ సామాజిక సద్భావన కలిగి మనం ముందుకు నడవాలని అందరికీ సూచించారు. విల్లూరి శ్రీనివాసరావు, దాడి వాసు, బొడ్డేడ అప్పారావు, సహ కన్వీనర్ ఆళ్ల ప్రవీణ్ కుమార్, నర్సీపట్నం నుండి వచ్చిన పంచాడ హరినాథ్, వెలగ జగన్నాథం తదితరులు మాట్లాడుతూ వినాయక నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించిన ప్రతి ఒక్కరికి అభినందనలు అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసి గణేష్ మండపాలకు విద్యుత్తు బిల్లులు, మండపాల చలానాలు లేకుండా ప్రభుత్వ సహకారం అందేలా చూసిన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గోకరాజు గంగరాజుకి, అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, కార్యదర్శి పాకాల త్రినాధులకు, సంస్థ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హిందూ భక్తులను కాకుండా హిందూ వీరులను తయారు చేసి అన్యమత ప్రబోధాలకి ఎవరూ లొంగకుండా హిందుత్వాన్ని కాపాడడానికి, ఇతర మత దాడులను త్రిప్పికొట్టడానికి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చే విధంగా యువతను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరిబిల్లి రమేష్, దాడి వెంకట సన్యాసిరావు, కుంచా చిన్న, నీలేష్ గుప్తా, మల్ల రామచంద్రరావు, కాంద్రేగుల హైమావతి, కర్రీ లీలా నాయుడు, వేల్పుల వీధి వి . స్టార్ గైస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విమర్శించే స్థాయి నీది కాదు : వసంతవాడ దిన్ బాబు

ఎలమంచిలి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమాలు తీయకూడదు మాట్లాడిన వైఎస్ఆర్సిపి మాజీమంత్రి రోజాపై రాంబిల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు ప్రశ్నించారు. ఆదివారం వసంతవాడ దిన్ బాబు తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దిన బాబు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను విమర్శించే స్థాయి నీది కాదని, నీవు మంత్రిగా ఉంటూ జబర్దస్త్‌లో అసభ్యకరమైన డాన్సులు చేస్తూ ఆ రోజు సమాజానికి ఏం సందేశం ఇచ్చావు అంటూ ఎద్దేవా చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డబ్బు సంపాదించుకోవాలనే యావలేదని ఉన్న ఆస్తులనే పేద ప్రజలకు పంచిపెడుతున్నారన్న విషయం తెలుసుకొని మాట్లాడితే మంచిదని అన్నారు. నీవు మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్ర 100 కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జ్ అందుకూరి ప్రసాద్ పాల్గొన్నారు.

## గొలుగొండ విచ్చేసిన సినీ నటుడు సుమన్



గొలుగొండ సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

ప్రముఖ సినీ నటుడు సుమన్ ఆదివారం అనకాపల్లి జిల్లా గొలుగొండ విచ్చేశారు. కొత్తపాలెం గ్రామానికి చెందిన అప్పన నాగేశ్వరరావు( బాబులు) సుమన్‌కు అభిమాని తద్వారా సుమన్‌ను గొలుగొండ విచ్చేయాలని ఆహ్వానించడంతో ఆదివారం వచ్చారు. గొలుగొండ మాజీ ఎంపీటీసీ గండెం ఈశ్వరరావు కుమారుడు సాయి బాలాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతి చెందిన సాయి బాలాజీ తన మేనల్లుడు మృతిపై అభిమాన నటుడుకి తెలియజేయడంతో పాడేరు పర్యటనకు వచ్చిన సుమన్ గొలుగొండ విచ్చేచేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా విచ్చేసిన సుమన్ ను చూసేందుకు మండలంలో పలు గ్రామాల నుండి అభిమానులు తరలి వచ్చారు. ఎన్నో ఏళ్లగా సినిమాల్లో నటుడుగా సుమన్ ప్రజలందరికీ సుపరిచితుడే.. ఇటువంటి నటుడు మన మండలానికి వస్తున్నాడని తెలియడంతో భారీగా జనం గొలుగొండ చేరుకొని సుమన్ చూశారు.

## గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



గొలుగొండ సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

ఆధునీకరించిన రేషన్ కార్డులను పలు గ్రామాల్లో కూటమి నాయకులు పంపిణీ చేశారు. పాకలపాడు, పుత్తడిగైరంపేట, కసిమి పంచాయతీల్లో కోటమి నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. స్మార్ట్ విధానంలో రేషన్ కార్డును ఆధునికరించి ప్రభుత్వ లబ్ధిదారులకు అందజేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అన్ని విధానాల్లో మార్పు తీసుకొస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వంలో కాకుండా రేషన్ కార్డు లేని వారికి వీటితోపాటు కొత్త కార్డులను అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ కార్యదర్శి ఆర్ పి నాయుడు, నారాయణరావు, బాబురావు తో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళు

### పంచాయతీ భవన శంకుస్థాపనలో జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్

కొయ్యూరు సెప్టెంబర్ 14 ప్రభాతవార్త



రాష్ట్రంలోని ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళువంటివని జిసిసి మాజీ చైర్మన్, టిడిపి నేత ఎంవివి ప్రసాద్ అభివర్ణించారు. మండలంలోని చింతలపూడి పంచాయితి భవన నిర్మాణానికి రూ.32 లక్షల నిధులు మంజూరవడంతో ఆదివారం ఆయన సర్పంచ్ సెగ్గే రమాదేవి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు తోపాటు అభివృద్ధి కార్యక్రమాలులో కూడా దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామమూర్తి, పంచాయితి అద్యక్షులు కోర్రు పుల్లయ్య, గ్రామకమిటీ అధ్యక్షులు బొంకుల గడ్డయ్య, యూనిట్ ఇన్చార్జి పోటుకూరి సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ కిలే బాలరాజు, ధూపం శ్రీను, ఉల్లి సూరిబాబు,డి. కనకరాజు, కె. భాష్కరావు, డి.మహేష్, ఎం కృష్ణ, ఎస్. సన్యాసిరావు,టి. సంజీవ్ రావు, ఎస్. మురళీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత ఎంతో ఉన్నా.. సౌకర్యాలు సున్నా...!

### చింతాలమ్మతల్లి దేవాలయ పరిస్థితిపై భక్తుల అసంతృప్తి

కొయ్యూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



ఈ చుట్టుపక్కల ప్రాంతంలో ఎంతో ఆధ్యాత్మికత సంతరించుకున్న కొయ్యూరు, కృష్ణదేవి పేట మధ్య వేంచేసియున్న శ్రీ చింతాలమ్మ తల్లి దేవాలయం సౌకర్యాల లేమితో భక్తులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం దేవాలయం ఒకవైపు భాగం కొద్దికొద్దిగా శిథిలావస్థకు చేరుకుంటుండడంతో పాటు ఆలయ ప్రాంగణంలో కనీస అవసరమైన తాగునీటి సౌకర్యం లేదు. దీనితో రోజూ దూర ప్రాంతాల నుండి వందల సంఖ్యలో వస్తున్న భక్తులు అసౌకర్యాన్ని చదివిస్తున్నారు. కేవలం మంచినీటి కోసం సుదూరంలో ఉన్న వేరే గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది.

### తాగునీటి సౌకర్యం కల్పించాలి : రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజు

ఇదిలా ఉండగా ఆదివారం ఆలయానికి విచ్చేసిన రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజు ఆలయం వద్ద తాగునీటి సౌకర్యం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, అధికారులు స్పందించి తాగునీటి బోరు నిర్మించాలని కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## సిఐటియు మండల నూతన కమిటీ ఏకగ్రీవం

చింతపల్లి సెప్టెంబర్ 14 ప్రభాతవార్త




చింతపల్లి మండలం సిఐటియు మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఆదివారం జరిగిన సీఐటీయూ విస్తృత స్థాయి సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికలు సిఐటియు నూతన మండల కన్వీనర్ గా సాగిన చిరంజీవి, కో కన్వీనర్‌గా పెంటమ్మ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో 23 మంది మండల కార్యవర్గ సభ్యులుగా ఉన్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. మండలంలో 16 రంగాల నుంచి ఈ ప్రాతినిధ్యం ఉండనని, రానున్న మూడు సంవత్సరాల కాలంలో ఈ కమిటీ మండలంలో ఉన్న కార్మికుల సమస్యల కోసం అలుపెరగని పోరాటం చేయాలని దిశా నిర్దేశం చేసామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి సత్యనారాయణ జిల్లా కార్యదర్శి జి సత్యనారాయణ, వెంకటి, ఇందు, వివిధ రంగాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న సినీనటుడు డా.సుమన్

### ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం -రెండేళ్లు తర్వాత కూటమి పాలనపై అభిప్రాయం చెప్పవచ్చు: సినీ నటుడు సుమన్

పాడేరు,సెప్టెంబర్14, ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదేవత మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీమోద కొండమ్మ అమ్మవారిని ప్రముఖ సినీ నటుడు,కరాటే లెజెండ్ డా.సుమన్ తల్వార్ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.డా.సుమన్ కు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రమణ్యం శర్మ, ప్రధాన కార్యదర్శి కిల్లుకోటీ బాబు, సభ్యులు స్వాగతం పలికారు.అమ్మవారి గర్భగుడి లో సినీనటుడు డా.సుమన్ తల్వార్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటి, సభ్యులు సుమన్‌కు అమావారు చిత్రపటాన్ని అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భం గా ఆలయం బయట స్తానికి మీడియాతో సుమన్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో సుమారు 47 ఏళ్లుగా ఉంటున్నానని తనకు గిరిజన ప్రాంతంలో ఎక్కువ అభిమానులు ఉన్నారని పూర్వం తాత ముత్తాతల నుంచి ఇప్పుడు ఉన్న జనరేషన్ వరకూ తనకు ఎంతో మంది అభిమానులు ఉన్నారని తాను ఈ స్థాయిలో రావడానికి గిరిజనుల సహకారం కూడా ఉందన్నారు. అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడానికి పాడేరు రావడం జరిగిందన్నారు. అమ్మవారి ఆశీస్సులు గిరిజనులపై అన్నివేళలా ఉండాలని అమ్మవారిని కోరినట్టు సుమన్ తెలిపారు. గిరిజనులకు మంచి జరగాలన్నారు. గిరిజన ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని విద్య,వైద్య రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. గిరిజనులు చదువుపై ప్రత్యేక దృష్టి పెడితే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అన్నారు. గిరిజనులకు అన్ని వేళలా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఎస్టీ, ఎస్సి, బిసి మైనార్టీ, ఆదివాసీలకు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ పాలన ఈ విధంగా ఉందని ప్రశ్నించగా రెండున్నర ఏళ్ల పూర్తి ఐతెగానే చెప్పలేమని ఐతే ఒక్కటి మాత్రం నిజం మంచి జరిగితే బాగుందని చెడు జరిగితే బాగోలేదని చెప్పాలని ఎవరో చెబితే విమర్శలు చేయడం మంచిది కాదు ఎవరు చెప్పింది నమ్మకండి.. విమర్శలు చేయవద్దని సుమన్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో లోపాట ఎన్ జరుగుతుందో బయట ఎం జరుగుతుందో చెప్పలేమని రెండున్నర ఏళ్ల పాలనలో తర్వాత అభిప్రాయం చెప్పవచ్చున్నారు. గతంలో రాజీకీయ పార్టీల నాయకులు వ్యవహార శైలీ పద్ధతిగా ఉండేవని ఇప్పుడు రాజకీయ పార్టీల నాయకుల పద్ధతులు పూర్తిగా మారిపోయిందని మార్టీలు మారడంపై సుమన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## గంజాయి జోలికి వెళ్లొద్దు : ఎస్.ఐ శివకుమార్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త



గంజాయి జోలికి వెళ్లి ఉజ్వలమైన భవిష్యత్తును పాడు చేసుకోవద్దని రాజవొమ్మంగి ఎస్.ఐ శివకుమార్ అన్నారు. ఆదివారం లబ్బర్తి గ్రామంలో పోలీసు జన మైత్రి కార్యక్రమం జరిగింది. ఎస్.ఐ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, అమ్మడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. యువత గంజాయి, సారా జోలికి వెళ్లి ఉజ్వల భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ శివకుమార్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం..

### గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు




రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త

పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. ఆదివారం రాజవొమ్మంగిలో సిఐటియు మండల సమీక్ష సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు పి.రామ రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశాన్ని హాజరైన లోతా రామారావు మాట్లాడుతూ కార్మికుల అనేక సమస్యలతో అనేక సమస్యలతో సతమతమవు తున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్తులో జరిగే ఐక్య ఉద్యమాలకు కార్మికులు సిద్ధపడాలని పిలుపునచ్చారు. ఈ కార్యక్రమంలో కె వెంకటలక్ష్మి, టి శ్రీను, సత్యవతి, వరలక్ష్మి, రత్న కుమారి పాల్గొన్నారు.

## టైఫాయిడ్ కేసులు నేపథ్యంలో నీటి పరీక్షలు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త



వార్తలో ఆదివారం వచ్చిన టైపాయిడ్.. చికెన్ గున్యా విజృంభణ. వచ్చిన వార్తపై వైద్యాధికారులు స్పందించారు. లాగరాయి పి.హెచ్. సి వైద్యాధికారి శరత్ చంద్ర పర్యవేక్షణలో త్రాగునీటి శాంపిల్స్ సేకరణ చేసి ఎం.ఎల్.హెచ్.పిలు ఆదివారం పరీక్షలను చేశారు. లబ్బర్తి, లాగరాయి, కింద్ర గ్రామాల్లో కొళాయిలు, బావిలో నుండి నీటిని తీసుకొని బ్యాక్టరీయా పరీక్షలను నిర్వహించారు. క్లోరోక్విన్ లిక్విడ్‌తో చేశారని తెలిసింది. వ్యాధులకు కారణమైన బ్యాక్టరియా నీటిలో ఉంటే నీరు రంగు నలుపుగా మారుతుందని సమాచారం. నీరు త్రాగడానికి పరిశుభ్రత పై వెంటనే నిర్ధారణ పరీక్షలు, ఒక రోజు తరువాత వచ్చే ఫలితాలు ఉంటాయని యం.ఎల్. హెచ్.పిలు తెలిపారు. 13న లాగరాయి పి.హెచ్.సి పరిధిలో జ్వరాలతో 20 మందికి పరీక్షలు చేయగా 12 మందికి టైపాయిడ్ అని నిర్ధారణ అయ్యింది. యం.ఎల్ హెచ్.పిలు సుష్మ, బాగ్యలక్ష్మీ, సి.హెచ్.ఓ సత్యవతి, యం.టి.ఎస్ సోమరాజు రెడ్డి,, హెల్త్ అసిస్టెంట్ రాజబాబు, ఏ.ఎన్.ఎం.వెంకటలక్ష్మి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## లోదొడ్డి గ్రామంలో పోలీస్ జనమైత్రి

రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త



లోదొడ్డి గ్రామంలో ఆదివారం జడ్డంగి ఎస్. ఐ.చినబాబు ఆధ్వర్యంలో పోలీసు జనమైత్రి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్.ఐ.చినబాబు మాట్లాడుతూ సామాజిక సమస్యలు, చట్ట విరుద్ధ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా, వినియోగం వలన కలిగే తీవ్ర పరిణామాలను వివరించారు. అలాగే బాల్యవివాహాలను నివారించడంలో గ్రామస్థులు చురుకుగా ముందుకు రావాలన్నారు. గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు రవాణా నియమాలను పాటించాలన్నారు. ఉద్యోగ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పొలాలలో అక్రమంగా విద్యుత్ వైర్లు వేయడం వలన జంతువులు, మనుషులు ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు జరుగుతున్నందున, అటువంటి ప్రాణాంతక చర్యలను తక్షణం మానుకోవాలని గ్రామస్థులకు తెలియజేశారు. యువత గంజాయి జోలికి పోవద్దన్నారు. చదువు, ఉద్యోగం, క్రీడలు, సమాజ సేవ వంటి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు పోలీసులు వాలీబాల్ కిట్‌ను ఎస్.ఐ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్.ఐ చినబాబు, కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## పి.హెచ్.సిల్లో గర్భం రాకుండా మందు.. మోతాదుకు మించితే ప్రమాదకరం

### రాష్ట్ర హెల్త్ జాయింట్ డైరెక్టర్ డా. జనార్ధన్

రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త



కాన్పుకు కాన్పుకు మధ్య ఎడబాటు వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్యకరమని రాష్ట్ర హెల్త్ జాయింట్ డైరెక్టర్ డా.జనార్ధన్ తెలిపారు. లాగరాయి పి.హెచ్.సి పరిధిలో టైపాయిడ్, చికెన్ గున్యా వ్యాదులు ప్రభలడంతో రెండు రోజులుగా గ్రామాల్లో సర్వే, పి.హెచ్.సిల్లో సిబ్బంది విధులు, రోగులకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ చేశారు. ఈసందర్భంగా ప్రభాతవార్తతో అయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భం నివారణకు చామా టాబ్లెట్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. టీనేజ్ లో గర్భం రాకుండా నివారణకు మాత్రలు దోహదపడతాయని అన్నారు. కాన్పుకు కాన్పు కు మధ్య ఎడబాటుకు ఐ. యు. డి. టి. సి. యు 380 ఎ మందు ఉందని వైద్యాధికారి సూచనలతో ఉపయోగించవచ్చు నని అన్నారు. ప్రవేటు వైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అయన సూచిస్తున్నారు. రాష్ట్రంలో 1,144 పి. హెచ్. సి లు, 175 సి. హెచ్. సి లు, 52 ఏరియా ఆసుపత్రులు ఉన్నట్లు వెల్లడించారు. బాల్య వివాహాలు జరుగకుండా నివారణ చేయవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరికి ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో ఈకార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డా. డి. జనార్ధన్, రాష్ట్ర ట్రైబుల్ నోడల్ ఆఫీసర్ డా. యం. రమేష్ బాబు, అడిషినల్ డి. యం అండ్ హెచ్ ఓ డా. డేవిడ్, రాష్ట్ర హెల్త్ టీమ్ సూపర్ వైజర్స్ హరి, రామచంద్రుడు, జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ, లాగరాయి డా. శరత్ చంద్ర, ఎ. యం. ఓ భాస్కరరావు, శ్రీనివాసరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, యం. టి. ఎస్ సోమరాజురెడ్డి, సి. హెచ్. ఓ సత్యవతి, పాల్గొన్నారు.

## చింతాలమ్మ తల్లికి పూజలు చేసిన కార్పొరేషన్ డైరెక్టర్



రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త

ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్, రాజవొమ్మంగి మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అదివారం కొయ్యురు మండలం చింతాలమ్మ తల్లికి పూజలను చేశారు. తనకు ఈపదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్ యాదవ్ కు పెద్దిరాజు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని చింతాలమ్మ తల్లిని కోరుకున్నట్లు పెద్దిరాజు అన్నారు. వైస్సార్సీపీ ప్రభుత్వంలో పెద్దిరాజు కుటుంబం నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజవొమ్మంగి సర్పంచ్ గా పెద్దిరాజు అక్క రమణి, బడదనాంపల్లి సర్పంచ్ గా పెద్దిరాజు భార్య లక్ష్మీదుర్గ, లబ్బర్తి ఎంపిటిసిగా పెద్దిరాజు తెలుగుదేశం పార్టీ తరుపున విజయం సాధించి ఒకే ఇంటిలో మూడు పదవులతో చరిత్ర సృష్టించారు. టిడిపి నాయకులు జెట్టి మధుశేఖర్, చిటికెల వెంకటరమణ, విశంశెట్టి సత్తిబాబు, చెక్కా లోవరాజు, టేకు నూకరాజు పాల్గొన్నారు.

## డీఈఓ పూల్ భాషా పండితులకు న్యాయం చేయండి..

పాడేరు,సెప్టెంబర్14, ప్రభాతవార్త

6 నుండి 10 తరగతులు బోధించే భాషా ఉపాధ్యాయులు లాంగ్వేజ్ పండిట్ గ్రేడ్ 2,స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్ 1 అని రెండు రకాలుగా ఉన్నారు. ఇద్దరు చేసే పని ఒక్కటే కానీ హెూదా మరియు జీవితం వేరు వేరు.సుప్రీం కోర్ట్ తీర్పు సమాన పనికి సమానవేతనం అనే తీర్పు ప్రకారం భాషోపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ హెూదా కోసం ఎంతో కాలంగా ఉద్యమం చేయగా 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వీరిని స్కూల్ అసిస్టెంట్స్ గా ఉన్నతీకరరించి లాంగ్వేజ్ పండిట్ వ్యవస్థ రద్దుకు అంగీకరిస్తూ జిఓ నెంబర్ 91 మరియు దానికి అనుబంధంగా మెమో కూడా ఇవ్వటం జరిగింది.అయితే సాధారణ ఎన్నికల కారణంగా నాటి ప్రభుత్వం 91 జిఓని అమలు చేయలేకపోయింది.2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 91జిఓని రద్దు చేసి గత ప్రభుత్వ నిర్ణయాన్ని తోసిపుచ్చి,కొన్ని మార్పులతో ఎస్‌జిటీలకు అనుకూలంగా, పండిట్స్‌కి ప్రతికూలంగా జి ఓ నెంబర్ 77 అమలు చేసి పండిట్స్‌కి తీవ్ర అన్యాయం చేశారు.ఉన్నతికరణ అనగా పండిట్స్ పనిచేస్తున్న పోస్ట్ ఉన్నతీకరణ అవ్వటమే గాక ఆ పోస్ట్‌లో పనిచేసే పండిట్ కూడా ఉన్నతీకరణ కావాలి.కానీ 77 జిఓ ప్రకారం ఎస్‌జిటీలకు ఉన్నతీకరణలో అవకాశం కల్పించటం వల్ల పండిట్స్ పోస్టు కొన్ని ఎస్‌జిటీలతో ఉన్నతికరించారు. దీని వల్ల కొందరు పండిట్స్ ఉన్నతీకరణ పొందలేక, పండిట్ వ్యవస్థ రద్దు అవ్వటంతో అటు పండిట్ పోస్ట్ లేక డీఈఓ పూల్ వ్యవస్థలోకి నెట్టివేయబడి 6సంవత్సరాలనుండి రెండు సంవత్సరాలకొకసారి మారుమూల ప్రాంతాలకు పని సర్దుబాటు పేరుతో బదిలీ అవుతూ కుటుంబాలకు దూరంగా కాలం వెళ్ళదీస్తున్నారు. ముఖ్యంగా డీఈఓ పూల్‌లో రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయినులు అధికంగా ఉన్నారు. వారు వారి కుటుంబానికి ముఖ్యంగా వారి పిల్లల సంరక్షణకు దూరంగా ఉంటూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. కోర్ట్ వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా విద్యాశాఖ అధికారులు ఆ తీర్పును అమలు చేయటంలో విఫలం అయ్యారు.గతంలో ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి ఇద్దరు వీరి సమస్య త్వరలో పరిస్కారం చేస్తామని మీడియా,సభాముకంగా హామీ ఇచ్చారు.వారి హామీకూడా నెరవేరలేదు.ఇప్పటికైనా వీరి విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని డీఈఓ పూల్ భాషా పండితులు రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ కోరారు.

## ప్రముఖ నటుడు సినీ హీరో సుమన్ ఘన సత్కారం



పాడేరు,సెప్టెంబర్14, ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ మోదకొండ అమ్మవారి ఆలయంలో ప్రముఖ నటుడు సినీ హీరో సుమన్ అమ్మవారిని దర్శించుకోవడం జరిగినది ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు ఆలయ కమిటీ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోనంగి వెంకటరమణ దన్నేటి పలాసిరాము కొంతాల సతీష్ కిల్లు చంద్రమోహన్ కుమార్ లకె రత్నబాయి పలాసి రమణమ్మ గూడెపు సూర్యప్రకాష్ బింగినపల్లి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### భారీ అన్న సమారాధన..

అమ్మవారి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు ఆధ్వర్యంలో పాడేరు వాస్తవ్యులు కీర్తిశేషులు పలాసి లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పలాస రమణమ్మ,సురేష్ భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 16న క్షౌర వృత్తి దారుల దినోత్సవం జయప్రదం చేయండి

రాజవొమ్మంగి, సెప్టెంబరు 14, ప్రభాత వార్త




16న క్షౌర వృత్తి దారుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అధ్యక్షులు కె. త్రిమూ ర్తులు కోరారు. ఆదివారం నాయి బ్రాహ్మణ సమావేశం కమ్యూనిటీ భవనంలో జరిగింది సంఘం నాయకులు వాడపల్లి గంగరాజు మాట్లాడుతూ మంగళవారం సెప్టెంబర్ 16 క్షౌర వృత్తి దారుల దినోత్సవం సంఘ సభ్యు లందరూ ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఆరోజు కమ్యూనిటీ భవనం వద్ద జరిగే మన జెండా ఆవిష్కరణకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాసు లింగబాబు, తాటితూరి శ్రీనివాస్, కోరువాడ బాబురావు, కరాసు సూరిబాబు, శ్రీను, మృత్యుంజయ, మల్లువలస భాస్కర్, ఆదిశేషు, సాయి పండు వంశీ, పాల్గొన్నారు.

## కరాటేతో వ్యక్తిగత భద్రత.. సినీ నటుడు సుమన్




పాడేరు,సెప్టెంబర్14,ప్రభాతవార్త

కరాటే నేర్చుకొని శరీర ధృఢత్వంతో పాటు వ్యక్తిగత భద్రతను కాపాడుకోవా ని సినీ హీరో సుమన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రం పాడేరు తలారసింగి ఆశ్రమ పాఠశాలలో రుద్రమ్మదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన మెగా బెల్ట్ టెస్ట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడంతో శరీర ధృఢత్వం పెరుగుతుందని వ్యక్తిగత భద్రత కాపాడుకోవచ్చుని వ్యాయామం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చుని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో స్వచ్ఛమైన గాలి వాతావరణం ఉందని అందమైన ప్రకృతి నీ ఆస్వాదిస్తూ తమ లక్ష్యాలను ఛేదించాలని సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ జోలికి పోవద్దని అయన సూచించారు. ఏజెన్సీ గిరిజన ప్రజలకు ప్రభుత్వం మరింత మెరుగైన వైద్య సేవలు విద్య అందించాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతం నికి తనకు మంచి అనుభవాలు ఉన్నాయని అన్నారు. ఊటీకి మించిన అందాలు అరకులోయ ప్రాంతంలో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లితండ్రులను దైవంలా పూజించాలని తమ గ్రామానికి తమ ప్రాంతానికి మంచి పేరు తేవాలని సుమన్ కోరారు.అనంతరం సర్టిఫికెట్ బెల్టులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ డాక్టర్ వి రవి,లక్ష్మి సామ్రాజ్యం, రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ వంపూరి గంగులయ్య, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వాల్తేర్ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఆత్మహత్య

పాడేరు,సెప్టెంబర్14, ప్రభాతవార్త





కుటుంబ కలహాలు కారణంగా వాల్తేర్ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఎం.సత్యనారాయణ మూర్తి(44) పాడేరు పీఎంఆర్సీ రోడ్డులో రేకల కాలనీకి చెందిన నూతిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే. పాడేరు ఆర్టీసీ డిపోలో గత ఐదేళ్ల క్రితం కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ గాజువాక ఆర్టీసీ డిపోకు బదిలీపై వెళ్లారు. దీంతో విధులు సక్రమంగా నిర్వహించకుండా ఉండటంతో అక్కడ ఆర్టీసీ అధికారులు సత్యనారాయణ మూర్తిని సస్పెండ్ చేసారు. దీంతో పాడేరు వచ్చి వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని ఆ మహిళతో ఉంటున్నాడు. సస్పెండ్‌లో ఉన్న కండక్టర్ సత్యనారాయణ మూర్తికి వాల్తేర్ డిపోలో జాయిన్ కావాలని ఉత్తర్వులు వచ్చాయి. ఐతే ఎంజరిగిందో గానీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కండక్టర్ సత్యనారాయణ మూర్తి ఆదివారం ఉదయం రేకుల కాలనీ బావిలో శవమై తేలిన ఉండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కండక్టర్ భార్య గాయత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు కండక్టర్ మృతదేహన్ని అప్పగించారు. మృతునికి ఒక కొడుకు, కుమార్తె ఆన్నారు.

## న్యూ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక ఆలయ వద్ద ఘనంగా అన్న సమారాధన



పాయకరావుపేట సెప్టెంబర్ 14 ప్రభాతవార్త

పట్టణంలోని రాజుగారి బీడులో గల న్యూ కాలనీలో శ్రీ సిద్ధి వినాయక ఆలయం వద్ద ఘనంగా అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి మహెూత్సవాల్లో భాగంగా వినాయకుని నిమజ్జనోత్సవాలలో భాగంగా ఉత్సవ కమిటీ సభ్యులు,దాతల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ సిద్ధి వినాయకుని ఆలయ వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్త జనాలు హాజరై అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ దోమాడ సుందర రావు,వైసిపి నాయకులు,పేట ఉప సర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు సహా పలురు ముఖ్య నాయకులు,ప్రజా ప్రతినిధులు, సామాజిక వేత్తలు భక్త జనాలు పలువురు పాల్గొన్నారు.

## పలువురు ఆందోళనకారులపై కేసు నమోదు.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

ఆందోళనలకు సంబంధించి ప్రభుత్వ అధికారులు నిబంధనలను పక్కనపెట్టి పరిశ్రమలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన పలువురు పైన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామని సీఐకే. కుమార్ స్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు. బల్క్ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఆదివారం రాజయ్యపేట గ్రామంలో పలువురు గ్రామస్తులతో పాటు సిపిఎం నాయకులు ఆందోళన, తోపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసినదే.! ఈ మేరకు అధికారులు ఆందోళనలకు సంబంధించి కొన్ని ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను దిక్కరించి ఆందోళన చేపట్టిన 12 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

## వామపక్ష నాయకులకు ముందస్తుగా పోలీసులు నోటీసులు..

### కేసులకు భయపడేది లేదు : సిపిఎం "అప్పలరాజు"

(నక్కపల్లి, ప్రభాతవార్త)



బల్క్ డ్రగ్స్ పార్క్‌కు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వామపక్ష నాయకులకు పలువురు మత్స్యకారులకు నిబంధనలు ఉల్లంఘించి ఆందోళన చేపట్టారు. అంటూ సిఐ కే.కుమార స్వామి నేతృత్వంలో సిపిఎం జిల్లా నాయకులు ఏం.అప్పలరాజుకు ముందస్తుగా నోటీసులను అందజేశారు. తన గ్రామమైన ఎస్. రాయవరం మండలం ధర్మవరం వద్ద ఉన్న తన ఇంటికి వెళ్లి నోటీసులు ఆదివారం రాత్రి అందజేశారు. రాజయ్యపేట గ్రామంలో శాంతిభద్రతులకు విఘాతం కలిగించే అవకాశాలు ఉన్నాయని, ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు ఆందోళన చేయడానికి ఎటువంటి అనుమతులు లేవంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టకూడదని అప్పలరాజుకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు. అనంతరం సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ కేసులకు భయపడే ప్రసక్తి లేదని కేసులు కొత్త ఏమి కాదని, ప్రజలకు నష్టం కలిగించే ఏ సమస్యనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని స్థానిక విలేకరులకు నోటీసు అందుకున్నా అనంతరం ఆదివారం రాత్రి చెప్పారు.

## సింహాచలంలో దసరా శరన్నవరాత్రులు

### ఘనంగా పందిరిలాట -22 నుంచి 4 వరకు ఉత్సవాల నిర్వహణ -శ్రీ గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు

సింహాచలం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



సింహాద్రినాథుడు పాదాల చెంత, అడవివరం ఆయిల్ మిల్ ప్రాంతంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహెూత్స వాలు నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి ఆదివారం శ్రీ గణేష్ యువజన సేవా సంఘం కమిటీ సభ్యులు పందిరి రాటను ఘనంగా వేశారు. అర్చకులు రామకృష్ణ ఆధ్వర్యంలో తొలుత కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షులు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, డాక్ యార్డ్ కేటిబి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గడచిన 42 ఏళ్లుగా ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు.. అలాగే దసరా ఉత్సవాలు కూడా ప్రతి ఏటా వైభవంగా జరిపిస్తున్నామన్నారు. దుర్గాదేవి శరన్నవరాత్రులు సందర్భంగా గ్రామమంతా బోనాలు ప్రదర్శన.. అలాగే అగ్నిగుండం ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.. అక్టోబర్ 4న దుర్గాదేవి నిమజ్జనం మహెూత్సవం అంగరంగ వైభవంగా జరిపిస్తామన్నారు. భక్తులు భాగస్వామ్యంతోనే ఆయా కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ యువజన సేవా సంఘం కమిటీ ప్రతినిధులు గంట్ల తమ్మయ్య, కొల్లి వరాహనరసింహం.. అక్కిరెడ్డి శ్రీనివాసరావు,గంట్ల కిరణ్ బాబు, శంకర్ ,మారుతి సుధీర్, అక్కిరెడ్డి మధు, గంట్ల సునీల్, చెక్క ప్రసాద్, దాసరి అను, మూలనాయుడు సేనాతి సురేష్, రెడ్డి పాల్గొన్నారు.

## హెూంగార్డు వైద్యానికి కోడిగుడ్ల ఆర్థిక సాయం

### కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్లకు కృతజ్ఞతలు తెలిపిన హెూంగార్డ్ భార్య

కంచరపాలెం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



గాజువాక ప్రాంతానికి చెందిన హెూంగార్డుగా పనిచేస్తున్న లక్ష్మణరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని తెలిసిన వెంటనే కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు వారికి రూ.50, 000 ఆర్థిక సాయాన్ని అందించడమే కాకుండా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి వారిలో మనోధైర్యాన్ని నింపారు. కష్టమొస్తే క్షణమైనా ఆలస్యమవ్వకుండా సాయం అందించే కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్ఆర్సిపి వార్డు అధ్యక్షుడు శ్రీధర్ లు పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కార్పొరేటర్ పూర్ణిమ సామాన్యులకు కొండంత అండగా నిలుస్తూ వారికి భరోసాను అందించి దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. కేవలం వార్డుకే పరిమితం కాకుండా ఎక్కడున్నా సరే నా వాళ్ళుగా భావించి వారికి ఆర్థిక భోరోసాను అందించి ఆదుకుంటున్నారు. ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా వారికి అండగా నిలిచిన కార్పొరేటర్ పూర్ణిమ శ్రీధర్ దంపతులకు హెూంగార్డు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.లక్ష్మణ రావు పూర్తి స్థాయిలో కొలుకొవాలని కార్పొరేటర్ పూర్ణిమ ఆకాంక్షించారు.కష్టకాలంలో ఆదుకోడంలో ముందుంటామని మరోసారి నిరూపించి సమాజానికి ఆదర్శనీయంగా నిలిచారు.



## దసరా ఉత్సవాలకు అంకురార్పణ

విశాఖపట్నం,సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

విశాఖ దక్షిణ నియోజకవర్గం 29వ వార్డ్ సెంచరీ క్లబ్, వంకల వీధి యూత్ వారు ఏర్పాటు చేస్తున్న శ్రీ దుర్గా దేవి ఉత్సవాలకు రాట కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీ అమ్మవారి ఉత్సవాలకు అంకురార్పణ చేసిన జనసేన సీనియర్ నాయకులు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 142వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ

### ఈ ఆరోగ్య కార్యక్రమం కింద 580మందికిపైగా కంటి పరీక్షలు

విశాఖపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ) తన ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా నేడిక్కడ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 750 మంది హాజరు కాగా 580 మందికి కంటిచూపు పరీక్ష లు నిర్వహించడం జరిగింది. ఉచిత కంటి వైద్య శిబిరంలో 450కి ఉచిత అద్దాలను అందించి 140 మందికి మందులు కూడా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా 57 మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, పలహారాలు, భోజనం సదుపాయం కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ - ఇండియా పార్ట్ నర్ దొరస్వామి ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూ, "బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం" బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్య శిబిరాల ద్వారా స్థానిక ప్రజల ఆరోగ్య సంరక్షణకు అండగా నిలవాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యం అన్నారు.

## ఎన్టీఆర్ సుజుల స్రవంతి వాటర్ ప్లాంట్ పరిశీలన

సింహాచలం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త



భీమిలి నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల తో రాజా వీధి లో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ ను జీవీఎంసీ జోన్ 8 కమిషనర్ శంకర్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 2 రూపాయల వాటర్ స్థానికులకు, భక్తులకి ఎంతో ఉపయోగకరంగా ఉండేది. గత ఐదు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండడంతో అధికారులకు వెంటనే దీనిని అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ పి. వి. నరసింహం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ డి. ఈ. ప్రవీణ్ కుమార్, ఈ. ఈ. దిలీప్ కుమార్, వాటర్ సప్లై ఏ. ఈ.రాజశేఖర్, జీవీఎంసీ వాటర్ సప్లై సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 68వ వార్డు గుడివాడ అప్పన కాలనీలో కొత్త బోరుబావి ప్రారంభం

గాజువాక,సెప్టెంబర్ 14,ప్రభాతవార్త



జీవీఎంసీ 68వ వార్డ్ గుడివాడ అప్పన్న కాలనీ లో నూతనంగా నిర్మించిన బోర్ బావి ని రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుడివాడ లతీష్ పాల్గొని మాట్లాడుతూ వార్డ్ సమస్యలు పరిస్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. బోరుబావి ప్రారంభం కావడంతో కాలనీలోని ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగవుతుందని నివాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కులో జీతాలు అడిగినందుకు షోకాజ్ నోటీసులా?

విశాఖపట్నం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త

జీతాలు, ఏడాది కాలంలో బకాయి పడ్డ జీతాల ఎప్పుడు ఇస్తారాని అడిగినందుకు కార్మిక నాయకులకు షోకాజు నోటీసులు ఇవ్వడానికి ఉక్కు యాజమాన్యం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఉక్కు ఉద్యోగుల జీతాలు చెల్లించాలని కోరుతూ గుర్తింపు యూనియన్ నాయకుడు ఆదినారాయణ, సీఐటీయూ నాయకుడు అయోధ్య రామ్, ఇంటక్ నాయకుడు ఎస్.ఏ.నాయుడు ఉక్కు ఇంచార్జి సీఎండీ సక్సేనను కలసి విజ్ఞప్తి చేశారు. అయితే సక్సేనను కలసిన తరువాత మార్కెటింగ్ బాగా జరిగితే శనివారం లోపు జీతాలు ఇస్తామని సక్సేనా హామీ ఇచ్చినట్టు ఈ నాయకులు మెస్సేజ్ ద్వారా ఉద్యోగులకు తెలిపారు. అయితే సీఎండీ ఇటువంటి హామీను ఇవ్వలేదని అంటూ ఉద్యోగంలో వున్న నలుగురు నాయకులకు షో కాజు నోటీసులు ఇవ్వడానికి యాజమాన్యం సిద్ధమయినట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీన్ని బట్టి విశాఖ ఉక్కులో ఎలాంటి అరాచక పాలన సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.